
నాటకాలు

# అభిజ్ఞాన శాకుంతలము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన ‘ఇచ్ఛ’ (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

మహాకవి కాళిదాసకృత

# అభిజ్ఞాన శాకుంతలము

ఆంధ్రానువాదము

అనువాదయిత

రాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రి

# భూమిక

కవి :

ఈ గ్రంధకర్త కాళిదాసు. ఈతఁడు మహాకవియేకాఁడు. కవిసార్వభౌముఁడు. కవికులపతి. సంస్కృత వాఙ్మయమున ఆదికవి వాల్మీకి. అనంతర కవి వేదవ్యాసుఁడైన కృష్ణద్వైపాయన ముని. మూఁడవవాఁడు కాళిదాసు. క్రమమున మూఁడవ వాఁడయినను కవితా వైశారద్యమున వారి కగ్రగణ్యుఁడే. "ద్విత్రాః పంచషా వాఁకవయః" అనునానందవర్ధనుని సూక్తికి మొదటి స్థాన మీతనిది.

కవు లెందఱు లేరు? కాని కాళిదాస మహాకవికి సాటియగువారు లేరనుట యతిశయోక్తి కాదు. అందుననే,

శ్లో॥ పురా కవీనాం గణనా ప్రసంగే
కనిష్ఠికా ఉధిష్ఠిత కాళిదాసా,
అద్యాపి తత్తుల్య కవే రభావాత్
అనామికా సార్థవతీ బభూవ.

అను ఆభాణకము వెలువడినది. కాళిదాసకవికిని తరదితకవులకును గల యంతర మనంతము.

శ్లో॥ కవయః కాళిదాసాద్యాః
వయంచాపి కవీశ్వరాః
పర్వతే పరమాణౌ చ
పదార్థత్వం ప్రతిష్ఠితమ్

అని యుండుటచే ఏతద్భిన్న కవులందఱును కవి శబ్ద వాచ్యులు మాత్రమే. తత్ప్రతిభాసము పేతులు మాత్రమరుదు.

కవిత

ఆ మహాకవి కవిత మృదుమధురము. సుకుమార కోమల పదబంధము. సులభావబోధకము. సహజ గంభీరము. అలంకారాలంకృతము. సాదృశ్య చకచ్చకితము. ప్రసాధ గుణ భూయిష్టము. ద్రాక్షా పాకసమాశ్లిష్టము. అట్టి శైలీ సౌష్ఠవ మన్య

కవుల యందగోచరము. సారళ్య సౌభాగ్యము వ్యాస వాల్మీక్యాదులలో నున్నను ఇన్ని విశిష్ట లక్షణములు వారి కవితయందు గాన రావనుట సాహసము కాదు. వారిది పురాణ శిల్పము. కాళిదాసుది నవీన కావ్య శిల్పము. వారిది కథా కథన దృష్టి. వీనిది నవ్య కల్పనా దృష్టి, అందుచేతనే యొక సారస్వత పిపాసు విట్లనెను.

శ్లో॥ కాళిదాస కవితా నవం వయః
మాహిషం దధి సశర్కరం పయః
ఏణమాంస మబలాచ కోమలా
సంభవస్తు మమ జన్మజన్మని.

## కాలము

ఈ మహాకవి ఏ కాల మందుండెను ? ఏ దేశ మందుండెను ? ఏ రాజాస్థానము నలంకరించెను ? అని పలువురు విమర్శకులు విమర్శింప దొడంగిరి.

సంస్కృత సారస్వతమునఁగల కవులకు స్వచరిత్రమును బ్రకటించుకొను నలవాటులేదు. ప్రాచీన శాసనములను బట్టియో, లేక, ప్రాచీన రాజన్యులను బట్టియో యాకవుల దేశకాలాదులను ఊహింపవలసినదే. ఎవ్వరిమాట యెట్లున్నను ఇంతటి మహాకవినిగూర్చి తెలిసికొనకుండుట యుక్తముకాదని యెంచి పలువురు పండితాగ్రేసరులు పరిశీలన నారంభించిరి.

భోజ కాళిదాసు లేకకాలమున నున్నట్లు భోజ ప్రబంధమువలనఁ దెలియుచున్నది. కాన భోజుని కాలమును బట్టి కాళిదాసు పదునొకండవ శతాబ్దివాఁడని యనిరి. కాని యా వాదము యుక్తి దూరము, అపరిగ్రాహ్యము. భోజ ప్రబంధమున వర్ణింపఁబడిన విభిన్న కాలమందలి కవులే యిందుకు నిదర్శనము. భోజుఁడు కూడ కవిపండిత పోషకుఁడని నిరూపించుట కెవ్వరో కూర్చిన గ్రంథముగాని యది ప్రమాణ గ్రంథముగ నంగీకరింపఁదగదు.

బాణభట్ట మహాకవి తన హర్ష చరితమున కాళిదాస మహాకవిని పేర్కొనెను. భట్టబాణుఁడు హర్ష వర్ధనరాజు కాలమున ఆతని యాస్థానమున నున్నట్లు చరిత్రవలన స్పష్టము. ఏడవ శతాబ్దిని హర్షుఁడు రాజుగా నుండెను. కావున కాళిదాసు బాణుని సమకాలికుఁడుగాని, పూర్వుఁడుగాని యయి యుండును యని కొందఱి యభిప్రాయము. ఇది యుక్తమే. కాని దీనినిబట్టి సమాకాలికుఁడనుట దుర్ఘటము. పూర్వుఁడనుటలో విప్రతిపత్తిలేదు.

మల్లినాథ మహాకవి కాళిదాసత్రయ వ్యాఖ్యాత. పంచమహాకావ్యము[illegible] వ్యాఖ్యానము నాతఁడే రచించెను మేఘసందేశ వ్యాఖ్యాన [illegible]

విచుళ కవియు, దిఙ్నాగాచార్యులు వీరిరువురును కాళిదాస సమకాలికులనియు, అందు మొదటివాఁడు సపక్షుఁడు రెండవవాఁడు విపక్షుఁడనియుఁ బేర్కొనెను. చరిత్రకారులు దిఙ్నాగాచార్యుల నారవ శతాబ్దిలో నున్నట్లు చెప్పిరి. మల్లినాథుని మాట నంగీకరించినచో నీ కాళిదాస కవి ఆరవ శతాబ్దివాఁడని యనవచ్చును. కాని యింతకంటె ప్రబల ప్రమాణము లుండుటంబట్టి యిది యంగీకార్యము కాదు.

ప్రాచీన శాసనములలో నొకచోట "కవితాశ్రిత కాళిదాస భారవి కీర్తిః" అను వాక్యము గలదు. అందు పేర్కొనఁబడిన భారవి కాళిదాసులలో భారవి అయిదవ శతాబ్దివాఁడని నిర్ణయింపఁబడినది. దానిచే కాళిదాసు అయిదవ శతాబ్దివాఁడు గాని, యంతకుఁ బూర్వుఁడుగాని కావలెనని మఱికొంద ఱభిప్రాయపడిరి. ఇదియు పై రాబోవు యుక్తులచే పరాస్తమగును, పూర్వుఁడనుటలో విప్రతిపత్తిలేదు. సమకాలికుఁడనుట సందిగ్ధము.

విక్రమాదిత్యుని కాలమున కాళిదాసున్నట్లు ప్రతీతి కలదు.

శ్లో॥ ధన్వంతరి క్షపణకామరసింహ శంకు
భేతాళ భట్ట ఘట కర్పర కాళిదాసాః
ఖ్యాతో వరాహ మిహిరో నృపతే స్సభాయాం
రత్నాని వై వరరుచిర్నవ విక్రమస్య.

ఈ విక్రమాదిత్యుఁడే మౌర్య చంద్రగుప్తుఁడనియు, గుప్తుల కాలమున కాళిదాసుండెననియు, గుప్తుల రాజ్యకాలము మూఁడవ శతాబ్ది కావున కాళిదాసు మూఁడవ శతాబ్దివాఁడనియు చరిత్రకారులు చెప్పుచుండిరి.

మఱికొందఱు విక్రమాదిత్యుఁడు మౌర్య చంద్రగుప్తుఁడుః కాఁడనియు, విక్రమ శకమునకు మూలభూతుఁడనియుఁ దలంచిరి. విక్రమశకము క్రీస్తునకుఁ బూర్వము ఏఁబది యారవ సంవత్సరమున నారబ్ధము. దానిని బరిశీలించిన కాళిదాస మహాకవి క్రీస్తునకుఁ బూర్వమొకటవ శతాబ్దిలో నున్నట్లు తెలియుచున్నది.

కాని యీ విమర్శనములందుఁ జూపిన సాధక బాధక యుక్తి జాతమంతయు సునిశ్చితము కానందున కాళిదాసుని కాల మిదమిత్థమని నిశ్చయించుట కష్టసాధ్యము.

దేశము :-

ఇకఁ గాళిదాసున దేదేశమని సందియము. ఆతని యే గ్రంథమందు నియ్యది గోచరింపదు. ఆ మహాకవి యందలి గౌరవముచే నెవరికివారే కాళిదాసు మావాఁడే యని పల్కుచున్నారు. కొందఱు మాత్ర మాతని నుజ్జయినీపురవాసి యనిరి. కాశి

దాసకవి కృతమేఘసందేశ మహాకావ్యమున యక్షుఁడు మేఘున కలకాపుర మార్గమును జెప్పు సందర్భమున నంత ప్రసక్తము గాకున్నను ఉజ్జయినీ నగర వర్ణన మధికముగఁ గలదు. దాని నాధారముగఁ గొని పై వారిట్లు సిద్ధాంతీకరించిరి. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అను సూక్తి ననుసరించి స్వనగర వర్ణన ప్రీతి యా కవికిఁ గలిగినదేమో ? చెప్పఁజాలము అట్లు వర్ణించుట కవుల కలవాటనుటలో దోషములేదు. ఆంధ్ర మహాభారతమున నన్నయభట్టారకుఁడు అంత ప్రసక్తముగాక పోయినను వేఁగి దేశమును వర్ణింపలేదా ?

స్వభావము :-

ఈతఁ డెంతటి కవితా సంపద కలవాఁడో యంతటికంటె నధికమగు వినయ సంపద గలవాఁడు తాను రచించిన గ్రంథములందలి వాక్యములే దీనికి నిదర్శనము.

శ్లో॥ మందః కవియశః ప్రార్థీ
గమిష్యామ్యుప హాస్యతామ్,
ప్రాంశులభ్యే ఫలే లోభా
దుద్బాహు రివ వామనః - రఘువంశము

కం॥ మందుఁడ కవియశ మర్థిన్
బొందఁగ మదిఁగోరి హాస్యముల పాలౌదున్
మందమతి వామనుఁడు తన
కందని ఫలములను గోయ నాశించునటుల్-

(నా అనువాదము)

అందని ఫలముల కఱ్ఱులుచాచి చేతు లెత్తిన వామనునివలెఁ దాను కవి యశస్సును గాంక్షించి హాస్యాస్పదుఁడగునట ! ఆహా ! ఎంతటి వినయమిది !

శ్లో॥ ఆపరితోషా ద్విదుషాం
న సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్,
బలవదపి శిక్షితానా
మాత్మన్యప్రత్యయం చేతః - (శాకుంతలము)

గీ॥ నా ప్రయోగ విజ్ఞానము నాణ్యమనుచు
నెంచ విద్వాంసు లెద సంతసించువఱకుఁ
దమ్మఁదా విశ్వసింపదు తన మనస్సు
దృఢము శిక్షితులయిన యూధీశులకును

(నా అనువాదము)

విద్యాంసులు సంతసించువఱకు తన ప్రయోగ విజ్ఞానమును సాధువని తలంపఁడట ! తనకంటె విద్యాంసు లెవ్వరు ? తా నపరసరస్వతి కదా !

ఈతని కహంకార మమకారములులేవు. ఏ పదార్థమునైనను, ఏ కావ్యమునైనను బాగున్నచో గ్రహింపుఁడు. కానిచో విడువుఁడు. వ్యక్తిగతాభిమానమును పరిత్యజింపుఁడు ప్రాఁతదని యభిమానింపకుఁడు క్రొత్తదని పరిహరింపకుడు. పర ప్రత్యయనేయ బుద్ధులు కాకుఁడు. పరీక్షించి మంచినే గ్రహింపుడు. ఇది యితని సిద్ధాంతము. "తాతస్య కూపోఽయమితి బ్రువాణాః క్షారం జలం కాపురుషాః పిబంతి" అను సిద్ధాంతమును నమ్మినవాడితఁడు. దీనికి ప్రమాణము.

శ్లో॥ పురాణ మిత్యేవ న సాధు సర్వం
న చాపి కావ్యం నవ మిత్యవద్యమ్,
సన్తః పరీక్ష్యా న్యతర ద్భజన్తే
మూఢః పరప్రత్యయ నేయబుద్ధిః

(మాళవికాగ్ని మిత్రము)

పరిపూర్ణుఁడా మహాకవి. నిండుకుండ తొణకునా ?

దైవభక్తి :-

ఈ కవి శివభక్తి పరాయణుఁడు. అతని కావ్యాద్యంతములందలి వాక్యములీ యభిప్రాయమును నిరూపించి నిర్ణయించును. అట్లని యితర దైవములందు ద్వేష భావము లేదు.

శ్లో॥ ఏకైవ మూర్తిః బిభిదే త్రిధా సా
సామాన్య మేషాం ప్రథమా వరత్వమ్
విష్ణోర్హ రస్తస్య హరిః కదాచిత్
వేధా స్తయో స్తావపి ధాతు రాద్యౌ.॥

(కుమార సమ్భవము)

మ॥ త్రివిధంబయ్యెను మూర్తి యొక్కటియె యీ
దేవత్రయంబందు లే
దవరత్వంబును జ్యేష్ఠ భావము హరుం
డౌ నాద్యుఁడా చక్రికిన్

భవుకంబెన్నా రి యాద్యుండౌను మతి యా
బ్రాహ్మ్మధవుండాద్యుండా
శివ వైకుంఠుల కౌదురాద్యులు విరిం
చిన్మించి వారొక్కచో

(నా అనువాదము)

మూర్తిత్రయమేకరూపమేయవి యితని నిర్ణయము. అయినను శివప్రార్థనచే శివభక్తిపరాయణుఁడనక తప్పదు.

శ్లో॥ వాగర్థావివ సంపృక్తౌ
వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే
పార్వతీ పరమేశ్వరౌ

(రఘువంశము)

శ్లో॥ వేదాంతేషు యమాహురేక పురుషం వ్యాప్య స్థితం రోదసీ
యస్మిన్నీశ్వర ఇత్యనన్య విషయశ్శబ్దో యధార్థాక్షరః,
అంతర్యశ్చ ముముక్షుభిర్నియమిత ప్రాణాదిభిర్మృగ్యతే
స స్థాణు స్స్థిరభక్తి యోగ సులభః నిశ్శ్రేయసాయాస్తువః

(విక్రమోర్వశీయము)

శ్లో॥ యా సృష్టిస్స్రష్టురాద్యా వహతి విధిహుతం
యాహవిర్యాచహోత్రీ
యే ద్వే కాలం విధత్త శ్రుతి విషయగుణా
యాస్థితా వ్యాప్యవిశ్వమ్,
యా మాహుః సర్వభూత ప్రకృతి రితి
యయా ప్రాణినః ప్రాణవంతః
ప్రత్యక్షాభిః ప్రపన్న స్తనుభి రవతువ
స్తాభి రష్టా భిరీశః

(శాకుంతలము - నాంది)

శ్లో॥ ప్రవర్తతాం ప్రకృతి హితాయ పార్థివః
సరస్వతీ శ్రుతిమహతాం మహీయతామ్,
మమాపిచ క్షపయతు నీలలోహితః
పునర్భవం పరిగత శక్తి రాత్మభూః

(శాకుంతలమ్ - భరతవాక్యము)

ఇవి యన్నియు నాతని శివపారమ్యము నిరూపించునవియే. కావున కాళిదాస మహా కవి శివభక్తి పరాయణుఁడనుట నిర్వివాదము.

కృతులు

ఈ మహాకవి సంస్కృత భాషలో నాలు మహాకావ్యములు రచించెను. అందు రఘువంశము – కుమార సంభవము – మేఘసన్దేశము అను మూడును శ్రవ్య కావ్యములు. సూర్యవంశపు రాజుల చరిత్రము రఘువంశము, పార్వతీ పరమేశ్వర పరిణయాదికము కుమార సంభవము. ఇవి రెండును పురాణముల నాధారముగాఁగొని వ్రాయబడినవి. మేఘ సందేశము కాల్పనికము. ఈ మూఁటికిని కాళిదాసత్రయ మని పేరు. సంస్కృత భాష నభ్యసించు వారలకివి ప్రథమ పఠన యోగ్యములు. వీనిని చదివిననే భాషా పూర్ణత, లేనిచో లోపమే యని ప్రాచీనుల యభి సంధి.

శాకుంతలము :

రూపకములు పది రకములు. ఉప రూపకములుగూడఁ గొన్నికలవు. నాటిక – త్రోటకము – మున్నగునవి. వీనన్నింటియందు నాటకము ప్రథమము, ప్రధానము. రసనాయకేతి వృత్తములనుబట్టి, సంధి సంధ్యంగ విధానమునుబట్టి నాటకము సర్వో త్తమమనుట నిర్వివాదము.

కాళిదాస మహాకవి మూఁడు దృశ్య కావ్యములను రచించెను. మాళవికాగ్ని మిత్రము – విక్రమోర్వశీయము. అభిజ్ఞాన శాకుంతలము. ఇవి యుత్తరోత్తరము ప్రఖ్యాతి నందినవి.

అభిజ్ఞాన శాకుంతల మన్నిటిని మించిన నాటకరాజము. దానికి సాటి మఱి యొకటి కానరాదు. భావ ప్రకటనమున, వర్ణన చాతుర్యమున, పాత్రపోషణమ్మున, రస సంవిధానమున, ఔచిత్య నిర్వహణమున, రచనా సౌష్ఠవమున, దానికదే సాటి. కావుననే అభిజ్ఞుల వచన మీ తీరున వెలువడినది.

కావ్యేషు నాటకం రమ్యం
నాటకేషు శకుంతలా
తత్రాపిచ చతుర్థోంకః
తత్ర శ్లోక చతుష్టయమ్

ఇందుఁ బ్రధానరసము శృంగారము. ఇది సంభోగ శృంగారమని, విప్రలంభ శృంగారమని ద్వివిధము. ఈ భేదద్వయము ఇందు సంపూర్ణముగ నిరూపింపఁ బడెను. తృతీయాంకాంత పర్యంతము సంభోగ శృంగారము పనిబద్ధము. మిగిలిన భాగమున విప్రలంభము – సప్తమాంకమున సమావేశముచేఁ బరిపూర్ణత నందినది.

ఇందు నాయికా నాయకులు శకుంతలా దుష్యంతులు. ఇరువురు ప్రఖ్యాతులే. ఇతి వృత్తము పురాణ ప్రసిద్ధము. మహాభారతమున, పద్మపురాణమున నీ చరిత్ర కలదు.

ఇది పౌరాణిక నాటకమయ్యును ఇందు సాంఘిక ధర్మములు చమత్కార ముగ నిరూపితములు. ముఖ్యముగ వివాహబంధ మెట్లుండవలెనో, అట్లు లేనినాఁడు కలుగు ప్రమాదము లెట్టివో యిందు సూచితములు.

శ్లో॥ అతః పరీక్ష్య కర్తవ్యం
విశేషా త్సంగతం రహః,
అజ్ఞాత చరితే ష్వేవం
వైరీభవతి సౌహృదమ్

కావున నిది సాంఘిక నాటకమనియుఁ జెప్పవచ్చును.

మూలకథ —

వేఁటాడుట కేగిన దుష్యంత మహారాజు కణ్వాశ్రమమును జేరెను. కులపతి యగు కణ్వుఁడాశ్రమమందు లేనందున శకుంతలయే వాని కాతిధ్యము నొసంగెను. తద్రూప మోహితుఁడగు రాజు తజ్జన్మవృత్తాంతమును తన్ముఖముననే విని, యామెను గాంధర్వ విధిచే వివాహమాడి, యామెను విడిచి స్వనగరమునకేగి కాలక్రమమున నీ చరితమును విస్మరించెను.

ప్రవాస ప్రతి నివృత్తుఁడగు కణ్వమహర్షి శకుంతలా చరితమును దన దివ్య దృష్టి వెలింగి యభినందించెను. ఆపన్నసత్వయగు శకుంతల వత్సర త్రయానంత రమున ఆశ్రమముననే ప్రసవించి యొక బాలకుని గనెను. కణ్వుఁడే యా బాలకునకు జాతకర్మాదికము నాచరించెను. అబాలసత్వుఁడగు నా బాలుఁడు ఆశ్రమ సత్వముల నన్నింటిని పీడించుటంజేసి సర్వదమనుఁడను పేరు గాంచెను. అష్టవర్ష దేశీయుఁడగు నా బాలుని శకుంతలను మునుల సాయమున కణ్వుఁడు హస్తినాపురమునకుఁబంపెను. దుష్యంతుఁడు శకుంతలను గుర్తింపియు జనాపవాదమునకు వెఱచి యామెను బాల కుని తిరస్కరించి పొమ్మని పలికెను.

అనేక విధముల శకుంతల వానిని బోధించెను. ఎట్లును అంగీకరింపకయున్న సమయమున ఆకాశవాణి శకుంతల భార్యయనియు, నా బాలకుఁడు కుమారుఁడనియు రాజున కెఱింగించెను. అంత దుష్యంతుఁడు యదార్థమును తెలిపి, లోకాపవాద భీతి నట్లు గావింపవలసినదని పలికి వారిని గ్రహించెను. ఇదియే మూలకథ.

మార్పు :

మహాకవియగు కాళిదాసు నాయకునందలి కళంకమును నివారించుటకును, కథ యందలి మఱికొన్ని యనౌచిత్యములను బరిహరించుటకును మూలగాథను మార్చెను. రసపోషణము – నాయకగుణోత్కర్ష, ఇతివృత్త విస్తృతి – అను మూఁడు ప్రయోజనములను దృష్టియందుంచుకొని మూలకథను మార్చుటకు నాటకీ కవుల కధికారము కలదు. దాని నీఁతడుకూడ పాటించెను.

శకుంతలా జన్మవృత్తాంతమును గౌంతవళకు సఖులద్వారా చెప్పించి నాయికకు ఉత్కర్ష నాపాదించెను. గర్భవతిగా నున్న శకుంతలనే రాజుకడకంపి కాల వ్యవధానమును కొంత సడలించెను.

దుర్వాసశ్శాప వృత్తాంతమును, అంగుళీయక ప్రదానమును గల్పించి నాయకుని యందలి కళంకమును నివారించెను. విప్రలంభరసమును చక్కఁగఁబోషించెను. సానుమతి వృత్తాంతమును కల్పించి కథాగతిని విస్పష్టము గావించెను.

ఇంద్ర వృత్తాంతముద్వారా నాయికా నాయకుల పునస్సమాగమును గల్పించి రసమును పరిపూర్ణము గావించెను. ఈ మార్పులచే నితివృత్తమును పెంచి, నాయకుని భార్యా పరిత్యాగ రూప దోషమును నివారించి ద్వివిధ శృంగార రసములను పోషించి నాటకమును సర్వాంగ సుందరము గావించెను.

ఇట్లు ప్రయోగార్హము ప్రేక్షకానందదాయకము, సర్వాంగ సుందరము, నాటకరాజము అగు రూపకము మఱియొకటి లేదనుట సత్యదూరము కాదు.

ఇతిశమ్ –

ఓం తత్సత్.

---

# నాటక మండలి పాత్రలు

## పురుషులు

| | | |
|---|---|---|
| రాజు | : | దుష్యంతుడు – హస్తినాపుర ప్రభువు కథానాయకుఁడు |
| సారథి | : | దుష్యంతుని రథసారథి |
| వైఖానసులు | : | ఆజన్మబ్రహ్మచారులయిన మునులు |
| విదూషకుడు | : | మాధవ్యుఁడు–రాజునకు అంతరంగిక మిత్రుఁడు |
| దౌవారికుఁడు | : | రైవతకుఁడు – ద్వారపాలకుఁడు |
| సేనాపతి | : | దుష్యంతుని సేనాధికారి |
| కరభకుఁడు | : | వార్తాహరుఁడు |
| మునికుమారులు | : | కణ్వాశ్రమవాసులు – గౌతమాదులు |
| కణ్వుఁడు | : | కులపతి – శకుంతల తండ్రి – కాశ్యపుఁడని నామాంతరము |
| శార్ఙ్గరవుఁడు, శారద్వతుఁడు | | కణ్వశిష్యులు – హస్తినాపుర గాములు |
| సోమరాతుఁడు | : | రాజు పురోహితుఁడు |
| రాజశ్యాలుఁడు | : | రక్షకభటాధికారి |
| కుంభీలకుఁడు | : | జాలరి |
| సూచకుఁడు, జానుకుడు | | రక్షకభటులు |
| మాతలి | : | ఇంద్రసారథి |
| మారీచుఁడు | : | ఇంద్రజనకుఁడు |
| సర్వదమనుఁడు | : | శకుంతల కొడుకు |
| గాలవుఁడు, నారదుఁడు | | మారీచుని శిష్యులు |
| కంచుకి | : | వాతాయనుఁడు |

## స్త్రీలు

| | | |
|---|---|---|
| శకుంతల | : | కణ్వుని కూతురు - కథానాయిక |
| అనసూయ | | శకుంతల సఖులు - |
| ప్రియంవద | | |
| గౌతమి | , | వృద్ధతాపసి |
| ప్రతీహారి | : | వేత్రవతి, ద్వారపాలిక |
| ముని కాంతలు | : | శకుంతలను ఆశీర్వదించినవారు |
| హంసపదిక | : | దుష్యంతుని ప్రణయిని |
| సానుమతి | : | అచ్చర - మేనక సఖి |
| మధుకరిక | | వనపాలికలు |
| పరభృతిక | | |
| తరళిక | : | దుష్యంతుని పరిచారిక |
| వసుమతి | : | దుష్యంతుని పట్టమహిషి |
| దాక్షాయణి | : | మారీచుని పత్ని - దేవమాత |
| యవనకాంతలు | : | దుష్యంతుని పరిచారికలు |

శ్రీరస్తు

# అభిజ్ఞాన శాకుంతలము

## ( నాంది )

1. సీ. ఆదిమ సృష్టియై యలరారు విధి కెద్ది,
వహియించు నేది హవ్యంబు హూతము,
హోత్రియై యెయ్యది యుండె, నే ద్వయి సర్వ
కాల పరిణామ కారణంబు,
నిఖిల విశ్వంబున నెగడె నెయ్యది శ్రుతి
విషయ గుణంబయి, వివిధ భూత,
ప్రకృతియై యెయ్యది పరగె, దేని సమస్త
జీవులు ప్రాణులై చెలఁగు చుందు,

గీ. రట్టి ప్రత్యక్షమైన దేహములతోడ,
నెన్మిదింటను జగముల కీశుఁడైన,
శంకరుండాయురారోగ్య సంపదాళి,
నొసఁగి సతతంబు సర్వుల నోముగాత

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు: (నేపథ్యాభిముఖముగఁజూచి)
ఆర్యా ! నేపథ్య విధానమంతయుఁ బరిసమాప్తమైనచో ఒకసారి యిటు రమ్ము.

నటి : (ప్రవేశించి) ఆర్య పుత్రా ! ఇదిగో వచ్చితిని. నేను ఇపుడేమి చేయవలయునో ఆజ్ఞాపింపుడు.

సూత్రధారుఁడు: ఆర్యా ! ఈ పరిషత్తు సకల కళాభిజ్ఞులగు సామాజికులతో నిండి యున్నది. కావున కాళిదాస మహాకవిచే రచింపఁబడిన అపూర్వ నాటకమును నేఁడు ప్రదర్శింతము. అందుచే ప్రతి పాత్రయందు నను మనకు తగినంత యత్నమావశ్యకము.

నటి : ప్రయోగము సువిహితమైనందున ఎట్టిలోపమును కలుగ నేరదు.

సూత్రధారుఁడు: ఆర్యా ! అట్లనకుము, సత్యము నెఱింగించెద. వినుము.

2\. గీ. నా ప్రయోగ విజ్ఞానము నాణ్యమనుచు,
నెంచ విద్యాంసు లెద సంతసించువఱకుఁ
దన్నుఁ దా విశ్వసింపదు తన మనస్సు
దృఢము శిక్షితులయిన యా ధీరులకును.

నటి : అవును. అదియట్లే. తమరిప్పుడు ఇటుపై నేను జేయఁదగుదాని నానతిండు.

సూత్రధారుఁడు: శ్రుతిమనోహరముగఁ బాడి యీ పరిషత్తును సంతోషపరచుట కంటె మఱియొక ప్రేముండును.

నటి : ఏ ఋతువును గూర్చి పాడుమందురు ?

సూత్రధారుఁడు: ఇప్పుడిప్పుడే ప్రవేశించి భోగార్హమై యొప్పు ఈ గ్రీష్మ ఋతువును గూర్చి పాడుము.

ఇప్పుడు—

3\. గీ. జలములవగాహనాత్యంత సౌఖ్యదములు,
గాలు లారణ్య పాటల గంధిలములు,
తఱచు ప్రచ్ఛాయ సులభ నిద్రములు విహాళ,
వాసరంబులు పరిణామ భాసురములు.

నటి : అట్లే చేయుదును. (పాడును)

4\. గీ. కొంచె కొంచెము భ్రమరముల్గ్రోల మధువు,
నతిమృదుల కేసరాగ్రములమర తుదల,
వరశిరీష సుమంబుల వనితలిపుడు,
కర్ణభూషలఁ గావింత్రు కనికరించి.

సూత్రధారుఁడు: ఆర్యా ! చక్కఁగా పాడితివి. రాగానుబద్ధ చిత్తవృత్తియై రంగస్థలమంతయు చిత్రలిఖితమువలె నున్నది. మనమిప్పుడు ఏ రూపకము నాశ్రయించి యీ సభను సంతోషపరచవలెనో చెప్పుము.

నటి : అభిజ్ఞాన శాకుంతలమను నూతన నాటకమును ఈనాడు ప్రదర్శింతమని ఇప్పుదేకదా మీరంటిరి.

అవును చక్కగా జ్ఞాపకము చేసితివి.

5. గీ. ఔతి నా కృష్ణుడను నీదు హరిగీతి,
రాగమహిమ హఠాత్తుగ రంజితుండ,
వేగమునఁ బాఱు హరిణము వెంటనంటి,
వచ్చు నీ రాజు దుష్యంతు వలెను మిగుల.

(ఇరువురును వెళ్లుదురు)

– ప్రస్తావన –

# ప్రథమాంకము

(మృగానుసారియై చాపహస్తుఁడగు రాజును
రథముతో సూతుఁడును ప్రవేశింతురు)

సూతుఁడు : (రాజును, మృగమును. జూచుచు) ఆయుష్మంతుఁడా!

1. గీ. రయమున న్బోవు కృష్ణసారమును సజ్య
కార్ముకముఁ బూను నిన్ను నేఁ గాంచి మదిని
దలఁతు మృగమును దరుముచు దానివెంటఁ
దాకు నీతఁడు సాక్షాత్పినాకి యనుచు

రాజు : సూతా! ఈ లేడి వెంట మనము చాల దూరము వచ్చితిమి. ఈ లేడిప్పుడు.

2. సీ. మెడ నందముగఁ ద్రిప్పి మీఁదకుఁ బఱతెంచు
నరదంబు మాటికి నరయుచుండు,
బాణము పడునన్న భయమునఁ దన పూర్వ
కాయ మంద పరమ్ము గలుపుచుండు,
నలసట న్దెరచిన యాస్యంబు విడి జారు
నర్ధాప లీఢ దర్భాగ్రములను,
త్రోవ నంతటఁగప్పి తొందరపడి ముందు
సూటిగా మార్గంబు దాటుచుండు

ఆ. వె. పెద్ద దాట్లువేసి తద్దయు నాకాశ.
భాగమందుఁ జాల. జాగుచేసి,
నేలపైన, సుంత నిల్చి యేగెడు విధి,
లేడి! జూడుమోయి! వేడుకగును

(ఆశ్చర్యముతో) వెనువెంటనే వచ్చుచున్నను నాకు ఇది ప్రయత్న ప్రేక్ష ణీయమగుచున్నదే.

**సూతుఁడు :** ఆయుష్మంతుఁడా ! ఈ భూమి నిమ్నోన్నత మగుటంజేసి నేను పగ్గములను బట్టినందున రధ గమనము మందగించినది. అందు వలన ఈ లేడి మనకు దూరమగుచున్నది. ఇప్పుడు సమస్థలమున ఉండుటచే ఈ హరిణము నీకు లభింపకపోదు.

**రాజు :** అట్లయిన పగ్గములను విడువుము.

**సూతుఁడు :** ఆయుష్మంతుఁడా ! అట్లే చేయుదును.

(రథమును వేగముగా దోలును)

ఆయుష్మంతుఁడా ! చూడుము చూడుము ఇప్పుడు

**3. సీ.** పగ్గముల్ విడువంగఁబడిన యంతటన ని
రాయత పూర్వ దేహములతోడ,
హయరాజములు మూర్ధమండలి చామరా
గ్రములు కంపితములు కాని యటుల,
కర్ణముల్ తిన్నగా కదలక మెదలక
యూర్ధ్వ ముఖంబులై యొప్పుచుండ,
నాత్మఖురోద్ధూత మగు రజశ్చయము త
మ్మధిగమింపని వేగ మతిశయింప,

**గీ.** నిట్టి మాకంటె ముందున కేగఁగలదె,
దాఁటెదము దాని నిపుడే తప్పదనుచు,
నీర్ష్య మనమున విడుకొన్న వేమొ యనఁగఁ
బర్వు లిడుచుండె నీక్షణ పర్వముగను.

**రాజు :** అది నిజమే. సూర్యాశ్వములను గూడ నీ హయరాజము లతిక్రమించుచున్నవి. ఏమన —

**4. సీ.** కన్నుల కెయ్యది కడు సూక్ష్మమై తోచు
నదియ క్షణంబులో నౌను విపుల
మొద్ది మధ్యమునందు బ్రద్దలై యొప్పారు
నదియ యతికినయట్ల యమరుచుండుఁ
బ్రకృతి వక్రంబునై పరగు నెయ్యది చూడ
సమరేఖ మాచు సాక్షాత్కరించు.

గీ. ప్రవిస్తీర్ణముగా నెయ్యేది క్షితి నుండు నయ్యది
పరువిడుచున్నట్లు పైకిఁదోచు.

గీ. క్షణములో దూరమెల్లఁ బార్శ్వమున నుండు,
పార్శ్వమును వీడి యంతలోఁ బాఱుచుండు,
రధ గమన వేగమునఁజేసి రథ్యయందు,
వర్ణనాతీత మీ హయ వల్లనమ్ము.

సూతా ! ఈ లేడిని ఇప్పుడే పడవేయుదును. చూడుము,

(శరమును సంధించును)

(నేపథ్యమున)

ఓయీ ! రాజా ! ఇది ఆశ్రమ మృగము. దీనిని చంపవలదు. చంపవలదు.

సూతుఁడు : ఆయుష్మంతుఁడా ! నీ బాణమునకు మృగమునకు మధ్యగా మునులు ప్రవేశించి యున్నారు.

రాజు : (సంభ్రమముతో) అట్లయిన గుఱ్ఱముల నాపుము.

సూతుఁడు : అట్లే చేయుదును. (రధము నాపును)

(పిమ్మట ముగ్గురు వైఖానసులు ప్రవేశింతురు)

వైఖానసుఁడు : (చేతినెత్తి) ఓ రాజా !

5. గీ. మెత్తనగు లేడిమేన నీ వెత్త వలదు
వలదు బాణము పూరాశి వహ్నివోలె,
నతి తరళమైన లేళ్ల జీవిత మదేడ ?
దారుణములైన నీ బాణతతులవేడ ?

మఱియు

6. గీ. చక్క ధనువుఁన గూర్చిన సాయకమును,
విడువకుండుము లేడిపై వీర పురుష !
దీన రక్షణ కొఱకె మీ దివ్య శరము
లనపరాధుల శిక్షింప నర్హము లొకొ ?

రాజు : బాణమును ఉపసంహరించితిని. (అట్లు చేయును)

వైఖానసుఁడు : పురువంశ ప్రదీపుఁడవు – నీ కిది యుక్తమే.

7. కం. పురువంశములోఁ బుట్టిన
నరపతి కీ విట్టిగుణము న్యాయమె కద నీ
కరిసూదన ! యేతాదృశ
వరసూను స్గనుము చక్రవర్తిని వేగన్.

రాజు : (నమస్కారముతో) బ్రాహ్మణ వచనము పరిగృహీతము.

వైఖానసుఁడు : రాజా ! సమిధలను దెచ్చుటకై మేము బయలు దేరితిమి. కులపతి యగు కణ్వ మహర్షి యాశ్రమము ఇదియే మాలినీ తీర సమీప మునఁ గనఁబడుచున్నది. మీ కార్యములకు అంతరాయము కలుగ నిచో అచ్చటి కేగి ఆతిథ్యమును స్వీకరింపుఁడు.

8. గీ. అంతరాయ మొకింతయు నందనట్టి
రమ్యమౌనీంద్ర దివ్య కార్యములఁ గాంచి,
జ్యాకిణాంకితమగు నీ భుజాయుగంబు
నెంత గాచెనో యవనినీ వెఱుఁగఁ గలవు.

రాజు : కులపతులాశ్రమ మందున్నారా ?

వైఖానసుఁడు : వారు శకుంతలను అతిథి సత్కారమును గావించుటకు నియమించి యామె ప్రతికూలదైవమును నివారించుటకు ఇప్పుడే సోమ తీర్థమున కేగినారు.

రాజు : (తనలో) సరే. ఆమెను చూచెదను. (ప్రకాశముగ) ఆమెయే భక్తుఁడనగు నన్ను మహర్షి కెఱింగించును.

వైఖానసుఁడు : మేము వెళ్ళెదము. (అతఁ డనుయాయులతో నేగును)

రాజు : సూతా ! అశ్వముల నదలింపుము. పుణ్యాశ్రమ దర్శనముచే మనము పునీతుల మగుదము. (మరల రథము పరువెత్తును)

రాజు : (అంతయును జూచి) సూతా ! ఇది తపోవన ప్రదేశమని చెప్ప బడకున్నను తెలియుచున్నది సుమా !

సూతుఁడు : అదెట్లు ?

రాజు : నీవు కనుగొనలేదా ? ఇచ్చట -

9. సీ. చెట్ల మొదళ్లందుఁ జిలుక తొఱ్ఱలనుండి
జారిన నీవార సంచయములు,
ఇంగుదీ ఫలముల నెల్ల వేళలఁ జూర్ణ
మొనరింప నునుపైన యుపలములును,
నమ్మకమ్మునఁజేసి నెమ్మినిఁ గదలక
చప్పుడు విను లేళ్ల సంఘములును,
ఆర్ద్రవల్కల విచ్యుతాంబు కణాంకిత
సలిలాశయానూన సరణితలము

లొప్పఁ గన్నుల పండువై యున్న యాశ్ర
మంబు లియ్యవి సూతుఁడా ! మాన్య మునులు
తపముఁ గావించు నుత్తమ స్థలములివియ
పుణ్యభూములఁ జూడు మరణ్యమందు.

సూతుఁడు : అంతయును గనుగొంటిని.

రాజు : (కొంత దూరమేగి) సూతా ! తపోవన నివాసులకు నిర్బంధము కలుగరాదు. ఇంతటితో రథము నాపుము. నేను దిగియెదను.

సూతుఁడు : రథము నాపితిని. తమరు దిగవచ్చును.

రాజు : ( దిగి ) వినీతవేషముతోడనే తపోవనములలోఁ బ్రవేశింపవలెను. వీని నందుకొనుము. (ధనుర్బాణములను ఆభరణములను సూతునకిచ్చి) నే నాశ్రమవాసులను జూచి వచ్చులోపల నీవు ఈ యశ్వములను ఆర్ద్ర పృష్ఠములను గావింపుము.

సూతుఁడు : అట్లే. (వెడలును)

రాజు : (నడచి) ఇది ఆశ్రమ ద్వారము. ప్రవేశించెదను. (ప్రవేశించి - సునిమిత్తమును గని)

10. గీ. ఆశ్రమంబిది, శాంతికి నాటపట్టు,
బాహువు స్ఫురించె నియ్యెడ ఫలమ్మదెట్లు ?
సంశయం బేల ? సర్వత్ర సంభవించు
ద్వారములు చాల నిల భవి తవ్యములకు.

(నేపథ్యమున)

సఖులారా! ఇటు రండు - ఇటు రండు

రాజు : (విని) ఏమి? వృక్ష వాటికకు దక్షిణముగ ఏదో సంభాషణము వినవచ్చు చున్నదే? ఇప్పుడు అచ్చటికే యేగెదను. (వెళ్ళి - చూచి) ఓహో! ఈ ముని కన్యకలు స్వప్రమాణాను రూపము లయిన జలకలశములను ధరించి మొక్కలకు నీరుపోయుటకు ఇటే వచ్చుచున్నారు. (చూచి) ఆహా! వీరి రూపమెంత మధుర ముగ నున్నది.

11. గీ. ఆశ్రమంబుల వివసించు వంగనలకు
నబ్బ శుద్ధాంత దుర్లభమైన రూపు
పుష్పవనములఁ బెంచెడి పూల లతల
మించె గుణముల వనలత లంచుఁదలతు.

ఇప్పుడు ఈ చెట్ల నీడ యందుండి చూచెదను. (చూచుచుండును)
(వృక్ష సేచన వ్యాపారయై శకుంతలయు సఖులును ప్రవేశింతురు.)

శకుంతల : సఖులారా! ఇటురండు - ఇటురండు

అనసూయ : సఖి! శకుంతలా! తండ్రి కాశ్యపునకు నీయందున్న ప్రేమకంటె ఆశ్రమ వృక్షములందున్న ప్రేమయే అధికమని యనుకొందును. ఏమన, నవమాలికా కుసుమపేశలవగు నిన్నుఁగూడ నీ యాశ్ర మాలవాలములమ తడుపుటకు నియమించినాఁడు.

శకుంతల : తండ్రి నియోగ మొక్కటియే కాదు. నాకుఁగూడ వీనియందు సోదరప్రేమ గలదు. (వృక్షకములను దడుపును)

రాజు - ఏమీ? ఈమె ఆకణ్వమహర్షి కూతురా? పూజ్యుడైన ఆ మహర్షి యీ విషయమున అనుచితముగనే ప్రవర్తించెను. ఇట్టి కాంతను ఆశ్రమ ధర్మములందు నియమించినాఁడు.

12. మ. ఇది యవ్యాజమనోహరంబయిన రూ
పీ దివ్యరూపంబు నా
వ్నదముంజేసెఁదపంబుఁజేయుటకు నే
ప్రాజ్ఞుండు వాఁడిద్ధరన్

మృదు నీలోత్పల పత్రధార సమిధన్
భేధించి చీల్పంగఁదా
మది నూహించె ననంగవచ్చు నిఁక నా
మాన్యాత్ముఁడౌ నేమనన్

కానిమ్ము, పాదపాంతర్హితుండనై యీమెను చక్కఁగ పరికించెదను.
(అట్లే చేయును)

శకుంతల : అనసూయా ! ప్రియంవద నా స్తనవల్కలమును మిక్కిలి గట్టిగ బిగించినది. దానిని కొంత సడలింపుము.

అనసూయ : అట్లే చేయుదును. (విప్పును)

ప్రియంవద : ఈ విషయమున పయోధర విస్తారయితృకమగు నీ జవ్వనమును నిందించుకొనుము.

రాజు : ఈమె వయస్సునకు ఈ వల్కలము అంత అనుగుణముగాలేదు. అయినను ఇది మిక్కిలి శోభనే యొసంగుచున్నది.

13. చం. అధిక రుచిస్సరోజ మల
రారును శైవల మెంతఁ గప్పినన్
విధువతి శోభఁ గాంచి కడు
వెల్గు మలీమస లక్ష్మమున్న నీ
మధుకర వేణి వల్కల స
మావృతయయ్యు మనోజ్ఞ చాల; నా
మధుర శరీరధారులకు
మండన మెయ్యదికాదు ధారుణిన్.

శకుంతల : (ముందునకుఁజూచి) ఈ కేసర వృక్షము పవనాందోళిత కిసలయాంగుళులతో నన్ను తొందర పెట్టుచున్నట్లున్నది. దానినిప్పుడు గౌరవించెదను. (అచ్చటికి వెళ్ళును)

ప్రియంవద : సఖి ! శకుంతలా ! ఒక్క క్షణము అక్కడే నిలబడుము. నీవు అచ్చట నుండిన ఈ కేసరవృక్షము లతాసనాథమైనట్లు భాసించును.

శకుంతల : అందులకే నీవు ప్రియంవద వైతివి.

రాజు : ఆమె ప్రియంవదయేకాదు. ప్రియమునేగాక సత్యమునుగూడ పల్కినది. ఈమెకు —

14. గీ. పల్లవారుణ మధరంబు, బాహువులును
మృదుల విటపానుకారులై మెదలుచుండె,
నంగములయందు సన్నద్ధమయ్యె జవ్వ
నంబు, కుసుమంబువలె లోభనార్హ మగుచు.

అనసూయ : సఖీ! శకుంతలా! ఇదిగో నవమాలిక. ఇది బాల సహకారమునకు స్వయంవర వధువు. దీనికి వనజ్యోత్స్నయని పేరుకూడా పెట్టితివి. దీనిని మరచితివా?

శకుంతల : అమ్మో – అట్లయిన నన్ను నేను మరచినట్లే. (లతను సమీపించి – చూచి) సఖీ; రమణీయమగు కాలమున ఈ లతా పాదపమిథునమునకు సమ్మేళనము సంభవించినది. ఏమనంగా, ఈవనజ్యోత్స్న నవకుసుమ యౌవన. ఈ బాలసహకారముకూడ బద్ధపల్లవము. కావున, ఉపభోగక్షమముకదా.

ప్రియంవద : (నవ్వుచు) సఖీ, అనసూయా! ఆవనజ్యోత్స్నను శకుంతల యెందులకు అంతప్రేమతో చూచుచున్నదో గ్రహించితివా?

అనసూయ ; నాకు తెలియలేదు. నీవు చెప్పుము.

ప్రియంవద : అనురూపపాదముతో ఈ వనజ్యోత్స్న కలిసినట్లే నేనుంగూడ అనురూపుండగు పతిని బొందంగలనా? అని

శకుంతల : (అసూయతో) ఇట్టికోరిక తప్పక నీ మనస్సులోనే యుండును.

రాజు : (తనలో) ఈ మనోరథము దుర్లభమే కావచ్చును. ఈమె కులపతియగు నా కణ్వునకు అసవర్ణకాంతయందు జన్మించియుండునా? లేదా? ఆ సందేహమెందులకు?

15. ఉ. సందియమందనేల, నృప
జాతి పరిగ్రహయోగ్యయీమె, యా
సుందరియందు నాదు పరి
శుద్ధము చిత్తము లగ్నమయ్యె, స

ద్వందితులైన సజ్జనుల
స్వాంతములే కద సత్ప్రమాణముల్,
సందియమున్న కార్యముల
చందముఁదెల్పగ నిజ్జగంబులన్.

శకుంతల : (సంభ్రమముతో) సఖి! సలిలసేచనమున సంభ్రాంతమై యీ మధుకరము నా ముఖముపైఁ బడుచున్నది.

(భ్రమరబాధ నభినయించును)

రాజు : (చూచి) (అనసూయతో)

16. సీ. పలుమార్లు వణకుచుఁ బరితో భ్రమించు గ్రీఁ,
గంటిచూపును దాకుచుంటివయ్య!,
కర్ణాంతికమ్మునఁగదలుచు మెదలుచు
గుసగుస నేదియో కూయుచుంటి,
కరముల నటునిటు కాదని త్రిప్పెడు
కాంతముఖంబుపైఁగడకు వ్రాలి,
యతిమధురంబును రతికి సర్వస్వమౌ
కెమ్మోవిరుచినాని కేరుచుంటి,

గీ. వీమె యెవ్వతెయోయని యెఱుఁగదలఁచి,
మోసపోయితి మియ్యెడ నాసఁ వీడి,
మధుకరా! నీవు సుకృతివి మందమతుల,
మేము తత్త్వంబు నెఱుగ యత్నించు కతన.

శకుంతల : సఖులారా! రక్షింపుఁడు. రక్షింపుఁడు ఈ దుర్వినీత మధుకర పరాభూతనగు నన్ను.

అనసూయా ప్రియంవదలు } (నవ్వుచు) మేమెవ్వరము రక్షించుటకు. దుష్యంతుని పిలువుము. తపోవనములు రాజరక్షితవ్యములు గదా!

రాజు : (తనలో) నేను కనబడుట కిదే సమయము. ఎవరక్కడ! (సగములో నాగి - ఆలోచించి) నన్ను నరపతిగా వీరు గుర్తింతు రేమో! కావున్న ఈ విధముగ సమాధాన మిచ్చెదను.

శకుంతల : ఈ దుష్టుఁడింకను విరమింపలేదు. మఱియొక చోటికిఁ బోయెదను. ఏమి ? ఇచ్చటికిఁగూడ నన్ననుసరించి వచ్చుచున్నాఁడే.

రాజు : (వేగముగా సమీపించి)

17. గీ. దుర్వినీతుల శిక్షించి, దుర్బలులను
బ్రోచు పౌరవుఁడీ భువిఁగాచుచుండ,
నెవ్వఁడీ యవినయముల నివ్విధమునఁ
జేయు మునికన్యకలకు నమాయికలకు.

అనసూయ : ఆర్య ! ప్రమాదమేమియుఁగలుగలేదు. ఈ మా ప్రియసఖి తుమ్మెదచేఁ బీడింపఁబడి భయపడినది.

(శకుంతలను జూపును)

రాజు : (శకుంతల కభిముఖుఁడై) తపస్సు కొనసాగుచున్నదా ?

శకుంతల : (శకుంతల భయముచే మౌనము నవలంబించును)

అనసూయ ; ఇప్పుడు అతిథిశ్రేష్ఠులగు తమ రాకచే.
ఆర్యులకు స్వాగతమా ? సఖి ! శకుంతలా ! నీవు పర్ణశాలకేగి యర్ఘ్యమును తెమ్ము. ఈ జలము పాదోదకమగును.

రాజు : చాలును. మీ సూనృత వాక్కులచేతనే అతిథి సత్కారము జరిగినది.

ప్రియంవద ; అయినచో తమరు ఈ ప్రచ్ఛాయశీతలమగు సప్తపర్ణ వేదిక యందు ఆసీనులరై ఆయాసమును తీర్చికొనుఁడు.

రాజు : మీరును ఈ పనిలో అలసితిరి గదా !

అనసూయ : సఖి ! శకుంతలా ! అతిథులను సేవించుట మనకు అర్హకృత్యము గదా ! మనముకూడ నిచట కూర్చుందము.

(అందఱు కూర్చుండుదురు.)

శకుంతల : (విమర్శించుకొనుచు తనలో) ఎందులకో ఈతని చూడగానే నాకు తపోవన విరుద్ధమైన మనోవికృతి కలుగుచున్నదే ?

రాజు : (అందఱిని చూచి) మీ సౌహార్దము వయోరూప రమణీయమై యొప్పుచున్నదే.

ప్రియంవద : (జనాంతికముగ) అనసూయా! చతురగంభీరాకృతియగు ఈతఁ డెవ్వఁడో? ప్రియముగఁ బలుకుచు ప్రభువువలెఁ గన్పట్టు చున్నాఁడు.

అనసూయ : (జనాంతికముగ) సఖి! నాకు కూడ ఈ కుతూహలము గలదు. ఇతనినే యిప్పుడడిగెదను (ప్రకాశముగ) ఆర్యా! పూజ్యులయిన మీ మాటల యందలి విశ్వాసమే నన్నడిగించుచున్నది. తమరే రాజవంశము నలంకరించితిరి? తమ వియోగముచే ఏ దేశమందలి జనులు విరహ పర్యుత్సుకులైరి? సుకుమారులైన మీరు ఈ యాశ్రమ పర్యటనమున ఏల కష్టపడుచుంటిరి?

శకుంతల : (తనలో) హృదయమా, తొందరపడకుము. నీవు అనుకొనిన దానినే యనసూయయు ప్రశ్నించుచున్నది.

రాజు : (తనలో) నన్ను నేను తెలుపుకొనుట యెట్లు? లేక, కప్పిపుచ్చు కొనుట యెట్లు? కానిమ్ము. ఈ విధముగ ఈమెతో చెప్పెదను. (ప్రకాశముగ) పూజ్యురాలా! నేను పౌరవరాజుచే ధర్మాధికార మున నియమింపఁబడినవాఁడను. ఆశ్రమవాసుల ధర్మకార్యము లకు విఘ్నములు లేకుండ చూచుటకు నేను ఈ ధర్మారణ్యమును ప్రవేశించితిని.

అనసూయ : ఇప్పుడు గదా ధర్మచారులు సనాథులయిరి.

శకుంతల : (అనురాగ సూచకమగు లజ్జ నభినయించును)

అనసూయా ప్రియంవదలు } (ఇద్దఱి ఆకారములను గుర్తించి) (జనాంతికముగ) సఖి శకుంతలా! ఇప్పుడుగాని తండ్రి ఇచ్చట ఉన్నయెడల — —!

శకుంతల : (కోపముతో) ఉన్నయెడల? ఏమగును?

ఇరువురు : జీవిత సర్వస్వమునైనను సమర్పించి యీ అతిథిని సత్కరించి యుందురు.

శకుంతల : సఖులారా ! చాలును, ఏదో మనసులోనుంచుకొని మీరు ఆలోచించుచున్నారు. మీ మాటలను నేను వినను.

రాజు : నేను కూడ మీ సఖినిగూర్చి కొంచెమడుగదలంచితిని.

ఇరువురు : ఆర్యా ! ఈ యభ్యర్థన మాపట్ల అనుగ్రహమే.

రాజు : భగవంతుఁడగు కాశ్యపుఁడు ఆజన్మబ్రహ్మచారియని లోకప్రసిద్ధి. ఈ మీ సఖి అతని పుత్రిక యగుట యెట్లు ?

అనసూయ : వినుఁడు. మహాప్రభావ సంపన్నుఁడు కుశికసగోత్రుఁడు కౌశికుఁడను మునిగలఁడు.

రాజు : అవును. ఉన్నాఁడు. వింటిమి. తరువాత.

అనసూయ : అతఁడు మా వయస్యకు తండ్రి. అతఁడు ఈమెను విడిచిననాటి నుండి శరీర సంవర్ధనాదుల సంరక్షించుటంజేసి కణ్వుఁడీమెకు తండ్రి.

రాజు : "విడిచిన తరువాత" అనుటతోడనే నాకు కుతూహలము కలుగుచున్నది. దీనిని మొదటినుండియు వినదలంచితిని.

అనసూయ : వినుఁడు. ఒకప్పుడా మహర్షి అత్యుగ్రమగు తపమాచరించుచుండ దేవతలు ఎందులకో అనుమానించి అతని తపమునకు విఘ్నమాచరించుటకై మేనక యను అచ్చరను అటకు పంపిరి.

రాజు ? ఇతరులు తపమాచరించుకొనుచుండ దేవతలు భయపడుచుండుట వారికి పరిపాటియే. తరువాత–

అనసూయ : పిమ్మట ఉధారమగు వసంత సమయమున మనోన్మాదమునొసంగు ఆమె రూపమునుగాంచి, (సిగ్గుచే చెప్పలేక ఊరకుండును)

రాజు : తరువాతి కథ అవగతమైనది. అన్ని విధముల ఈమె అచ్చర నుండి జన్మించినది.

అనసూయ ; అవును.

రాజు : తగియే యున్నది.

18\. గీ. కలదె చూడంగ మానవకాంతలందు
నిట్టి రూపంబు మచ్చున కెచ్చటైన,
కాంతిపుంజంబులందమై గ్రాలునట్టి
జ్యోతియుదయించునే మేది నీ తలాన.

శకుంతల : (తలవంచుకొనియుండును)

రాజు : (తనలో) నా మనోరథము ఫలించుట కవకాశమున్నది. కాని, హాస్యమునకై సఖి పలికిన వరప్రార్థనా ప్రసంగమును బట్టి మనస్సు మాత్రము సందేహకాతరమగుచున్నది.

ప్రియంవద : (నవ్వుచు – శకుంతల నవలోకించి రాజువైపు తిరిగి) తమరేదో మరల చెప్పదలంచినట్లున్నారే ?

శకుంతల : (ప్రియంవదను వ్రేలితో భయపెట్టును)

రాజు : చక్కగా గ్రహించితివి. సచ్చరిత్రమును విను ఆసక్తితో మఱి యొక్క మాటను అడుగఁదలంచితిని.

ప్రియంవద : ఆలోచన యెందులకు ? తపస్వులను స్వేచ్ఛగా ప్రశ్నింప వచ్చునుగదా !

రాజు : మీ సఖిని గూర్చి తెలిసికొనఁదలంచితిని.

19\. గీ. జనకుఁడి తరువకీమె నొసంగు దనుక,
స్మర విసంవాది వైఖాన సవ్రతంబుఁ
దాల్చునా ? యీమె, లేకిట్టి తపముఁజేయు
చుండునా ? యాడులేడుల పిండుతోడ.

ప్రియంవద : ఆర్యా ! ధర్మాచరణమునకైనను మేము పరాధీనులమే కదా ! ఈమెను అనురూపుఁడగు వరునకు ఈయవలయుననియే యీమె తండ్రి సంకల్పము.

రాజు : ఈ సంకల్పము దురవాపమే. (తనలో)

20\. గీ. హృదయమా ! సాభిలాషవై యుండుమిపుడు,
సందియము వోయె నిర్ణయ సరణి దొరికె,
దాహకంబగు నగ్నిగాఁ దలఁతు దేని,
నద్ది రత్నము తాకుట కర్హము సుమ.

శకుంతల : (కోపముతో మన్నట్లు నటించి) అనసూయా ! నేను పోయెదను.

అనసూయ : ఎందులకు ? ఏమి ?

శకుంతల : అసంబద్ధ ప్రలాపినియగు ఈమెనుగూర్చి గౌతమితో చెప్పుటకు.

అనసూయ : సఖీ ! అతిథి విశేషమును సత్కరింపక విడిచి స్వేచ్ఛగాపోవుట ఆశ్రమవాసులకు అనుచితము కాదా ?

శకుంతల : (మాట్లాడకుండ బయలుదేరును)

రాజు : ఆ ! వెళ్ళుచున్నదే ! (పట్టుకొనవలెనని తలంచి మరల మనసును మరలించుకొని) ఆహా ! కాముకజన మనః ప్రవృత్తి చేష్టా సమ రూపమై యుండునుగదా !

21\. గీ. అరుగఁ దలఁచియు మునికన్య నంటి వెంట,
నాగి యుంటివి వినయంబు నడ్డుపెట్ట,
కదలకుండియు విటనుండి కాంతవెనుక
నరిగి మరలివవాని యట్లైతి నిపుడ

ప్రియంవద : (శకుంతల నాపి) సఖీ ! నీ వేగుట తగదు.

శకుంతల : (కనుబొమలను వంచి) ఎందుచేత ?

ప్రియంవద : వృక్షసేచన వ్యాపారములో రెండింటికి ఋణపడితివి. అందుచే రమ్ము, ఆ ఋణమును తీర్చి నీ వేగవచ్చును.

రాజు : భద్రా ! వృక్షసేచన వ్యాపారము చేతనే యీమె బాగుగా అలసిన దనుకొందును. ఏమన - ఈమెకు -

22\. సీ. క్రుంగెఁ భుజాగ్రముల్, గురిసె శోణప్రభల్
గరతలంబుల వారి ఘటము లెత్త,
మితిమీరి విశ్వాసతతి యురోజంబులఁ
గదలించుచుండె వింకను విడువక,
కర్ణ శిరీషంబుఁ గప్పుచు మోమునన్
ఘర్మాంబు కణములు గడలుకొనియె,
బంధంబు వీడంగ సంధింప నొకచేతఁ
జెదరి మూర్ధజములు చిందులాడె

గీ. బాహులత లురోజంబులు వక్త్రబింబ
మురు శిరోజభరంబు నీ యువిద కన్న
శ్రమము నెఱిగించుచున్నవి సకియలార !
విడువుఁడీమెను చాలు నీ వృక్షసేవ.

కావున నేను ఈ మెను ఋణవిముక్తను గావించెదను.

(తన యంగుళీయకమునిచ్చును)

(సఖులు నామముద్రాక్షరములను జదివి యొకరి నొకరు చూచుకొనుచుందురు)

రాజు : నన్ను అన్యథా తలంపకుఁడు. ఇది రాజపరిగ్రహము.

ప్రియంవద : అట్లయినచో ఈ యంగుళీయకము తమ హస్తమును వీడి యుండుట తగదు. తమ వచనములచేతనే యీమె ఋణవిముక్త యైనది. సఖీ ! శకుంతలా ! దయార్ద్రహృదయుడగు ఈ ఆర్యునిచే నీ ఋణము తీర్పఁబడినది. కాదుకాదు. ఈ మహారాజుచే. నీవిప్పుడు స్వేచ్ఛగా వెళ్ళవచ్చును.

శకుంతల : (తనలో) స్వతంత్రనయినచో ? (ప్రకాశముగ) నీవెవరు వెళ్ళ మనుటకును, ఉండుమనుటకును ?

రాజు : (శకుంతలను జూచుచు) ఈమెను గాంచి నేనెట్లయితినో, మమ్ముఁగాంచి యీమెయు అట్లే అయియుండునా ? సందేహమేల ? నా ప్రార్థన ఫలించుట కవకాశము గలదు.

23. గీ. పలుకుచుండంగ నేఁ దాను పలుకకుండు,
నెదురుగా నుండి యేఁ బల్కు వదలు చెవిచ్చి,
నాకు నెదురుగ మోమెత్త నాతి వెఱచు,
నన్యవిషయమ్ము కాదు కాదతివ దృష్టి.

(నేపథ్యమున)

ఓయీ తపస్వులారా ! తపోవన మృగములను సంరక్షించుకొనుటకు సన్నద్ధులరై యుండుడు. మృగయా విహారియైనాఁడు దుష్యంత మహారాజు,

24\. గీ. తురగ రింఖా ముఖోద్ధూత ధూళిచయము
పరిణతారుణ బింబ నిభంబు నగుచు,
బడియె శాఖాగ్రసక్తార్ద్ర పటములైన
విటపులందున శలభంబు పటలివోలె.

మఱియు

25\. సీ. అతి తీవ్ర హతి భగ్న వితత తరుస్కంధ
లగ్నైక దంత విరాజితంబు,
పాదర యాక్రాంత బహుళ లతా చక్ర
సంగ సంజాత పాశాంకితంబు,
స్పందనాక్రందిసుస్యందన దర్శన
జాత మహా భీతికా తరంబు,
సర్వత స్సంచర త్సారంగ యూధ వి
త్రాసి పరాక్రమోద్భాసితంబు,

గీ. విగ్రహోపేత సత్తపో విఘ్నమనఁగ,
మత్తమాతంగరాజ మున్మత్త మగుచుఁ
జేరె ధర్మాటవీ ప్రాంత సీమకిపుడిఁ.
కేమరక యుండు డాశ్రమ భూములందు
(అందఱువిని కొంచెము భయపడుదురు)

రాజు : (తనలో) అయ్యో ! ఎంత పొరపాటు ! నా సైనికులు నన్ను వెదకుచు తపోవనము నాక్రమించుచున్నారు. కానిమ్ము. నేనిప్పుడే యేగెదను.

అనసూయ : ఆర్యా ! అరణ్య గజ వృత్తాంతముచే మా మనస్సులు చెదిరినవి. పర్ణశాలకుఁ బోవుటకు మాకు అనుమతి నొసంగుఁడు.

రాజు : మీరు వెళ్ళుడు. మేముకూడ ఆశ్రమమునకు ఆపద కలుగకుండు నట్లు యత్నించెదము. (అందఱును లేచెదరు)

సఖులు : ఆర్యా ! అతిథిని సత్కరింపలేని మేము మరల దర్శన మిప్పింపుఁడని మిమ్ముఁ గోరుటకు సిగ్గుపడుచుంటిమి.

రాజు : అట్లు తలంపవలదు. మీ దర్శనము చేతనే సత్కృతుఁడనైతిని.

శకుంతల : (ఏదో మిషపై ఆలసించి సఖులతోఁగూడి వెడలును.)

రాజు : నగరమున కేగుట కుత్సాహము సన్నగిల్లినది. ఇప్పుడు పరివారమును బరిశీలించి యీ యాశ్రమ సమీపముననే యుండెదను. శకుంతలా వ్యాపారమునుండి మనస్సును మరల్పలేకుంటివి.

నాకు —

26. గీ. మేను మెల్లఁగ ముందుకు మెదలు, నాదు
మనసు పర్విడు వెనుక కున్మత్తమగుచు,
వాతమున కెదురై పోవు కేతనంపు
పట్టవస్త్రంబురీతి దుర్వారమగుచు.

(అందఱును వెడలుదురు)

—

# ద్వితీయాంకము

(విదూషకుఁడు ప్రవేశించును)

విదూషకుఁడు : (నిట్టూర్చి) మృగయాశీలుఁడగు ఈ మహారాజునకు మిత్రుఁడనై మోసపోయితిని. ఇదిగో లేడి, ఇదిగో పంది, ఇదిగో పులి, అని మిట్టమధ్యాహ్నమున విరళ విరళచ్ఛాయంబులగు నీ యడవులలోఁ దిరుగుచుంటిని. పత్రసంకర కషాయములును గదుష్టములునగు గిరినదీ జలములఁ ద్రావుచుంటిని. శూల్యమాంసభూయిష్ఠమగు ఆహారమును వేళఁదప్పి తినుచుంటిని. గుఱ్ఱము వెనువెంట పరువువెత్తుటచేఁ గీళ్ళు పట్లన్నియు సడలి రాత్రులందుఁ గూడఁ జక్కఁగా నిద్ర పట్టుటలేదు. తెల్లవారకమునుపే దాస్యాఃపుత్రు లయిన యీ కుక్కల వేఁటగాండ్రు గోల జేయుచు లేపిరి. ఇప్పటికిని నాకాబాధపోలేదు. ఇంతలో దెబ్బమీద కురుపు పుట్టిన ట్లయినది. నిన్న మేమెవ్వరమును లేని సమయమున వేఁటాడుచు మున్యాశ్రమమునకుఁబోయిన యీమహారాజునకు నాదురదృష్టవశమున నాశకుంతల కంటఁబడినది. ఇప్పుడాతనికిఁ బట్టణమునకుఁ బోవుదమనుమాటయే లేదు. ఆ విషయమును గూర్చియే మిక్కిలిగా నాలోచించుచుండ అప్పుడే తెల్లవారినది. ఏమిచేయుదును. కాలకృత్యములను నిర్వర్తించుకొనియున్న మిత్రునికడకిప్పుడేగెదను. (వెళ్ళి-చూచి) వనకుసుమ మాలలను ధరించి, సెలవిండ్లను చేతఁబట్టి యవనకాంత లనుసరింపఁగా మహారాజిటే వచ్చుచున్నాఁడు. అంగభంగ వికలుని వలెనుండెదను. అట్లయినను గొంత విశ్రాంతి లభించునేమో? (కఱ్ఱనానుకొని కూర్చుండును)

## ప్రవేశకము

(పిమ్మటఁ బైపరివారముతో రాజు ప్రవేశించును)

రాజు : (తనలో)

1. గీ. అంత సులభముగ లభియింపదా సుమాంగి,
మనసు తద్దర్శనాయాస మగ్నమయ్యెఁ,
గాముఁడ కృతార్థుఁడై నను గాముకులకు,
మథయులకుఁగూడ రతియుండు నొక్కరీతి.

(నవ్వుకొని)

ఇట్లు తన యభీష్టమున కనుగుణముగ ఇతరుల చిత్తవృత్తియు నున్నదని భావించి, కాముకుఁడు హాస్యాస్పదుఁడగు చుండునుగదా!

ఉ. 2. ప్రేయసి చూచె నన్నుఁగడు
 ప్రీతిని నన్యనివిష్ట దృష్టియై
వోయె విలాస మందగతి
 వోలె నితంబ భరాన లెస్ససా
సూయముగా వచించెఁజను
 చున్సఖి తన్ను మరల్పఁ బోవ నా
ప్యాయత నా పయిన్దెలిపె
 నంచుఁదలంచునుగామి స్వీయమున్

విదూషకుఁడు : (అట్లేయుండి) నాకు కాళ్ళు చేతులును కదలుటలేదు. మాటలాడు చుంటిని. రాజా! విజయము నందుము.

దుష్యంతుఁడు : (నవ్వుచు) శరీరమున కెందువలన దెబ్బతగిలినది?

విదూషకుఁడు : ఎందువలననా? స్వయముగా కన్నులు పొడిచి కన్నీరేల కారు చున్నదని యడుగుచుంటివా?

దుష్యంతుఁడు : నీ మాటలు నాకు బోధపడుటలేదు.

విదూషకుఁడు : ఓయీ! తుంగచెట్టు వంగిపోవుటకు తాను కారణమా? నదీ వేగము కారణమా?

దుష్యంతుఁడు : అచ్చట నదీవేగమే కారణము

విదూషకుఁడు : అట్లే నాకుకూడ నీవే కారణము.

దుష్యంతుఁడు : ఎట్లు?

విదూషకుఁడు : నీవు ఇట్లు రాజకార్యములమగూడ విడిచి అడవి భోజనములు చేయుచు తిరుగుచుండుము. ఈ శ్వాపద మృగములను ద్రోలి త్రోలి నేను అవయవ పటుత్వమును బోగొట్టుకొని కదలుటకు

కూడ అశక్తుఁడనై యుంటిని, నన్ననుగ్రహించి యొక్క రోజు మాత్రము విశ్రాంతి కనుమతి నిమ్ము.

రాజు : (తనలో) మిత్రుఁడుకూడ ఈ విధముగా ననుచున్నాడు నాకుఁ గూడ ఆ కాశ్యపపుత్రిని స్మరించుచుండ వేటాడుటకు మనస్సంగీకరింపకున్నది.

3. గీ. సజ్యమై యున్న చాపంబుఁ జక్కవంచి,
శరము విడువంగలేకుంటి హరిణచయము
పైనఁ బ్రేయసి సహవాస భాగ్యమంది
యిచ్చెనుపదేశమేవి ముగ్ధేక్షిత్రముల

విదూషకుఁడు : (రాజు ముఖమును జూచి) మనస్సులో నేదో యుంచుకొని నీ వాలోచించుకొనుచున్నావు. నా మాట అరణ్యరోదనమైనది.

రాజు : (నవ్వుచు) మఱియొక ఆలోచన యేమున్నది ? మిత్రునిమాట జవదాటరానిది కదా అని ఆలోచించుకొనుచున్నాను.

విదూషకుఁడు : చిరకాలము జీవింపుము (వెళ్లుటకు యత్నించును)

రాజు : మిత్రుడా ! నిలువుము. నా మాట యింకను పూర్తికాలేదు.

విదూషకుఁడు : ఆనతిమ్ము

రాజు : విశ్రమించినపిదప నీవు నాకొక శ్రమలేని పనిలోఁదోడ్పడవలెను.

విదూషకుడు : మోదకములను తినుటయందా ?

రాజు : అప్పుడు చెప్పెదనులే.

విదూషకుఁడు : సంతోషము.

రాజు : ఎవరక్కడ ? (దౌవారికుఁడు వచ్చి)

దౌవారికుడు : ప్రభువుల ఆజ్ఞ

రాజు : రైవతకా ! సేనాపతి నిప్పుడు పిలువుము,

దౌవారికుడు : చిత్తము. (వెడలి - సేనాపతితో కలిసివచ్చి) ప్రభువులు ఏదో ఆజ్ఞాపించుటకు సిద్ధముగ నిన్నే నిరీక్షించుచున్నారు. వెళ్ళుము.

సేనాపతి : (రాజునుచూచి) వేట వలన ఈతనికి దోషములు రాలేదు సరి కదా ! మీఁదు మిక్కిలి గుణములే వచ్చినవి.

ఇతడు —

4. సీ. సతత బాణాసన జ్యాస్ఫాల నంబునఁ
గఠినమై పూర్వ భాగంబు నొప్పఁ,
దిగ్మాంశు కాంతిలోఁ దిరుగుచుండుటఁ జేసి
సహనైక భావంబుఁ జక్కఁగదుర,
ఘర్మాంబు కణములు కాయయంబునందింకి
మిసిమి గాత్రంబుల మెఱయుచుండ,
నవయవ దార్ఢ్యంబు నమరియుండుటఁజేసి
కార్శ్య మొక్కింతయుఁ గానరాక,

గీ. తిరుగు గిరిచర నాగంబు కరణి నొప్పి
ప్రాణసారంబు గాత్రంబుఁ బడసి యితడు
వెలిగె నుజ్జ్వలమూర్తియై వింతరుచుల
సతత మటవిని మృగయాతి సక్తుఁడగుచు.

(సమీపించి) అడవిలో శ్వాపద ప్రచారముల నరికట్టితిమి. తమ రింకను ఆలసించుట యెందులకు ?

రాజు : సేనాపతీ ! మాధవ్యుడు వేఁట వలదనుటచే నిరుత్సాహుఁడ నయితిని.

సేనాపతి . (జనాంతికముగ) మిత్రమా ! మాధవ్య ! నీ మాటమీఁద నీ వుండుము. నేను మాత్రము ప్రభువుల చిత్తవృత్తి ననుస రింతును. (ప్రకాశముగ) ఆ మూర్ఖుని ప్రలాపములను చేయ నిండు. ఈ కార్యములోఁ దిమరే నిదర్శనము.

5. సీ. మెదలు చులకనౌచు మేను చక్కఁగఁ గొవ్వు
కరిగి పొట్టంతయుఁ గార్శ్యమందఁ,
దెలియు జంతువులందుఁ గలుగు చిత్తవికార
మలఘు కోపభయమ్ము భావరింపఁ,

ఎలుఁగు మత్తమకీరి యిల వెలుకాంగ్రదకుఁ
బాణ లక్ష్యంబులఁ బడఁగ నేయఁ
దొలఁగు భయంబులు మెలఁగు మానవులకు
దుష్ట సత్వంబుల దునుముకతనఁ

ఆ. వె. గలదు దోషమంచు గణియింత్రు వేటలో
వారిమాటకల్ల వసుధలోన,
వేటయందుఁ గలుగు వేడుకతోసాటి
కలదె యెచ్చటైన లలితదేహ!

విదూషకుఁడు : ప్రభువులు మృగయావిముఖులైనారు. నీవు మాత్రము ఒక యడవినుండి మఱియొక యడవికి దిరుగుచు మనుజ నాసికా మాంసలుబ్ధమగు భల్లూకపు నోటిలోఁబడుము.

రాజు : భద్ర! సేనాపతీ! పలుమాటలేల? మనము ఆశ్రమమునకు సమీపమున నుంటిమి. కావున నీ మాటను నే నంగీకరింపఁ జాలను.

6. సీ. నీటివిఁ గొమ్ముల మీటుచు దున్నలు
కూర్మి దిగుగాకఁ గొలఁకులందు,
నీడలన్ మందలై వివసించి లేళులు
హాయిగ నెమరులు వేయుఁగాక,
నీటిపడియలందు నెలకొని పందులు
తుంగముస్తలఁదిని దొర్లుగాక,
ఎల్ల సత్వంబులు మెల్లఁగాఁ దమతమ
తావులకై వేగఁ బోవుఁగాక,

గీ. గుణము సడలించి వెడలింపఁ గోటినుండి
నాదు బాణావళ్ముని నాద ముడిగి,
కొంత విశ్రాంతిఁ గనుఁగాక, కోర్కెలుడిగి,
మాకు వేఁటాడు కోరిక మాటువడియె.

సేనాపతి : తమరు సమర్థులు, తమకెట్లు ఇష్టమౌ యట్లే జరుగును.

రాజు : ముందుగ అడవికేగిన వారినందఱిని మరలింపుము. మన సైనికులు తపోవనమునకు దూరముగ నుండునట్లు ఆజ్ఞాపింపుము.

7. మత్త. ఉండు దాహకమైన తేజము
దొండు నిత్యము గుప్తమై,
నిండుగా శమమూనియున్నము
నీశులందున మేదినిన్,
మండుచుండును సూర్యకాంతపు
మానికంబులు చల్లగా
నుండునట్లుగఁ దోచినన్, సత
మోర్వ కన్య తిరస్కృతిన్.

సేనాపతి : తమరు సెలవిచ్చినట్లే.

విదూషకుఁడు : నీ యుత్సాహమంతయు నీఱయినట్లే, పొమ్ము, దాస్యాఃపుత్ర ! పొమ్ము.

(సేనాపతి పోవును)

రాజు : (పరివారమును జూచి) మీరు మృగయా వేషమును విడువుఁడు. రైవతక ! నీవు కూడ నీ పనిని జూచుకొనుము.

ప్రతీహారి : చిత్తము. (పోవును)

విదూషకుడు : ఇప్పుడొక్క యీగనుకూడ మిగులకుండఁ జేసితివి. ఇంక నీవృక్ష చ్ఛాయలో సాంద్రలతా పితానచ్ఛాదితమైన యీ యాసనమునఁ గూర్చుండుము. నేనును సుఖముగ నుండెదను.

రాజు : నీవు ముందు నడువుము.

విదూషకుఁడు : రమ్ము, నీవుకూడ రమ్ము.

(ఇద్దరు వెళ్ళి కూర్చుందురు)

రాజు : మాధవ్య ! కన్నులున్నందులకు ఫలమును గనలేకపోయితివి. చూడదగిన దానిని చూడలేకపోయితివి.

విదూషకుఁడు : నిన్నుఁ జూచుచుంటినిగదా !

రాజు : అందఱును తమ్మునందమైనవారిగనే భావించుకొనుచుందురు. నేను మాత్రము ఆశ్రమాలంకారమైన ఆ శకుంతలనుగూర్చి చెప్పుచుంటిని.

విదూషకుఁడు : (తనలో) కానిమ్ము, వీని కవకాశమీయకుండ మాట్లాడెదను. (ప్రకాశముగ) మిత్రమా! తాపస కన్యయు నీ కిప్పుడభ్యర్థనీయ మయినదే ?

రాజు : మిత్రుడా! పరిహరింపఁదగిన వస్తువులయెడ పౌరవుల మనస్సు ప్రవర్తింపదు సుమా!

విదూషకుఁడు : అదెట్లు ?

రాజు : సురయువతీ సంభవంబట

8. కం. వరమునిసంతానమంట వారలు విడువన్
దొరికెనటఁ గణ్వముని కా
విరి నవమాలాఖ్య మర్కవృక్షమునవలెన్.

విదూషకుఁడు : (నవ్వి) మిత్రుఁడా! ఖర్జూరపు పండ్లకు విసుగెత్తి చింత పండుఁ దినుటకుఁ కోరికకలిగినట్లు స్త్రీరత్నములనే యంగీక రింపని నీకు ఈ తాపస కన్యయందభిలాష గలిగినదా ?

రాజు : నీవు చూడలేదు గావున అట్లంటివి.

విదూషకుఁడు : నీకే యింత ఆశ్చర్యము జనించినచో ఆమె సుందరియనుటలో సందియమేల ?

రాజు : వయస్య - పెక్కుమాటలేల ?

9. మ. రమణీయంబగు వస్తుజాతముల నె
ల్లి న్గూర్చి యాధాత, యీ
రమణిన్ సృష్టి యొనర్చెనో, పటమునన్
రాణింప, హృద్వీధి, స
త్వముఁ గల్పించి, తలంతునన్యమగు కాం
తారత్న నిర్మాణమం

చమలంబౌ నతిరూప సౌష్ఠవము బ్రి
హ్మ ప్రాభవంబెంచుచున్.

విదూషకుఁడు : అట్లయిన ఆమె రూపవతులకు ప్రత్యాదేశమే.

రాజు ; నా మనమువందీ భావముగూడ గలదు.

10. సీ. ఘ్రాణానుభూతి సంగతికిఁ బొల్పదని క్రొ
వ్వలపు సంపదల మవ్వంపుఁ బువ్వు,
కొనగోళ్ళతోడఁ ద్రుంపని నవారుణమైన
మిసిమిసీనెడు లేఁత కిసలయంబు,
శాణయంత్రోపలకోణ విక్షతిలేక
మధురకాంతులనీను మానికంబు,
రుచులఁ జూడమి వింతరుచినొప్పి యెంతయో
భాసించు క్రొంగ్రొత్త పట్టుజున్నుఁ

గీ. పూర్వజన్మార్జిత శాఖండ పుణ్యఫలమొ,
యనఁగ నొప్పుననర్ఘమై యతివరూపు;
అనుభవింపంగ నెవఁడౌనో యా విధాత
యెవ్వనింగూర్చి యుంచెనో యెరుగఁజాల

విదూషకుఁడు : అట్లే యయినచో వేగముగా ఇంగుదీతైలచిక్కణ శీర్షుఁడగు నాటవికుని హస్తమునఁ బడకుండ ఆమెను గాపాడుకొనుము.

రాజు : ఆమెయా పరాధీనురాలు. గురుజనమా యింటికడలేదు.

విదూషకుఁడు : నీపై నామె యనురాగమెట్లున్నదో

రాజు : సహజముగ తపస్వికన్యలు ప్రగల్భతాహీనలై యుందురు. అయినను –

11. గీ. చూపులను వంచు నేఁదన్ను జూచుచుండ,
నవ్వు నేదో నిమిత్తమునను మృదువుగ,

వినయవారిత వృత్తియై మనసిజుండు
సంవృతుఁడుగాఁడు కాఁడతి వివృతతనుఁడు.

విదూషకుఁడు : చూచినంత మాత్రమున నీ తొడపై వచ్చి కూర్చొను నను కొంటివా ?

రాజు : వినయవతి యయినను, సఖులతోఁగలిసి వెడలిపోవు సమయమున తన భావము నెఱింగించినది. ఎట్లన –

12, గీ. కటకు దర్భాంకురముల విక్షతము పాద
కంజమని కొన్ని యడుగులు కదలి నిలుచు,
మాటిమాటికి ననుఁజూడ మరలుఁగొమ్మ
కంచె వల్కలమని విప్పుకరణి రమణి

విదూషకుఁడు : అట్లయినచో పాథేయము లభించినట్లే, నీవిప్పుడు తపోవనమును ఉద్యానవనమును గావించితి వనుకొందును.

రాజు : మిత్రమా ! నే నిచ్చట నున్నట్లు మునులు కొందఱెఱుంగుదురు, ఆలోచింపుము. ఏ మిషతో మనము మరల ఆ శమమును ప్రవేశించుటకు వలనుపడునో ?

విదూషకుఁడు ; నిమిత్తమున కేమున్నది, నీవు రాజవుగదా !

రాజు ; అయినచో ?

విదూషకుఁడు : నీ వార ధాన్యములో ఆరవ భాగమీయ్యుఁడని.

రాజు : వీరిని రక్షించుటలో మఱియొక మహాభాగ్యము మనకు లభించుచున్నది. రత్నరాశులను గూడ విడిచి దానిని మన మభినందింపవలెను.

13. గీ. ప్రజలచే రాజునకు వచ్చు ఫలము దెల్లఁ
బోవుచుండును నష్టమై భువిని సతము:
వనముల వసించు మునువిడు ధనము పెరుగు,
షష్ఠ భాగంబు తపమదక్షయ్యమగును.

( నేపథ్యమున )

ఆహా ! మన మిరువురము కృతార్థుల మైతిమి.

రాజు : (విని) ఓయీ ! ఆ స్వరము ధీరప్రశాంతమై యున్నది. మును లదై యుండును.

దౌవారికుఁడు : (వచ్చి) ప్రభువులు జయింతురుగాక. మునికుమారు లిద్దఱు ద్వార దేశమునకు వచ్చియున్నారు.

రాజు : ఆలసింపక వారిని ప్రవేశ పెట్టుము.

దౌవారికుఁడు : చిత్తము (వెడలి) (ఋషి కుమారులతో ప్రవేశించి) ఇటురండు- ఇటు రండు.

(ఇద్దఱును రాజును జూతురు)

ప్రథముఁడు : ఆహా ! ఈతని దేహము తేజోవంతమయ్యును విశ్వసనీయమై యొప్పుచున్నది. ఋషుల కేమాత్రమును దీసిపోని యీ రాజుతో నిట్లుండుట యుక్తమే. ఎందువలననఁగా,

14. చం. సకల జనోప భోగ్యమగు

చారుతరా శ్రమమందువిల్చె, నీ

సకల జనాభి రక్షయను

సత్తపమూనె, నిరంతనమ్ము,ను

త్సుకతను రాజమౌనియను

చుందును చారణయుగ్మ మెల్ల నీ

సుకృతిని, నాకలోక పథ

శోభితమీతని కీర్తి నిత్యమై.

ద్వితీయుఁడు : గౌతమ! ఆ మహేంద్ర సఖుండగు దుష్యంత మహారాజు ఈతఁడేనా ?

ప్రథముఁడు : అవును.

ద్వితీయుఁడు : అయినచో

14. చం. పరిఘ సమాన దీర్ఘ దృఢ
బాహువితండొకరుండ, మేదినీ
భరమును వార్ధిమేఖలను
బాలన చేయుట వింతయౌనె, యీ
నరపతి చాపమందు, సుర
నాయకు వజ్రమునందుఁ, గోరుచుం
దురు విజయంబు దేవయువ
తుల్ దితిజా హితవైరలై సదా.

ఇద్దరు ; (సమీపించి) రాజా ! విజయివగుము.

రాజు ; (ఆసనము నుండి లేచి) నమస్కారము.

ఇద్దరు : మంగళములు కలుగుగాక. (ఫలముల నర్పింతురు)

రాజు : (నమస్కార పూర్వకముగ వానిని గ్రహించి) ఏమి ఆజ్ఞ ?

ఇద్దరు ; మీరిచ్చట నున్నట్లాశ్రమవాసులెరింగిరి. కావున వారు మిమ్ముఁ బ్రార్థించుచున్నారు.

రాజు : ఏమని వారి యాజ్ఞ ?

ఇద్దరు : పూజ్యుఁడగు కణ్వమహర్షి యాశ్రమమందు లేనందున రాక్షసులు యజ్ఞములకు విఘ్నముల నాచరించుచున్నారు. సాయుధుఁడవై సారథి ద్వితీయుఁడవై కొన్ని రాత్రులాశ్రమమందుండి మమ్ము గాపాడవలెనని.

రాజు : అనుగ్రహింపఁబడితిని. (ప్రక్కకుఁదిరిగి) ఈ ప్రార్థన యనుకూలమైనదే. రైవతక ! నేను చెప్పినట్లు సారథితోఁ జెప్పుము. బాణబాణాసన పూర్ణమగు రథమును సిద్ధము గావింపుమని.

దౌవారికుఁడు : చిత్తము. (వెడలును)

ఇద్దరు : పరిశుద్ధాన్వయ ధర్మము
15 కం. నెఱిఁగి తిరుగు నీకు యుక్తమిది రాజేంద్రా !,
పురువంశ జాతులందఱు
కరమాపన్నులను బ్రోవగా దీక్షితులే.

రాజు : మీరు ముందుగా బయలుదేరుడు. నేనుకూడా మీ యడుగు జాడలలోనే వత్తును.

ఇద్దరు : విజయము నందుము. (పోవుదురు)

రాజు : మాధవ్యా! శకుంతలను జూడవలెనని కోరిక కలదా?

విదూషకుడు : తొలుతొల్ల పొంగి పొరలునంత అధికముగా నుండెను. కాని యిప్పుడీ రాక్షస వృత్తాంతమును వినుటచే నొక్క చుక్కయును మిగులలేదు.

రాజు : భయపడకుము. నాకడఁగదానుందువు.

విదూషకుడు : ఇఁక రాక్షసుల వలన నాకు భయములేదు. (దౌవారికుడు ప్రవేశించి)

దౌవారికుడు : ప్రభువులు జయింతురుగాక, రథము సిద్ధమై తమ విజయ ప్రయాణము నాకాంక్షించుచున్నది. తల్లిగారి యాజ్ఞనుగైకొని నగరము నుండి కరభకుడు ఇప్పుడేవచ్చి యున్నవాడు.

రాజు : (సాదరముగ) అమ్మగారు పంపించిరా?

దౌవారికుడు : చిత్తము.

రాజు : రమ్మనుమని చెప్పుము.

దౌవారికుడు : అట్లే. (వెళ్ళి కరభకునితోఁగలసివచ్చి) వారే ప్రభువులు వెళ్ళుము,

కరభకుడు : (సమీపించి) జయము మహారాజునకు. "రాఁబోవు నాల్గవ దివసమున నాయుపవాసము పరిసమాప్తమగును. ఆనాఁడు పారణా సమయమున చిరంజీవి నాకడ నుండవలెను" అని అమ్మగారు సెలవిచ్చినారు.

రాజు : ఒక వంక తపస్వి కార్యము. వేరొకవంక తల్లిగారి యానతి. రెండును అనతిక్రమణీయములే. ఇప్పుడేది చేయుట.

విదూషకుడు : త్రిశంకువలె నంతరాళమున నుండుట.

రాజు : హాస్యమునకేమి? నిజముగా ఆకులీకృతమనస్కుఁడనయితిని.

17. గీ. కార్యములు వేరుచోటులఁ గల్గ కతనఁ
జిత్రమయ్యెను రెండుగాఁ జీలియిపుడుఁ
కొండ యడ్డుగ ముందర నుండి తగుల
వేరుగా పాఱు వాహినీ పూరమట్లు.

(ఆలోచించి) మిత్రమా ! మాయమ్మగారు నిన్ను పుత్రునిగానే భావించి యుండిరి. కావున నీవు ఇచ్చటినుండి యేగి నా తపస్వి కార్యాసక్తతను వారికిఁదెల్పి పుత్ర కృత్యమును నిర్వర్తింపుము.

విదూషకుఁడు : నన్ను రాక్షస భీరువని తలంపకుము.

రాజు : ఓయీ ! మహా బ్రాహ్మణ ! అట్లెందులకు భావింతును. నీ వట్టి వాఁడవా ?

విదూషకుఁడు : అయినచో రాజ సోదరునివలె వెళ్ళెదను.

రాజు : తపోవనమునకు నిరోధముండరాదు. కావున అనుయాత్రికుల నందఱినికూడ నీ తోడనే పంపెదను.

విదూషకుఁడు : అట్లయినచో నే నిప్పుడు యువరాజు నైతిని.

రాజు : (తనలో) ఈబ్రాహ్మణుఁడు చపలచిత్తుఁడు. ఒకవేళ ఈశకుంతలా వృత్తాంతమును అంతఃపుర కాంతలకడ ననునేమో ! వీనితో మఱియొక విధముగఁ జెప్పెదను. (విదూషకుని చేతి నందుకొని) (ప్రకాశముగ) వయస్యా ! మహర్షులందలి గౌరవముచే నాశ్రమమున కేగుచుంటిని. కాని, నిజముగా ఆ తాపస కన్యకయగు శకుంతల యందనురాగము చేతకాదు సుమా ! చూడుము.

17. గీ. వతుల మేమేడ ? మృగశాబ వర్ధితయయి
కామవృత్త్యనభిజ్ఞయౌ కన్యయేడ ?
హాస్యమున కంటి నామాట యాప్త సఖుఁడ !
దీనిఁ బరమార్థము గదుదిఁ బూనకయ్య.

విదూషకుఁడు : అట్లే.

(అందఱును బోవుదురు)

# తృతీయాంకము

(యజమాన శిష్యుఁడు దర్భలను గ్రహించి వచ్చును)

శిష్యుఁడు : ఓహో! దుష్యంత మహారాజు మహానుభావుఁడుగదా! ఆపూజ్యుఁడు ఆశ్రమమును ప్రవేశింపగనే మాకార్యములన్నియు నిరుపద్రవముగ నెరవేరినవి.

1. గీ. బాణ సంధాన మను మాట కానరాదు
ధనువు హుంకారమా యనదగిన వింటి
నారి చప్పుడు చేతనే దూరమయ్యె
విఘ్నసంఘంబులన్ని నిర్విఘ్నముగను.

వేదినలంకరించుటకునై యీదర్భలను ఋత్విక్కుల కందించెదను, (వెళ్ళి-చూచి) (ఆకాశమున)

ప్రియంవదా : ఈ వట్టివేళ్ళ గంధము - తామరతూడులు - తామరాకులు- ఎవరి కొఱకు ? (విననట్లభినయించి) ఏమనుచుంటివి ? ఎండ వేడిమిచే శకుంతల అస్వస్థయనియా ? ఆమె సంతాప శాంతి కనియా ? అయినచో మిక్కిలి కష్టపడియెనను ఆమెకుఁజికిత్సఁ గావింపుడు. ఆమె కులపతులకు జీవితమే. నేను కూడా గౌతమి ద్వారా వైతానిక శాంత్యుదకమును పంపెదను. (వెడలును)

శుద్ధ విష్కంభము

(పిమ్మట కామయమానావస్థతో రాజు ప్రవేశించును.)

రాజు : ఎఱుఁగుదుఁదపంబు శక్తిని

2. కం. పరపతియాపదఁతియంచుఁబరికించితినే
మరలింప నేరకుంటిని
తరుణి సంసక్త చిత్త తాత్పర్యంబున్.

(మదన బాధను. నిరూపించును)

ఓ భగవానుఁడా ! కుసుమాయుధా !

నీవును చంద్రుఁడును కాముకజన సంఘమును మోసగించుచు న్నారు.

3. మ. సుమబాణుండవు నీ వటంచు జనులా
సోముండు శీతాంశువం
చుమహింబల్కుదుల్ నిజంబులగునే
చూడంగ, మా బోంట్ల పై
హిమ గర్భంబుల రశ్మిలన్ విధుఁడు వ
హ్నిన్ జల్లుచుండంగ, నా
సుమ బాణంబుల వజ్రసారములు నీ
సుంజేంది యీ వేయుటన్.

(విచారముతో - నడుచుచు) యజ్ఞము పరిసమాప్తమైనందున వెడలిపోవుటకు ఋత్విక్కుల యనుమతి నందితిని. విరహ క్లాంతమైన చిత్తమును ఎట్లు వినోదింపఁజేయుదును ? (నిట్టూర్పు విడిచి) ప్రేయసిని గాంచుటకంటె అన్యమగు శరణమేమికలదు: ఇప్పుడామెనే వెదకెదను. (సూర్యుని వైపుచూచి) ఈ తీవ్ర మైన ఎండవేళ తఱచుగ లతావలయా వృతమగు మాలినీ నదీ తీరమందు శకుంతల సఖులతో వినోదించుచుండును. అచ్చటికే యిప్పుడేగెదను, (వెళ్ళి - స్పర్శ సుఖము ననుభవించి) ఆహా ! ఈ ప్రదేశము చక్కని గాలి వీచుటచే ఎంత మనోహరముగ నున్నది !

4. గీ. పవన మరవిందగంధ సంభరితమయ్యె
మాలినీ భంగ జలకణ జాలమగుచుఁ
గామ పంతప్త గాత్రుల పేమ మరయ
వతము నా లింగనము సేయ శక్యమగును.

(కొంత దూరము నడిచి-చూచి) వేతస సమావృతమైన యీ లతా మండపమందుఁ దప్పక శకుంతల యుండును. ఏమనఁగా.

5. గీ. పూర్వ మభ్యున్నతంబయి ముగ్ధజఘన
గౌరవంబున వెనుక వగాధ మగుచుఁ
బాండు సైకత తలమునఁ బాదపంక్తి
ద్వార మందభి నవమయి దర్శన మిడె.

విటపాంత రితుఁడనై చూచెదను. (వెడలి - అట్లు గావించి) ఆహా! కన్నులకుఁ బండువైనది. ఈ నా మనోరథ ప్రియతమ పుష్పాలంకృతమగు శిలాఫలకముపై పరుండి సఖులచే సేవింపఁ బడుచున్నది. (చూచుచు కూర్చుండును)

(పై రీతిని సఖులతో శకుంతల ప్రవేశించును)

సఖులు : (వీచుచు) శకుంతలా! ఈ తామరాకు వీవనగాలి సుఖముగ నున్నదా?

శకుంతల ; సఖులారా! మీరు వీచుచుంటిరా?

సఖులు : (విషాదముతో నొకరి నొకరు చూచుకొనుచుందురు)

రాజు ; పూజ్యురాలయిన యీ శకుంతల మిక్కిలి యస్వస్థయైనట్లున్నది. ఇది ఆతపదోషమా? లేక, మదన దోషమా? నాకు రెండు విధములుగను పొడగట్టుచున్నది. అయినను సందేహమేల,

6. చం. స్తనతటమందు శీరమును
సంశిథిలైక మృణాళ కంకణం
బును దెలుపున్ ప్రియాంగమున
పూర్వరు జావిలమంచునైన నీ
తనువు మనోజ్ఞమయ్యె మతి
తాపము తుల్యము గ్రీష్మకామవే
దనల నిదాఘమందిట్టుల
తన్వుల కందము చెందుచుండునే.

ప్రియంవద : (జనాంతికముగ) అనసూయా! ఆ రాజర్షిని చూచిన నాఁటినుండి పర్యుత్సుకయైయాపన్నురాలయినట్లున్నదీ శకుంతల. ఈమెకు అతని నిమిత్తముగ నీ సంతాపము జనించియుండునా?

అనసూయ : సఖీ! నాకుఁగూడ నీయనుమానమే మనస్సులో గలుగుచున్నది. ఉండుము. ఆమెనేయిప్పుడడిగెదను.

ప్రియంవద : (ప్రకాశముగ) సఖీ! నిన్నొకటడిగెదము. నీ సంతాపము బల వత్తరముగ నున్నది.

శకుంతల : (పుష్పశయ్య నుండి పూర్వార్ధమున లేచి) సఖీ! ఏమి చెప్పఁ దలంచితివి?

అనసూయ : సఖీ! శకుంతలా! మనకీ మన్మథ వృత్తాంత మెట్టిదో తెలియదు. కాని, ఇతిహాసాది గ్రంథములందుఁగాముకులయవస్థయెట్లు వినఁబడెనో నీయందయ్యది కనఁబడుచున్నది. చెప్పుము. ఈ యాయాసము ఏ నిమిత్తమునఁగలిగినది? వికృతిని యథార్థము గుర్తింపక పరిహారమును ఆరంభింపరుగదా!

రాజు : నా యూహయే యనసూయకుఁగూడఁగలిగినది. నేనే యిట్లూహించుకొనలేదు.

శకుంతల , (తనలో) నా మనోరథము బలీయమైనది. తొందరపడి వీరికిఁ గూడఁ జెప్పలేకుంటిని.

ప్రియంవద : సఖీ! అనసూయ చక్కగాఁ జెప్పినది. రోగమును ఏల యుపేక్షించెదవు? దినదినమునకు చాల కృశించుచుంటివి, ఒక్కలావణ్యమయమగు కాంతి మాత్రము నిన్ను విడువలేదు.

రాజు : ప్రియంవద యథార్థమునే పలికినది.

1. సీ. అతికృశగండమైయలరారు సతిమోము
వసివాడె మిగులనీవనిత నడుము,
వక్షము కాఠిన్య వర్జితోరు కుచమ్ము
పాండుర వర్ణమ్ము పడఁతి తనువు,
అతి మాత్ర వినతమ్ము లంసమ్ములింతికి
మదన పరిక్లిష్ట మగువ యీమె,
శోచనీయయయ్యు శోభిల్లె నీయమ
ప్రియదర్శనీయయై ప్రేమగదుర,

గీ. దళవిశోషణకారియౌ దక్షిణంపు
మారుతంబున సంస్పృష్ట మాత్రయైన
మాధవీలతచాడ్పున మగువయీమె
యుండెనిప్పుడు కన్నులపండువగుచు.

శకుంతల : (సిగ్గుతో) సఖీ! నేనింకెవ్వరికిఁజెప్పెదను! కాని మీకు శ్రమను కలిగించుచుంటిని.

అనసూయ : అందులకే యీ నిర్బంధము. స్నిగ్ధజనులందు విభక్తమయిన దుఃఖము సహ్యావేదనమగునుగదా!

రాజు : బాలను దుల్యదుఃఖసుఖ

8. ఉ. బంధు జనంబడుగంగఁజొచ్చెనీ
బేల మనోగతంబయిన
వేదనఁ దెల్పును దప్పకంత న
వ్వీ లలితాంగి సూచె మర
లించి ముఖంబు సతృష్ణఁ బెక్కుసా
ర్లీ లలనాలలామ యిపు
డేమనునో యివ భీతి కల్గెడిన్.

శకుంతల : (సిగ్గుతో) సఖి! ఏనాడు ఆ తపోవన సంరక్షియగు రాజర్షి నా కంటఁబడెనో నాఁటినుండి యాతని యందభిలాషచే విట్లయితిని.

రాజు ; (ఆనందముతో) వినఁదగిన దానిని వింటిని.

9. కం. మరుఁడయ్యెఁ దాపహేతువు
మరుఁడే తత్తాపశమ సమర్థుండయ్యెన్,
అరుదుగ గ్రీష్మాంతంబున
శరదావృత దినము జీవ సమితికిఁ బోలెన్.

శకుంతల : మీ కంగీకారమయినచో ఆ రాజర్షి నన్నను గ్రహించునట్లు గావింపుడు. లేనిచో నాకుఁ దిలోదకమును విడువుఁడు.

రాజు : సంశయచ్ఛేది యీ వచనము.

ప్రియంవద : (జనాంతికముగ) అనసూయా ! ఈమె దూరగత మన్మథ. మన మింక జాగుచేయుటతగదు. ఈమె యెవనిఁ బ్రేమించెనో యాతఁడు పౌరవకుల లలామభూతుఁడు. ఈమె మనోరథము అభినంద నీయమే.

అనసూయ : (జనాంతికముగ) సఖీ ! నీ వన్నట్లే (ప్రకాశముగా) (శకుంత లను జూచి) సఖీ ! నీ సంకల్పము దైవవశమున అనురూప మైనదే. మహానది సాగరమునువిడిచి మఱియొకచోటికి వెళ్లగలదా?

ప్రియంవద : పల్లవితమైన మాధవీలతను పరిగ్రహించుటకు సహకారముదక్క అన్యమెట్లర్హమగును ?

రాజు : విశాఖలు శశాంకలేఖ ననువర్తించుటలో చిత్రమేమున్నది ?

అనసూయ : విలంబము లేకుండ, రహస్యముగ, సఖీ మనోరథమును సాధిం చుటకు ఉపాయమేమికలదు ?

ప్రియంవద : రహస్యముగ నాచరించుటకే యుపాయము నాలోచింపవలెను. వేగముగా చేయుట సుకరమే.

అనసూయ : అదెట్లు ?

ప్రియంవద : ఆ రాజర్షియు ఈమె యెడల బద్ధానురాగుఁడై ఇన్నినాళ్ళును నిద్ర లేక కృశించియే యున్నాడు.

రాజు : అవును – నిజము – అట్లే అయితిని. ఏమన–

10. చం. ఎడఁద జనించు తాపమున
నించుక యుష్ణములై భుజాగ్రమం
దిడుకనుకోన నుండి నిశి
వెంతయుఁగారిన యశ్రుబిందులన్
దడిసి వివర్ణరత్నమయి
శాకక జ్యాకిణలక్షణంబులన్
విడిపడు చేతి కంకణము
వేమరు నెత్తుచునుంటి నెప్పుడున్.

ప్రియంవద : (ఆలోచించి) సఖీ! అతనికొక ప్రణయలేఖను వ్రాయుము. దానిని సుమనో గోపిత మొనరించి దేవతా ప్రసాదమని చెప్పి యారాజునకందునట్లు పంపెదము.

అనసూయ : ఈ సుకుమార ప్రయోగము నా కిష్టపడినది. శకుంతల యేమనునో!

శకుంతల : నేను మీమాటను దేనిని కాదంటిని?

ప్రియంవద : అయినచో ఉపన్యాస పూర్వకముగ లలితపదబంధమగు దానినాలోచింపుము.

శకుంతల : సఖీ! ఆలోచించుచుంటిని, కాని, యాతఁడు తిరస్కరించునేమో యని హృదయము కంపించుచున్నది.

రాజు : (తనలో)

11. చం. ఎవఁడు తిరస్కరించునని
యింతకు భీతిని నందుచుంటివో
కువలయనేత్ర! వాఁడిచటఁ
గూరిమి సంగమ కాంక్షియై భవ
త్సవిధమునందునుండె సిరిఁ
దాల్పఁగఁగోరిన వచ్చు, మాను, నీ
భువి సిరియే తనంత నరుఁ
బొందఁగఁగోర వరింప కుండునే.

ప్రియంవద : ఓసి! ఆత్మగుణావమానిని! ఎవ్వడిప్పుడు శరీర సుఖ సంధాత్రియగు శారద చంద్రికను వస్త్రాంతమున నివారించును?

శకుంతల : (నవ్వుచు) నియోగింపబడితిని.

(లేచి కూర్చొని ఆలోచించుచుండును)

రాజు : యుక్తమే. ఱెప్పవేయుటను మరచియే నేను నా ప్రేయసిని జూచుచుంటిని. ఏమన -

12. గీ. మాటలను గూర్చుచున్నట్టి ముగువమోము
పూర్ణమై యూర్ధ్వగమితైక భ్రూలతంబు
నగుచుఁ బులకితమౌతన యమలగండ
పాళి నెఱిగించు నాపయి వరలు ప్రేమ.

శకుంతల : సఖి ! గీతిక నాలోచించితిని. లేఖన సాధనములు సమీపమున లేవే ?

ప్రియంవద : శుకోదర సుకుమారమైన యీ లేఁత తామరాకుపై నీ నఖాగ్రము లతో అక్షర విన్యాసము గావింపుము.

శకుంతల : (చెప్పినట్లు చేసి) సఖులారా ! దీనిని వినుఁడు. సంగతార్థమగునో గాదో ?

సఖులు : సిద్ధముగా నుంటిమి.

శకుంతల : (చదువును)

13. గీ. తెలియకుంటివి నీ మది తెల్లముగను
విన్నుఁ దలపోసి నిత్యము విన్ననైన
నాదు గాత్రము మదనుండు నక్తమహము
గాఢముగఁ దప్త మొనరించుఁ గఠిన హృదయ !

రాజు : (వేగముగ వచ్చి)

14. కం. మదనుఁడు పీడించెను నిను
సదయతఁ దన్వంగి ! నన్నహర్నిశ మేర్చెన్
విధువి స్పీడించిన గతి
వధియించునె దినము కలువ వల్లినిఁ గడఁకన్

సఖులు : (చూచి - సంతోషముతో) అవిలంబితమగు మామనోరథమునకు స్వాగతము.

శకుంతల : (లేచుటకు యత్నించును)

రాజు : వలదు - శ్రమపడవలదు.

15. గీ. అంటుకొని పుష్పశయ్యపై నతిరయమున
వాడి వత్తులునౌ బిసభంగ సంగ
సురభిళంబులు గురుతాపభరములైన
గాత్రములు నీవియుపచార పాత్రములొకొ.

అనసూయ : ఇచ్చట ఈ విశాలశిలాతలైక దేశమును మా ప్రియవయస్యుఁ డధిష్ఠించుగాక.

రాజు : (కూర్చుండును)

శకుంతల : (సిగ్గుతోనుండును)

ప్రియంవద : వయస్య ! మీ యిరువురియనురాగము ప్రత్యక్షమేకదా! అయినను మా సఖియందలి స్నేహము నన్ను మాట్లాడించుచున్నది.

రాజు : భద్రా! అది నిషేధింపరానిది. చెప్పఁదలంచిన దానిని చెప్పకున్న పశ్చాత్తాపము కలుగును.

ప్రియంవద : తన దేశమందున్న అపన్నజనుల యార్తిని నివారించుట రాజు ధర్మము గదా !

రాజు : అవును, మాకంటెనితరులెవ్వరునుందరు.

ప్రియంవద : మా ప్రియసఖి మిమ్మునుద్దేశించి ఆ భగవంతుఁడగు మన్మథునిచే ఇట్టి యవస్థకుఁబాల్పడినది. తమరు అనుగ్రహించి ఆమె జీవితమును నిలుపవలెను.

రాజు : భద్రా! ఈ ప్రణయము సామాన్యమే. సర్వవిధముల నేనను గ్రహింపఁబడితిని.

శకుంతల : (ప్రియంవదను జూచి) సఖీ! అంతఃపురకాంతా విరహ పర్యాకుల చిత్తుఁడగు ఆతని ఏల నిర్బంధించెదవు?

రాజు : చిత్తమందున నివసించు చెలువ ! నీవె

16. యన్యకాంతాపరాఙ్ముఖమైన నాదు
చిత్తమెుండఁగ భావింపఁజిత్తజాత
హతుఁడనయ్యును మరల నే హతుఁడనయితి.

అనసూయ : వయస్య ! రాజులు బహువల్లభులని ప్రతీతి. మా సఖి బంధుజనశోచనీయ కానట్లు ప్రవర్తింపుము.

రాజు : భద్రా ! పలుమాటలేల ?

17. గీ. బహు కళత్రములున్నను భార్య లిరువు
రొప్పుచుందురు నా కులముద్ధరింప
నబ్ధి మేఖలయై యొప్పు నవని యొకతె.
యన్నులకు మిన్న యీ మీ వయస్య యొకతె.

సఖులు : మిక్కిలి సంతోషము.

ప్రియంవద : (దృష్టిని వేరుగా మరల్చి) అనసూయా ! ఆ లేడిపిల్ల యిటువైపే చూచుచు తన తల్లికై యారాటపడుచున్నది. రమ్ము, దానిని తల్లి కడకుఁ జేర్చెదము. (బయలుదేరుదురు)

శకుంతల : సఖి ! అశరణనయితిని. మీలో నొకరుండుడు.

ఇరువురు : పృథివీ సంరక్షకుఁడగు పార్థివుఁడే నీకడ నున్నాడు గదా ! (పోవుదురు)

శకుంతల : అయ్యో ! ఇరువురును వెళ్ళిరే !

రాజు : ఎందులకా తొందర ? నిన్నారాధించువాడు నీ సమీపమునే యున్నాఁడు గదా !

18. ఉ. శీతల వాత పోతములు
చేరి శరీరము సేద దేర్ప నే
వీతునవ ? పద్మినీ దళపు
వీవనలన్ ప్రియమార నీకు వా
ర్జాతములట్లు శ్రమమ్ముదు
చారు పదంబుల నంక పీఠియం
దో తనుగాత్రి ! చేర్చి సుఖ
మొప్పఁగ సంవహనం బొనర్తునా ?

శకుంతల : మాననీయుల యెడ అపరాధిని కాఁజాలను.

(లేచి ప్రయాణించును)

రాజు : సుందరి ! దివస మింకను ప్రశాంత తాపము కాలేదు. నీ యవస్థ చూడ నిట్లున్నది.

19. ఆ. వె. విడిచి కుసుమశయ్య వీడి సరోరుహ
పత్రకల్పిత కుచప్రావరణము
నాతపమున నెట్టులడుగిడఁజాలుదు
పేశలాంగి! యీవుపీడితవయి.

(బలాత్కారముగ నామెను వారించును.)

శకుంతల : పౌరవ ! వినయమును విడవకుము. మన్మథ పరాధీననయినను నేను అస్వతంత్రనుగదా !

రాజు : ఓ పిరికిదానా ! గురుజనులవలన భయమందుచుంటివా? చాలును ! సకలధర్మమర్మజ్ఞుఁడగు ఆకులపతి దీనిని అధర్మముగ భావింపఁడు చూడుము.

20. కం. పరిణయమాడిరి పలువురు
ధరలో రాజర్షిసుతలు ధర్మంబనుచున్
విరివిగ గాంధర్వంబున
మురియుచుఁదత్పితలు వారి మోదము తెలుపన్.

శకుంతల : ఆర్యా ! నన్నిప్పుడు విడువుము. మఱియొకసారి నాచెలులఁ నడిగెదను.

రాజు : అట్లే విడిచెదను.

శకుంతల : ఎప్పుడు ?

రాజు : అనుపహతకోమలంబై

21. కం. యనుప మనవకు సుమతుల్యమౌ నీయధరం
బును షట్పదవిధముననే
గొనిరసముస్దయను విడుతుఁగోమలిపిదపన్.

(ఆమె మోము నెత్తుటకు యత్నించును)

శకుంతల : (వారించుచుండును) .

(నేపథ్యమున)

ఓ చక్రవాకాంగనా! నీ సహచరు నాహ్వానింపుము. రాత్రి వచ్చు చున్నది.

శకుంతల ; (విని – త్వరగా) పౌరవ ! సందేహములేదు, నాయారోగ్యమును తెలిసికొనుటకై ఆర్య గౌతమి స్వయముగా నిటే వచ్చుచున్నది. ఆలతావలయాచ్ఛాదితుఁడవై యుండుము.

రాజు : (అట్లే తన్నుఁగప్పుకొనియుండును)
(పాత్రహస్తయగు తాపసియు సఖులునువత్తురు)

సఖులు : ఇటు – ఇటు.

గౌతమి : (శకుంతలను సమీపించి) అమ్మా! నీ యవయవ సంతాపము చల్లారినదా?

శకుంతల : కొంచమున్నది.

గౌతమి : ఈ మంత్రితదర్భోదకముతో నీ శరీరమందలి తాప :ంతయును పోవును. (తలపై ఆజలమును చల్లి) అమ్మా! ఎండ తగ్గినది. రమ్మా. పర్ణశాలకుఁ బోవుదము.

శకుంతల : (తనలో) హృదయమా! నామనోరథము సుఖముగ ఫలించు సమయమున పిరికిదానవైతివి. విడచిపోవునపుడు పశ్చాత్తాప పడుచుంటివి. (రెండడుగులువేసి) (ప్రకాశముగా) లతావలయమా! సంతాపహారకమా! తిరిగి పరిభోగమునకా మంత్రింతును.
(అతి కష్టమున నందటితోఁగలిసి యేగును)

రాజు : (మొదటి చోటును చేరి) (నిట్టూర్పు పుచ్చి) ఆహా? ప్రార్థించిన కార్యములకు విఘ్నములు సంభవించనవి కదా! నేను –

22. గీ. అధరమును మాటికంగుకలంటఁ గప్పి
పలికి వలదని వైక్లబ్యలలిత ముగను
అంస సన్న్యస్తమై యొప్పు నతివమోము
నెట్టులో యెత్తితిని ముద్దు నెఱుఁగనైతి.

ఎక్కడికిప్పుడేగఁగలను. ఇక్కడే ప్రియా పరిభుక్తముక్తమైన యీ లతా మండపమునే క్షణకాలముండెదను.

23. సీ. లోలాక్షిగాత్ర వి లులితమై శిలపైన
ప్రయ్యలై పడు పుష్ప శయ్య యిదియ,
నఖ సహాయంబున నళినీ దళంబుపై
లిఖితమై క్లాంతమౌ లేఖ యిదియ,
అమలాంగి హస్తంబునంది యుండఁగలేక
భ్రష్టంబునౌ బిసాభరణమిదియ,
అతివ పయోధరక్షతినంది శీర్ణమై
పడియున్న పద్మినీ పత్ర మిదియ.

గీ. అనుచు నంతటఁజూపులనునుచుకొనుచు
శూన్యమయ్యెను వేతసమాన్య గృహము
వీడి యేగుట కిప్పుడు వింత మనసు
నొప్పకున్నది యొప్పుల కుప్పఁదలఁచి.

(నేపథ్యమున)

24. శా॥ ఆరంభించిన యంతనే సవన కా
ర్యంబు ల్దినాంతంబు నం
దారక్ష స్సముదాయ భీకర శరీ
రానాతపా కారముల్,
స్ఫార జ్వాలమయాగ్ని వేదికలపై
భాగంబులన్ బ్రేలి సం
చారంబుల్ పొనరించెఁ బెక్కు గతులన్
సంధ్యాభ్రరాగచ్ఛవిన్.

రాజు : (విని) ఇదిగో వచ్చుచున్నాను. (వెడలును)

—

# చతుర్థాంకము

## విష్కంభము

(పువ్వులను గోయుచు నిద్దరు సఖులు వత్తురు)

అనసూయ : సఖీ ! ప్రియంవదా ! గాంధర్వ విధిచేఁ బరిణీతయై శకుంతల యనురూపుఁడగు పతిని బడసినందులకు మనస్సెంతయో తృప్తిగా నున్నది. కాని ఇదిమాత్రము కొంత విచార హేతువగుచున్నది.

ప్రియంవద : ఏమది ?

అనసూయ : యజ్ఞము పరిసమాప్తము కాగానే ఋషులచే విడువఁబడిన యా రాజర్షి తన నగరమునకేగి యంతఃపురమును జేరి యిచటి వృత్తాంతమును స్మరించుచున్నాఁడా ? లేదా ? అని.

ప్రియంవద : నమ్మకముతో నుండుము. అట్టి ప్రకృతి గుణవిరోధిని కాఁజాలదు. తాత కాశ్యపుఁడీ వృత్తాంతమును విని యేమి చేయునో ? తెలియకున్నది.

అనసూయ : నా యాలోచనానుసారము ఇది ఆతనికి సమ్మతమే యగును.

ప్రియంవద : ఎట్లు ?

అనసూయ : గుణవంతుఁడగు వరునకుఁ గన్యక నీయవలెనని తాత కాశ్యపుని ముఖ్య సంకల్పము దానిని దైవమే నెరవేర్చినది. తాత కాశ్యపుడు ఆయాసపడకుండ కృతార్థుడైనట్లే.

ప్రియంవద : (పూలసజ్జను జూచి) పూజకు వలయునన్ని పూలను గోసితిని.

అనసూయ : శకుంతల సౌభాగ్యదేవతనుగూడ పూజింపవలెనుగదా

ప్రియంవద : అవును. (అట్లే పూలను గోయుచుందురు)

(నేపథ్యమున)

ఓయీ - నేను
ఓయీ - నేను
ఓయీ - నేను

అనసూయ : (విని) అతిథుల మాటలవలె నున్నవే ?

ప్రియంవద : శకుంతల పర్ణశాలకడ నున్నదికదా!

అనసూయ : ఉన్నది. హృదయమున మాత్ర మచ్చటలేదు.

ప్రియంవద : అవును. చాలు నీ పువ్వులు. పదము

(ఇరువురును బయలుదేరుదురు)

(నేపథ్యమున)

ఆఁ అతిథిపరిభావినీ!

1\. ఉ. ఎవ్వనిఁ జిత్తమందిడి త
దేకమనస్కత నింతకాల మే
సవ్వడి చేసి యిట్లు పలు
సారులు పిల్వఁ దపోధనున్ నను
గ్రొవ్వి తిరస్కరించితివొ
కోమలి! విస్మరియించువాఁడు ని
న్నెవ్విధి బోధచేసినఁబు
రేరితమున్ మతిహీను చాడ్పునన్.

అనసూయ : అయ్యో! అయ్యో! అదే జరిగినది. పూజార్హుఁడైన యే యతిథినో శకుంతల యవమానించినది. (మరలఁజూచి) మఱి యెవ్వరినికాదు. ఆతఁడు సులభకోపియగు దుర్వాసోమహర్షి. అట్లు శపించి అతి తీవ్రవేగమునఁ బాఱిపోవుచున్నాఁడు. అగ్ని దక్క కాల్చునది. మఱియొకచేదియుండును. పొమ్మ. పాదము లపైఁబడి నమస్కరించి వానిని మరలింపుము. ఈ లోపల నేను అర్ఘ్యమును గ్రహించి వత్తును.

ప్రియంవద : అట్లే (వెడలును)

అనసూయ (త్రొట్రుపాటునఁబడి) అయ్యో! తొందరలో కాలు జారుటచే నా చేతినుండి పూలసజ్జ పడిపోయినదే ? (పూలనెత్తును)

ప్రియంవద : (వచ్చి) సఖి! ఆతఁడు వక్రస్వభావుఁడు. ఎవ్వరి ప్రార్థనను వినును ? కొంచెము మాత్రము కనికరించినాఁడు.

అనసూయ : ఇదియును ఆతనిపట్ల అధికమయినదే. చెప్పుము చెప్పుము.

ప్రియంవద : ఎంత ప్రతిమాలినను తిరిగివచ్చుటకాతఁడు ఇష్టపడకున్న నేను ఇట్లు మనవిచేసితిని.

అనసూయ : ఏమని ?

ప్రియంవద : భగవానుడా ! ముందున్న యామె భక్తిని గుర్తించి, తమ ప్రభావము నే మాత్రము నెఱుంగని మీ కుమారి చేసిన యీ యొక్కయపరాధమును క్షమింపుఁడు. అని.

అనసూయ : తరువాత. తరువాత

ప్రియంవద : అప్పుడాతఁడు నామాట తిరుగరానిది. అయినను అభిజ్ఞాన దర్శనానంతరమున శాపము అంతమగును" అని పలుకుచు నంతర్హితుఁ డయ్యెను.

అనసూయ : ఊరడిల్లుటకు కొంత అవకాశము కలిగినది. ఆ రాజర్షి తన గృహమున కేగుచు స్వనామాంకితమగు అంగుళీయకమును స్వయముగ శకుంతల కిచ్చెను. తన్మూలమున శకుంతల యాతని స్వాధీనుని గావించుకొనును.

ప్రియంవద : రమ్ము – ఆమె దేవకార్యముల నాచరింతము. (పోవుదురు)

ప్రియంవద : (చూచి) అనసూయా ! ఆమెను చూడుము, వామహస్తో పహిత వదనారవిందయై ఎలా శిలా ప్రతిమవలె నెట్లున్నదో ? భర్తృగత చింతచేఁ దన్నుఁ దానే మరచియున్నది. అగంతకుని మాట యెక్కడిది ?

అనసూయ : ప్రియంవదా ! ఈ విషయము మన యిరువురి కడనే యుండవలెను. మన సఖి పేశల స్వభావ కదా !

ప్రియంవద : ఇప్పుడు వేడినీటిచే నవమాలికను ఎవ్వఁడు తడుపును ?

(వెడలుదురు)

విష్కంభము

( నిద్రనుండి లేచి శిష్యుడు ప్రవేశించును)

శిష్యుడు : ప్రవాసమునుండి మరలి వచ్చిన పూజ్య కాశ్యపులు నన్ను వేళ నెఱింగి రమ్మని పంపినారు. బయటికేగి యెంతరాత్రి మిగిలి

యున్నదో చూచెదను. (వెడలి-చూచి) అయ్యో ! తెల్లవారినదే ! ఏమన -

2. మ. ఒక వైపస్తమహీధ్రమంటఁజనెన
యుషధీశుండర్కుండు పే
రొక వంకన్ జనియించుచుండె నరుణుం
డుండంగ ముమ్ముందుగా
నొకమారీ ద్వయి దివ్యతేజముల కిం
దొప్పారె నాశోదయా
త్మక చిహ్నంబులు లోకమిట్టి దశలన్
దాల్చున్ సుడీ యన్నటుల్.

మఱియు,

3. చం. కలువలతేఁడు కన్పడక
గాసిలినంతనఁ గల్వతీగ తా
వెలుగుచునున్న ముందువలె
విందొనరింపదు కంటికెంతయున్
గలుగును దుఃఖమెంతయిన
కాంతులు దవ్వుగ నేగినంతనే
లలనల కీజగంబున దు
రంతము దుర్భరమౌచు నెప్పుడున్.

అనసూయ : (తెరను తొలగించి - ప్రవేశించి) ఎంతటి విషయ పరాఙ్ముఖుఁడైనా వానికైనను ఈమాత్రము తెలియకపోదు. అంతటిరాజు శకుంతలయెడ అన్యాయ్యమాచరించెను.

శిష్యుఁడు : హోమవేళ సమీపించుచున్నదని గురువులకు నివేదించెదను. (పోవును)

అనసూయ : తెలిసియున్నను ఏమి చేయఁగలను. ఉచితములగు కార్యములను ఆచరించుటకుఁ గూడ నాకు కాళ్ళు చేతులు కదులుటలేదు. కాముఁడిప్పుడు సకాముఁడగుగాక ! అమాయికురాలగు శకుంతల అసత్య

సంధుని నమ్మకొనినది. లేదా దుర్వాసుని శాప మిట్లు చేయించి యుండునా ? కానిచో అట్టి రాజర్షి అటువంటి మాటలను పలికిన వాఁడు ఇంతకాలమునకుఁ గూడ ఒక్క లేఖనయినను పంపలేదే? ఇచ్చటినుండి యీ యుంగరము నాతనికి పంపుదునా ? దుఃఖితు లగు తపస్విజనుల మాట నెవరు విందురు ? ఈ దోషమంతయు శకుంతలదనియు తెలిసియు, ప్రవాస ప్రతినివృత్తుఁడైన కాశ్యపు నకు ఈ శకుంతల దుష్యంత పరిణీతయనియు, ఆపన్నసత్వ యనియు, నివేదించుటకు శక్తి చాలకున్నది. ఇట్టిపరిస్థితిలో మాకు రక్షకుఁడెవ్వరు ?

ప్రియంవద : (ప్రవేశించి-సంతోషముతో) అనసూయా ! శకుంతల ప్రయాణో త్సవము నాచరించుటకు త్వరపడుము - త్వరపడుము.

అనసూయ : ఎట్లు?

ప్రియంవద : వినుము. ఇప్పుడే సుఖశయన పృచ్ఛికనయి శకుంతల కడకేగితిని.

అనసూయ : తరువాత - తరువాత-

ప్రియంవద : అప్పుడు లజ్జావనతవదనయగు శకుంతలను దగ్గరకు తీసికొని తాతకాశ్యపుడు ఆమెను ఇట్లు కొనియాడుచుండెను. వత్సా! ధూమా కులిత దృష్టి యయ్యును యజమానుని ఆహూతి దైవవశమున పావకుని యందే పడినది. సుశిష్య పరిదత్తయగు విద్యవలె నీవు నాకు విచారింపరాని దానవైతివి. ఇప్పుడే రాజర్షి పరిగృ హీతవగు నిన్ను నీ పతిసకాశమునకుఁబంపెదను. అని,

అనసూయ : ఈ విషయమును తాతకాశ్యపునకు ఎవ్వరు సూచించిరి?

ప్రియంవద : అగ్నిహోత్రశాలకు అతఁడేగుచుండ ఆకాశవాక్కే సూచించినది.

అనసూయ : చెప్పుము - చెప్పుము

ప్రియంవద : (సంస్కృతమున)

4 కం॥ మహిపతి దుష్యంతునిచే
నిహితంబగు తేజమీమె నెమ్మి ధరించెన్
మహితల సమృద్ధికొఱకై
యహిమకరసమాన ! శమ్మియగ్నినోపలెన్.

అనసూయ : (ప్రియంవద నాశ్లేషించి) చాలా సంతోషము. కాని, యిప్పుడే శకుంతల వెడలునని వినగానే నాకు ఉత్కంఠా సాధారణమగు సంతోషము కలుగుచున్నది,

ప్రియంవద : సఖీ ! మనము ఆవిరహ వినోద దుఃఖమును అనుభవింతము. ఆదీనురాలు సుఖపడనీ.

అనసూయ : అట్లయిన ఈ మామిడి కొమ్మకు వ్రేలఁగట్టిన కొబ్బరి చిప్పలో ఎంతకాలమయినను వాడనట్టి పగడ పూదండను ఆమె కొఱకే దాచియుంచితిని. నీవు దానిని తీసికొనిరమ్ము. నేను ఆమె నిమిత్తమయి గోరోచన, తీర్థమృత్తిక, దూర్వాంకురములు, మంగళాలంకరణములను గైకొని వత్తును.

ప్రియంవద ; అట్లే చేయుము.

అనసూయ : (వెళ్ళును.)

ప్రియంవద (నారికేళసముద్గకము నందుకొనును) (నేపథ్యమున) గౌతమి ! శకుంతలను తోడ్కొని వెళ్ళుటకు శార్ఙ్గరవాదులతో చెప్పుము.

ప్రియంవద : (విని) అనసూయా ! త్వరపడు త్వరపడు హస్తినాపురగాములగు మునులను అప్పుడే ఆహ్వానించుచున్నారు. (అలంకారములను చేత ధరించి యనసూయ వచ్చును.)

అనసూయ : సఖి ! రమ్ము రమ్ము వెళ్ళుదము. (వెళ్ళుదురు)

ప్రియంవద ; (చూచి) ఈమెయే శకుంతల. ఉదయముననే స్నాతయై సిద్ధముగ నున్నది. నీవా రాక్షతపాత్ర హస్తలయి స్వస్తివాచనికలగు తాపసకాంతలు ఈమె నప్పుడే యభినందించుచున్నారు.

(సమీపింతురు) (పిమ్మట ఆసనోపవిష్టయై శకుంతల పూర్వోక్తవిధమున నుండును.)

మునికాంతలలో : నొకతె ( శకుంతల నుద్దేశించి ) కుమారి ! పత్యను రాగసూచకమగు మహాదేవి శబ్దము నందుము.

మఱియొకతె ; వత్సా ! వీరమాతవు కమ్ము.

ఇంకొకతె : భర్తకు బహుమత వగుము.

(ఆశీషములనిడి గౌతమిదక్క నందఱు వెళ్ళుదురు.)

సఖులు : (సమీపించి) సఖి ! సుఖముగా స్నానమాడితివా !

శకుంతల : నా ప్రియసఖులకు స్వాగతము, ఇటఁగూర్చుండుఁడు

ఇరువురు : (మంగళపాత్రములతో సమీపించి) సఖి ! శకుంతలా! సిద్ధముగా నుండుము. మేము ఇప్పుడు ఈ మంగళ ద్రవ్యములతో నిన్ను అలంకరింతుము.

శకుంతల : ఇది చాలా గౌరవింపఁదగినది. ఇటుపై నిట్టిది నాకు దుర్లభము గదా ! (దుఃఖించును)

సఖులు : సఖీ ! మంగళ సమయమున దుఃఖించుట యనుచితము. (కన్నీరు తుడిచి యలంకరింతురు)

ప్రియంవద : ఆభరణార్హమగు నీరూపము ఆశ్రమ సులభములైన అలంకారములచే మారిపోయినది.

(కానుకలను గ్రహించి యిరువురు మునిబాలికులు వత్తురు.)

మునిబాలకులు : ఇవియే ఆభరణములు. పూజ్యురాలిని అలంకరింపుఁడు.

(అందరును చూచి ఆశ్చర్యపడుదురు)

గౌతమి : వత్స ! నారద ! ఇవి యెట్లు వచ్చినవి ?

ప్రథముఁడు : తాత కాశ్యపుని ప్రభావము వలన.

గౌతమి ; మానసిక సిద్ధియా ?

ద్వితీయుఁడు : కాదు. వినుము, శకుంతల నిమిత్తమై పూవులను గోయుడని మాతో పూజ్యులైన కాశ్యపులు చెప్పిరి. తరువాత – ఇప్పుడు –

5\. ఉ. ఇచ్చెను పాదపం బొకటి
యిందునిఁబోలు క్షౌమరాజ మొం
డిచ్చెను పాదలేపమున

కింపగు లత్తుక నన్య వృక్షముల్
మెచ్చగ నిచ్చె భూషలన
మేయములన్ వనదేవతాళియం
దిచ్చుచు నుండఁ దిర్వములో
కించుక కన్పడు పాణి పంక్తులన్.

ప్రియంవద : (శకుంతలను జూచి) సఖి : ఈ యనుగ్రహముచే నీ పతి గృహమున నీవనుభవించు రాజ్యలక్ష్మీ వైభవము సూచింపఁబడినది.

శకుంతల : (సిగ్గుపడును)

ప్రథముఁడు : గౌతమ : రమ్ము రమ్ము, స్నానమున కేగిన కాశ్యపులకు ఈ వనస్పతి సేవ నెఱింగింతము.

ద్వితీయుఁడు : అట్లే - (వెడలుదురు)

అనసూయ : సఖి : మే మాభరణములను ధరించినవారలముగాము. అయినను చిత్రకర్మ పరిచయమునుబట్టి యీ యాభరణములను నీ శరీర మందుంచెదము,

శకుంతల : మీ నేర్పును నే నెఱుంగుదును లెండు.

(ఇరువురును అలంకరింతురు)

(స్నానమునుండి మరలి కాశ్యపుడు వచ్చును)

కాశ్యపుఁడు :

6. చం. ఎడఁద సముత్కమయ్యె నిపు
దేగు శకుంతల యంచుఁ గంఠమున్
బడసెను విస్వరత్వ మతి
బాష్పతఁ జూపులు చింతపేత వం
జడములు స్నేహమాత్ర ఘన

చారికి నా కిటులయ్యో దుఃఖ మీ
పుడమి గృహస్థు లెట్లు తమ
పుత్త్రిని గ్రొత్తగ నంపి యేర్తురో

(నడచుచుండును)

సఖులు : సఖి ! శకుంతలా ! అలంకార క్రియ పూర్తియైనది. ఇప్పుడా ధవళ కౌశేయమును ధరింపుము. (శకుంతల లేచి ధరించును)

గౌతమి : వత్సా ! ఆనంద పరిపూర్ణమగు చూడ్కులతో ఆలింగనముఁ గావించుటకా యనునట్లు నీ తండ్రి నిన్ను సమీపించుచున్నాఁడు. ఆచారమును నిర్వర్తింపుము.

శకుంతల : తండ్రీ ! నమస్కారము.

కాశ్యపుఁడు : వత్సా !

7. గీ. పతికిఁ గడునిష్ట కాంతవై పరగుమయ్య
యాతి నృపునకు శర్మిష్ఠ నాతివోలెఁ
బడయు మాత్మజు సామ్రాజ్య భారవహుని
నామె పూరువుఁ గనినట్లు భామ ! నీవు

గౌతమి : భగవానుఁడా ! ఈ రెండును వరములే. ఇవి యాశీర్వాదములు కావు.

కాశ్యపుఁడు : వత్సా ! రమ్ము. ఇప్పుడే హోమము గావింపఁబడిన యీ యగ్నులకుఁ బ్రదక్షిణము గావింపుము. (అందఱును నడచెదరు)

కాశ్యపుడు : (ఋక్ఛందస్సుతో నాశీర్వదించును)
మత్త : అనుచున్నరి పూర్ణమౌనటు లగ్ని వేదికనంతటన్
బూని దర్భల నాల్గు దిక్కులఁబూర్ణమై సమిదాళిచే
మానితంబగు హవ్యగంధము మాన్పఁబాపములెల్లవై
తాన వహ్నులు మిమ్ముఁజేయుత తత్క్షణమ్ము పవిత్రులన్
బయలుదేరుము. (మఱియొక ప్రక్కకుచూచి)
ఏరీ శార్ఙ్గరవాదులు ? (ప్రవేశించి)

శిష్యులు : భగవంతుఁడా ! సిద్ధముగానున్నారము

కాశ్యపుఁడు : మీ భగినికి మార్గముజూపుఁడు (శకుంతల నడచును.)

కాశ్యపుఁడు ; దేవతావాసములగు ఓ తపోవనతరువులార !

9. ఉ॥ ఎవ్వతె మీకు నీరిడక
యేరసము న్మను గ్రోలకుండునో
యెవ్వతె మీపయిన్దమిన
భీష్టముఁ బల్లవమున్గ్రహింపదో
యెవ్వతె కుత్సవంబు జని
యించు భవత్ప్రథమ ప్రసూతియం
దవ్వనితాలలామ పతి
యండకునేగు ననుజ్ఞ సేయుఁడీ !

(కోకిల ధ్వనిని సూచించి)

10. గీ॥ కాననా వాసమున బంధుగణములైన
తరువులనుమతినిడె నీమె తరలిపోవఁ
బలుకుచుండెను బరభృతకలరుతంబు
లనెడు ప్రతివచనములనహాయటంచు.

(ఆకాశమున)

11. చం॥ హరిత సరోజినీ దళము
లంతటఁగప్పు సరోవరంబులం
తరమున నొప్ప, రమ్యముగఁ
దన్పుచునీడల నాతపోష్ణమం
తరితముఁజేయ వృక్షములు
తమ్మిరజంబున మెత్తనౌచునీ
వరుగు పథమ్ము శాంతసుభ
గానిలమై శివమై యెసంగుతన్.

(అందఱు నాశ్చర్యముగ వినుచుందురు)

గౌతమి : వత్సా ! బంధుజనాభిమానమున వనదేవతలుకూడ నీ ప్రయాణమున కనుమతి నొసంగిరి. ఆ దేవతలకు నమస్కరింపుము.

శకుంతల : (నమస్కరించి - నడచి - రహస్యముగ) సఖి ! ప్రియంవదా ! ఆర్య పుత్త్రి దర్శనమును అభిలషించుచున్నను. ఆశ్రమమును విడిచి యేగుచుంటినను విచారమున నా పాదము లతికష్టముపై ముందునకు పడుచున్నవి.

ప్రియంవద : సఖి ! తపోవన వియోగముచే నీవేకావు, నీ వియోగముచేఁ దపోవనముకూడ నెట్టిదశలోనున్నదో చూడుము.

12. గీ॥ హరిణములు దర్భకబళాల నవనిఁ జార్చె
నృత్యముల వీడి నిలుచుండె నెమళులన్ని
రాల్చుచుండెను పాండు పత్రముల లతలు
దుఃఖమున నశ్రుబిందులఁ దొరఁగునటుల

శకుంతల : (స్మరించి) తండ్రీ ! నా భగినయగు వనజ్యోత్స్నను అడిగి వత్తును ?

కాశ్యపుడు : ఆమెయందు నీ కాసోదర్య స్నేహమున్నదని నాకుఁ దెలియును.

శకుంతల : (లతను సమీపించి) వనజ్యోత్స్నా ! చూత వృక్షముతోఁగలిసియున్నను, ఇతోగతములైన శాఖా భుజములతో నన్నొక్కసారి యాలింగనము గావింపుము, నేఁటినుండి నేను నీకు మిక్కిలి దూర మగుచుంటిని.

కాశ్యపుఁడు : తలఁచితి మున్నె నిన్ను నొక
13. చం॥ ధన్యున కీయఁగ నెమ్మనమ్మునన్
వలచితివీవ నీకుఁదగు
వానిని భర్తను బుణ్యసంపదన్
మలఁగె రసాల శాఖి నవ
మాలికయున్ ముదమార నిప్పుడే
తలఁగెను నాకు నీవయిని
దాని విషయుగ్గల చింతయంతయున్,

ఇచ్చటినుండి త్రోవకడ కేగుము

శకుంతల : సఖులారా ! దీనిని మీ చేతుల యందుంచుచున్నాను.

సఖులు : మమ్ముల నిప్పుడెవ్వరి చేతుల యందుంచెదవు ?
(కన్నీరు కార్చుదురు)

కాశ్యపుడు : అనసూయా ! ఏల యేడ్చెదవు ? మీరే యీమెను ఓదార్చవలెను గదా ! (అందఱును వెళ్ళుదురు)

శకుంతల : తండ్రీ ! పూర్ణ గర్భిణియగు నా హరిణాంగన యుటజప్రాంతము ననే తిరుగుచు నుండిపోయినది. అది సుఖముగ ప్రసవింపఁగనే నాకు ఆ ప్రియవార్తను దెలుపుటకు ఎవ్వరినయినను బంపుము.

కాశ్యపుఁడు : అట్లే చేయుదును. దానిని మరువను

శకుంతల : (నడకకుంటువడి) ఎవరు ? నా వస్త్రాంచలమును మాటి మాటికిఁ బట్టి లాగుచున్నారు ? (తిరుగును)

కాశ్యపుఁడు : వత్సా !

14. ఉ॥ పెంచితి దేవి దోసిళుల
వేయుచుఁ జామల నెల్ల వేళ, నీ
వుంచితి వింగుదీ ఫల స
ముత్థిత తైలము దేని మోముపైఁ
బెంచిన ప్రేమ దర్భములు
పెట్టిన పుండును మాన్ప, దేని భా
వించితి పుత్త్రిగా, మృగము
పీడదు విన్నది చూడు మిచ్చటన్.

శకుంతల : వత్స ! సహవాసమును విడిచిపోవు నన్ను ఏల యనుసరింతువు? పుట్టఁగానే తల్లిచే విడువఁబడిన నిన్ను నేను బెంచితిని. నాచేఁ గూడ విడువఁబడిన నిన్ను ఇంక తండ్రియే పెంచును. ఇప్పుడు మరలిపొమ్ము. (ఏడ్చుచు నడచును)

కాశ్యపుఁడు : కన్ను తెప్పలఁ గప్పుచుఁ గారుచున్న
15. గీ. బాష్పమును వీడి చూడుము పథము నిపుడు
తడఁబడుచుఁ బాదముల్పడు ధరణియందు
నెత్తుపల్లంబుల గ్రోవ యెఱుకపడమి.

శార్ఙ్గరవుఁడు : భగవానుఁడా ! ఉదకపర్యంతమే స్నిగ్ధజనము అనుసరింపఁదగిన దని వినఁబడుచున్నది. ఇదియే సరస్తీరము. మా కాదేశము నొసంగి తమరిచ్చటనుండి మరలుట మంచిది.

కాశ్యపుఁడు : అట్లయినచో నీ పాలచెట్టుకడ నాగుదము.
(అందఱు నచ్చటి కేగుదురు)

కాశ్యపుఁడు : (తనలో) పూజ్యుఁడగు దుష్యంతునకు మనము ఎట్టిసందేశమును బంపిన యుక్తముగ నుండునో ? (ఆలోచించుచుండును)

శకుంతల : (జనాంతికముగ) సఖీ ! చూడుము. ఆ దక్షిణపు దిక్కున తామ రాకులలోఁ గప్పఁబడియున్న తన సహచరుని గాంచలేక యా చక్ర వాకాంగన దుఃఖించుచు నెట్లరచుచున్నదో ! నేను మిక్కిలి దుష్కరము నాచరించితిగదా !

అనసూయ : అట్లాలోచించుకొనకుము.

16 గీ॥ సహచరుఁడు దూరమైన నీ చక్రవాకి
గడపె నెట్టులో దుఃఖ దీర్ఘతర రాత్రి
నాశయుండిన బంధమైయదియ యోర్చు
నురుతరంబగు నార్తి వియోగమందు

కాశ్యపుఁడు : శార్ఙ్గరవా ! శకుంతలనుగూర్చి యా రాజుతో నామాటగ నిట్లు చెప్పుము.

శార్ఙ్గరవుఁడు : పూజ్యులాదేశింతురుగాక
కాశ్యపుఁడు :

17 చం॥ తలఁచి తపోధనంబుగల
ధార్మికులంచెద లెస్సమమ్మునా
కులము మహత్త్వమున్దెలిసి,
కోరక బంధులఁగూర్మి నీమెపైఁ

గలవలపెంచి, యీమెఁగను
కాంతలయంద సమానవృత్తివై
గలుఁగును భాగ్యమెట్లొయటు
గర్హ్యముగోరుట బంధుజాతికిన్.

శార్ఙ్గరవుఁడు ; సందేమును గ్రహించితిమి.

కాశ్యపుఁడు ; వత్సా ! నీకిప్పుడు కొంత చెప్పవలసియున్నది. చూడుము. మేము వనౌకసులమయ్యును లోకజ్ఞులమే సుమా !

శార్ఙ్గరవుఁడు ! ధీమంతుల కందని విషయము లేమియుండును ?

కాశ్యపుఁడు : నీ విచ్చటినుండి పతి గృహంబున కేగి –

18. చం. గురువులఁ గొల్వు మెల్లప్పుడు
కూరిమిఁజూపు సపత్నులందునే
దురుసుతనంబుఁ జూపకుము
దుండగుఁడై పతి నిందవేసినన్
పరిజనులందు దక్షిణవు
భాగ్యము అందవలేపహీనవై
పరగుము చేరుఁగాంతయిటు
భర్తను, వామకులాధియౌ సుమా !

గౌతమి యేమనునో ?

గౌతమి ; వధూజనమునకు ఈయఁదగిన యుపదేశమింతియే. వత్సా ! దాని నంతను గుర్తుంచుకొనుము.

కాశ్యపుఁడు ; వత్సా ! నన్నును సఖులను ఆలింగనము గావించుకొనుము.

శకుంతల ; తండ్రీ ! ప్రియంవదాది సఖు లిచ్చటినుండియే మరలెదరా ?

కాశ్యపుఁడు ; వత్సా ! వారుకూడ నెవ్వరికైన నీయదగినవారేకదా ! వీరచ్చటకు వచ్చుట తగదు. గౌతమి నీతో వచ్చును.

శకుంతల : (తండ్రిని కౌగలించుకొని) మలయ తటమును విడిచిన చందన లతవలె మీ సమీపమును వీడి మఱియొక దేశమున ఎట్లు జీవితము ధరింపగలను తండ్రీ !

కాశ్యపుఁడు : వత్సా ! ఏల యట్లు భయపడెదవు ?

19. చం. కులమునఁ బేరుగన్న పతి
కూరిమి నుత్తమ కాంతవై సతీ
కులమున, నిత్యమాపతికిఁ
గూర్పఁగ నిష్టములైన భోగముల్
కలవర మందుచున్, సుతుని,
గాంచి పవిత్రునిఁ బ్రాచి యర్కునిన్
బిలె నచిరంబు, మద్విరహ
బాధ నొకింత గణింప వమ్మరో !

(శకుంతల తండ్రిపాదములపైఁ బడును)

కాశ్యపుడు ; నీవు తలంచినదంతయు నెరవేరుగాక.

శకుంతల : ( సఖులనుజేరి ) సఖులారా ! మీరిరువును నన్ను ఒకేసారి యాలింగనము గావింపుఁడు

ఉభయులు : (అట్లుచేసి) ఒకవేళ ఆ రాజర్షి నిన్నుగుర్తింపలేనిచో అప్పుడు వానికి స్వనామధేయాంకితమగు నీ యుంగరమును జూపుము.

శకుంతల ; సఖులారా ! మీ యనుమానమువలన నాకు భయముకలుగుచున్నది

సఖులు : భయపడకుము అతిస్నేహము పాపమును శంకించును

శార్ఙ్గరవుఁడు : జాముప్రొద్దెకినది. అమ్మా ! త్వరపడుము

శకుంతల : (ఆశ్రమమునకు అభిముఖముగ తిరిగి) తండ్రీ ! మరల ఎప్పుడీ తపోవనమును జూతునో ?

కాశ్యపుఁడు : వినుము.

20. శా॥ పారావార చతుష్టయావృత మహీ
భామా సపత్నీత్వ మీ
పారన్దాల్చి సుపుత్త్రుని సప్రతిరథున్
భవ్యాత్మ వే పొంది యా

భారంబంతయు వానికిచ్చి పతి సం
భావ్యాత్మవై భర్తతో
నీ రమ్యాశ్రభూమమిఁ జేరెదవు పు
త్రీ! సుప్రసన్నాత్మవై.

గౌతమి : అమ్మా! ప్రయాణ సమయ మతిక్రమించుచున్నది తండ్రిని బంపించుము. కాదు, ఈమె యిట్లే మాటిమాటికిని ఏదో యడుగుచునే యుండును. నీవే వెడలుము.

కాశ్యపుడు : వత్సా! నా తపోకనుష్ఠానము ఆగిపోవుచున్నది.

శకుంతల : (మరల తండ్రిని కట్టి కౌగలించుకొని) అసలే తపశ్చర్యచేఁ గృశించిన తండ్రి శరీరము నా వియోగదుఃఖమున మరల మిక్కిలి యుత్కంఠిత మగునేమో ?

కాశ్యపుఁడు : (నిట్టూర్చి)

21. కం. ఉటజద్వారంబున నొ
క్కట మును నీవిడిన బలినిఁ గాంచుచు మదిలో
నెటు లూరడిల్లి యుండుదు
కుటిలాలక ! చెపుమ ? శాంతిఁగొన నెట్లౌనో ?

(శకుంతలయు అనుయాయులును వెళ్లుదురు)

సఖులు : (శకుంతలను జూచుచు) అయ్యో ! అయ్యో ! మా ప్రియసఖి శకుంతల యడవిలో నంతర్హితమయినదే !

కాశ్యపుఁడు : (నిట్టూర్చి) అనసూయా ! వెళ్ళిపోయినది మీ సహచారిణి శోకము ఆపుకొని నా వెనువెంట రండు.

ఇరువురు : తండ్రీ ! శకుంతల లేకుండుటచే తపోవనమంతయు శూన్యమయినట్లు గోచరించుచున్నది. దానిని ఎట్లు ప్రవేశింపఁగలము ?

కాశ్యపుఁడు : స్నేహధర్మ మట్లనిపించును. (ఆలోచించుకొనుచు నడచి) అమ్మయ్యా। శకుంతలను పతి కప్పగించిన నాకు ఇప్పటికి స్వస్థత లభించినది.

22. చం. అరయఁగఁ గన్యయన్నన మ
దన్యులదే మఱి దాని నిప్పుడే
మరక పరిగ్రహీత కిడ
మన్మతి నిర్మలమై ప్రశాంతమై
కరము తలిర్చె న్యాసమును
గాచుచు నింట యథాతథంబునా
పరధనమున్ గ్రహీతకు న
పారముదంబున నిచ్చు చాడ్పునన్.

(అందఱును బోవుదురు)

—

# పంచమాంకము

(ఆసనమందుండి రాజును విదూషకుఁడును ప్రవేశింతురు)

**విదూషకుడు :** (వినుట నభినయించి) ఓయీ ! మిత్రమా ! సంగీతశాలాభ్యంతరమువైపు సావధానుఁడవై దృష్టినుంచుము. అవ్యక్తమధురముగ శుద్ధగీతిలో స్వరయోగము వినఁబడుచున్నది. పూజ్యురాలయిన హంసపదిక వర్ణపరిచయముఁ గావించుచున్నదని యనుకొందును

**రాజు :** నీవు ఊరకుండుము. నేను వినియెదను.

(ఆకాశమున గానము చేయబడును.)

1. కం॥ అతినవమధులోలుపుఁడవు
మితిమీరఁగఁ గ్రోలి చూత మృదు మంజరి ని
ర్వృతినిఁ గనికమల వసతిన్
మతి నేమిరియుంటి వెటుల మధుపా ! దావిన్.

**రాజు :** ఆహా ! గీతి రాగముచే నుప్పొంగియున్నది.

**విదూషకుఁడు :** ఆ గీతిక యందున్న యర్థము అవగతమయినదా !

**రాజు :** (నవ్వి) ఆమెతో నేను ఒక్కమారు పరిచయము చేసితిని. అందుచే ఆమె వసుమతీదేవిని నిమిత్తముగ చేసికొని నన్నాక్షేపించుచున్నది. మిత్రమా ! మాధవ్య ! చక్కగా నిందించితివని నా మాటగా హంసపదికతో చెప్పుము.

**విదూషకుఁడు :** అట్లేచేయుదును (లేచి) ఓ మిత్రుడా ! అప్సరోగృహీతుఁడైన సన్యాసికివలె, ఆమెచే పరకీయహస్తముల గృహీతకేశ పాశుఁడనగు నాకు మోక్షము మఱి యుండదు.

**రాజు :** నాగరికవృత్తితోఁ దెల్పుము - వెళ్ళుము.

**విదూషకుఁడు :** ఏమి దారి ? (వెడలును)

**రాజు :** (తనలో) ఇట్టి యర్థముగల గీతమును వినుటతోడనే యిష్టజన వియోగము లేకున్నను బలాత్కారముగ ఉత్కంఠితుఁడనగు చుంటి నేల ? లేదా,

2. చం॥ సుమధుర శబ్దముల్వినిన
సుందరవస్తు ఛయంబుఁ జూచినన్
విమల సుఖంబు లన్గొనిన
విజ్ఞులు గూడ సముత్సుకాత్ములై
యమరుదు రేలయన్న హృద
యాంతరమందున సుస్థిరంబులౌ
తమ తమ పూర్వజన్మ కృత
ధర్మములన్ స్మరియింత్ర బుద్ధులై.

(విచారముతో నుండును)

(కంచుకి ప్రవేశించి)

కంచుకి : (నిట్టూర్పు పుచ్చి) ఆహా ! ఎట్టి యవస్థకు లోనైతిని ?

3. మ. ఇది యాచారమటంచు రాజగృహమం
దే వేత్ర దండంబు నా
పద లేకున్న ధరించియుంటి సత మి
ట్ఫంగిన్ వధా నంబుతో
నది యిన్నాళ్ళకుఁ దొట్రిలంజనెడు నా
హస్తాగ్ర మందుండి యీ
ముదివేళన్ గతియయ్యె నాకహహ ! స
మ్మోదాత్మ కాధారమై.

అయ్యో ! ప్రభువులకు ధర్మకార్యములు అనుల్లంఘ నీయములు గదా ! అయినను, ఇప్పుడే ధర్మాసనమును విడిచి లేచిన ప్రభువునకుఁ గణ్వశిష్యాగమనమును దెలిపి మరల ఆసనముపై నుండునట్లు ఎట్లుచేయగలను ? నేనేమి చేయదును, లోకతంత్రాధికారము విశ్రాంతి విహీనమైనది గదా ! ఏమన –

4. గీ. రథమునకుఁ బూన్చు నొకమారె రవియు హరుల
రేయుపవ లొక్క రీతిగ గాలివీచు

తలను ధరియించు శేషుఁడు ధరణి సతము
షష్ఠ భాగంబుఁ గొనురాజు చరిత మిట్లె.

నా నియోగమును నే నాచరింతును. (వెడలి-చూచి)
వీరే ప్రభువులు.

5. గీ॥ మనిచి జనులను బిడ్డల మనుచరీతి
విజనమున శాంతుఁడై యుండె విభుఁడు యూధ
ములను త్రిప్పుచు మధ్యాహ్నమున గజేంద్రుఁ
డడవిలో శీతలస్థాన మందునట్లు

(సమీపించి) ప్రభువులకు జయముగలుగుగాక ! హిమవత్పర్వత ప్రాంత నివాసులయిన తాపసులు కౌశ్యపముని సందేశమును గైకొని స్త్రీలను దోడ్కొని వచ్చియున్నవారు. తరువాత తమ చిత్తము.

రాజు : (ఆదరముతో) కౌశ్యప సందేశమునుగొని వచ్చినారా !

కంచుకి : చిత్తము.

రాజు : నేను జెప్పితినని ఉపాధ్యాయ సోమరాతునితోఁ జెప్పుము. ఈ యాశ్రమవాసులను యథావిధి అర్చించి స్వయముగా తోడ్కొని రమ్మని నేను గూడ మునులను దర్శించుటకు అనువగు చోట నుండి వారిని నిరీక్షించుచుందును.

కంచుకి : అట్లే చేయుదును. (వెడలును)

రాజు : (లేచి) ఓయీ ! ఎవరక్కడ ?

ప్రతీహారి : (ప్రవేశించి) ప్రభువులాజ్ఞాపింతురుగాక

రాజు : వేత్రవతి ! అగ్నిహోత్రశాలకు మార్గమును చూపుము.

ప్రతీహారి : ఇటు దయచేయుఁడు. (వెళ్ళును)

రాజు : ( అధికారమునందలి దుఃఖము నూహించుకొని ) సర్వులును స్వప్రార్థితములగు అర్థములను పొంది సుఖముగా నుందురు. కాని రాజులు మాత్రము చరితార్థులయ్యును దుఃఖితులే కదా !

6. చం॥ సుమహితుఁ డీతఁడే ప్రభువు
సుమ్మను మాటకుఁగల్గు సంతసం
బమరిన రాజ్యపాలన ప్ర
యాసముఁగూర్చు మనఃప్రవృత్తికిన్
దమకరమందు ఛత్రమును
దాల్చినవారికిఁబోలె రాజ్య మీ
శ్రమ మధికంబుగా నుడుపఁ
జాలదు నీదు శ్రమంబుఁ బెద్దగా.

( నేపథ్యమున )

వైతాళికులు : ప్రభువులు వర్ధిల్లుదురుగాక.

ప్రథముఁడు :

7. చం. స్వసుఖములందుఁగోరికలఁ
జాలత్యజించి పరార్థ మీవు మా
నసమున ఖేదమందితి వ
నారత మిట్టిద నీదు వృత్తియీ
వసుధ మహీరుహంబు నొక
వంక శిరంబునఁదీవ్రతాపమున్
బసచెరఁదాల్చి నీడలను
బాపదె తాపము నాశ్రితాళికిన్.

ద్వితీయుఁడు :

8 ఉ॥ దండవిధాన పద్ధతిని
దాల్చి విరుద్ధముగాఁజరించు పా
షండుల శిక్షసేయుదువు
సంశమనంబొనరింతు వైర మీ
వండగ నుండు రక్షణ క
నల్పముగా సిరియున్న బంధువుల్
మెండుగ నుండు రీవె నిజ
మిత్రుఁడవౌదువు వారికెప్పుడున్

రాజు : పరిక్లిష్ట మానసులమగు మేము శోకోన్ముక్తుల మైతిమి. (నడచును)

ప్రతీహారి : ఇదియే యగ్నిశాలాళిందము. అభినవసమ్మార్జనమున శోభాయమానమై సన్నిహితహోమ ధేనువై యలరారుచున్నది.

రాజు : (అధిష్టించి) (పరిజనుని భుజమునానుకొని నిలిచి) వేత్రవతి! భగవానుఁడగు ఆకాశ్యపుఁడు నాకడకు మునులను ఎందులకు పంపియుండెనో?

9 చం తపమున కంతరాయములు
తాపసవర్యుల కేడ కల్గెనో?
చపలత నాశ్రమస్థ మృగ
జాతికి నెవ్వరు కీడొనర్చిరో ।
యపగతమయ్యెనో ప్రసవ
మాశ్రమ వృక్షములందుఁ గూడ నా
యపచరితంబునన్ మన మ
దయ్యెను విహ్వల మప్రతర్క్యమై

ప్రతిహారి : మీ సుచరితమున కాసందించి మిమ్ములను అభినందించుటకే మునులు వచ్చియుందురని నేను ఊహించుచున్నాను.
(గౌతమీ శకుంతల లను ముందుగా నుంచుకొని తాపసులు వత్తురు వారికంటె ముందుగనే పురోహిత కంచుకులుకూడ నుందురు.)

కంచుకి : పూజ్యులు ఇటువైపు దయచేయుఁడు.

శార్ఙ్గరవుఁడు : శారద్వత !

10. ఉ॥ ఈతఁడు ధర్మమార్గముల
నేమరఁడు, త్తమభాగ్యశాలి, యీ
భూతలనాధు పాలనను
పోవఁడు నీచుఁడుగూడ దుష్టమౌ
రీతిని నాల్గువర్ణముల,

తేమిసతంబిట నాకు సంగ మేఁ
జూతు జనాభిపూర్ణమగు
చోటనలావృతమందిరంబునాన్.

శారద్వతుఁడు : తగియేయున్నది. పురములోఁ బ్రవేశించి నంతమాత్రమున నీవిట్లు యితివి , నేను గూడ.

11. గీ॥ స్నాతుఁడ భ్యక్తు, బద్ధుని స్వైరగతియు,
నళుచి నాళుచి, నిద్రితు నా ప్రబుద్ధుఁ,
డెట్లు గనుచుందు రీభువి నేవగించి,
విషయసక్తులఁ గనుచుంటి వీరి నట్లు

శకుంతల : (దుర్నిమిత్తమును గాంచి) అమ్మో ! నా కుడికన్నెందులకో యదురుచున్నది,

గౌతమి : అమంగళము ప్రతిహతమగుగాక. నీ భర్తృకులదేవతలు నీకు శుభముల నొసంగుదురుగాక. (నడచును)

పురోహితుఁడు : (రాజునుచూపి) ఓ తాపసులారా ! వర్ణాశ్రమ సంరక్షకుఁడగు పూజ్య దుష్యంతుఁడు మున్ముందే ఆసనమును విడిచి మీ రాకకు ఎదురుచూచు చున్నాఁడు. వానిని చూడుఁడు.

శార్ఙ్గరవుఁడు : ఓయీ ! మహాబ్రాహ్మణ ! ఇది మిక్కిలి యభినందింపఁదగినదే. కాని, యింతకు మేము ఇట్టి విషయమున మధ్యస్థులము సుమా!

12. గీ పండ్ల కలిమిని వృక్షముల్ వంగుచుండు
నీరునిండఁగ మబ్బులు నేల కొరుగు
సజ్జనులు వినతులుగారె సంపదబ్బ
పరహితముఁగోరువారి స్వభావ మిద్ది.

ప్రతీహారి : ప్రభూ ! మునులు ప్రసన్నముఖరాగులై పొడఁగట్టుచున్నారు. కావున వారు విస్రబ్ధ కార్యులై యుందురని యనుకొందును.

రాజు : (శకుంతలను జూచి) ఎవరీ పూజ్యురాలు?

12. గీ. పండ్ల కలిమిని, వృక్షముల్ వంగుచుండు
నీరు నిండఁగ మబ్బులు నేలకొరుగు
సజ్జనులు వినతులుగారె సంపదబ్బ
పరహితముఁ గోరువారి స్వభావ మిద్ది.

ప్రతీహారి : ప్రభూ ! మునులు ప్రసన్నముఖరాగులై పొడఁగట్టుచున్నారు. కావున వారు విస్రబ్ధకారులై యుందురని యనుకొందును.

రాజు : (శకుంతలను జూచి) ఎవరీ పూజ్యురాలు ?

13. గీ. కప్పి యవకుంఠనమ్మునఁ గాయమంతఁ
బరగ నాతి విస్పష్ట లావణ్య గరిమఁ
దాపసుల మధ్యనున్నదీ తన్వి యెవరు ?
జీర్ణ పత్రాంతరంబునఁ జివురువోలె.

ప్రతీహారి : ప్రభూ ! నా యాలోచన ఆశ్చర్య పరిపూర్ణమగుచున్నది. ఈమె యాకృతి యెంత దర్శనీయ మగుచున్నదో కదా !

రాజు ; కావచ్చు, కాని. పరకళత్రము వర్ణింపరానిది. సుమా !

శకుంతల ; (గుండెలపై చేయివైచుకొని) హృదయమా ! ఏల యట్లు వణకెదవు ? ఆర్యపుత్రుని యభిప్రాయము నెఱుంగక, ధైర్యముతో నుండుము.

పురోహితుడు : (ముందుగా వెళ్ళి) దేవ ! ఈ మునులను యథార్థముగఁ బూజించితిని. వీరి యుపాధ్యాయుల సందేశమొకటి యున్నదట ! దానిని తమరు వినవలసి యున్నది.

రాజు : సిద్ధముగా నున్నాఁడను.

ఋషులు ; (చేతులనెత్తి) రాజా ! విజయవంతుఁడవగుము.

రాజు : అందఱికిని నా నమస్కారము.

ఋషులు : నీకు మంగళములు గలుగుగాక. ఇష్టార్థసిద్ధియగుగాక.

రాజు : మీ తపస్సులు నిర్విఘ్నముగ నెరవేరుచున్నవా ?

ఋషులు : కలుగునా విఘ్నమిల ధర్మకార్యములకు

14. గీ॥ నీవు సజ్జనులన్ ధరఁ బ్రోవుచుండ
అంధతమ సమ్ము నిలుచునే యర్కుఁడుదయ
మంది ఘర్మాంశువులఁ గాంతిఁ జిందుచుండ.

రాజు ; నేఁటికి నా రాజ శబ్ద మన్వర్థమైనది. లోకానుగ్రహము కొఱకు పూజ్యులగు ఆ కాశ్యపులు కుశలముతో నున్నారా ?

శార్ఙ్గరవుఁడు : సిద్ధిమంతులకుఁ గుశలము స్వాధీనమేగదా ! అతఁడ నామయ ప్రశ్న పూర్వకముగ నిట్లు చెప్పుమనెను.

రాజు ; వారు ఏమని యాజ్ఞాపించినారో ?

శార్ఙ్గరవుఁడు ; పరస్పరము సంకేతమును నిర్ణయించుకొని నీవు నాకూతుని వివాహమాడితివి. నేను దానిని ఆనందముగ నంగీకరించితివి. ఏమన

15. గీ॥ పూజ్యులందునఁ బూజ్యతముండవీవు
రూపుఁ గైకొన్న సత్క్రియ యీ శకుంతి
తుల్యగుణులగు మిము దంపతులనుజేసి
పాపికొనె నిందనెటులొ ప్రజాపతియును.

కావున, ఆపన్న సత్వయగు నీమెను నీ సహధర్మాచరణమునకు అనుగ్రహింపుము అని.

గౌతమి : ఆర్య ! నేనొక్క మాటఁజెప్పఁదలంచితివి, నేను చెప్పనవసరము లేదు. ఏమనిన —

16. గీ॥ గురువుల యపేక్షయి సుమంత గొనవునీవు
బంధుజనముల నడుగదు శకుంతి యీమె
యెవ్వరికి వారలొక్కరై యివ్విధమునఁ
జేయుపనిలోన నెవరికిఁ జెప్పుదాన.

శకుంతల : (తనలో) ఆర్యపుత్త్రుఁడేమనునో ?

రాజు : ఏమి యీ యుపన్యాసము ?

శార్ఙ్గరవుఁడు : ఏమిటి ? ఏమి యీ యుపన్యాస మనియా ? మీరేకదా నిత్యము లోకతంత్రమున నిష్ణాతులు.

17. చం. పితృగృహమందె నిత్యమును
ప్రీతి వసించిన కాంతఁగాంచి యా
సతి పతి యుక్తయయ్యు సతి
సాధ్వియునైన జనుల్ తలంత్రు వే
ఱ్వితమునఁగాన నాప్రమద
ప్రేయసియైనను గాకపోయినన్
బతి గృహమందు నుండుటనె
బంధులు గోరుదురెల్ల వేళలన్.

రాజు : ఈ పూజ్యురాలిని నేనింతకుఁ బూర్వము వివాహ మాడితినా ?

శకుంతల : (దుఃఖముతో - తనలో) హృదయమా ! నీ కంప మిప్పుడు తగి యున్నది.

శార్ఙ్గరవుఁడు : కల్గెనా ద్వేష మీ కృత కార్యమందు ?

18. గీ. ధర్మమందున విముఖతా ? తపసులంద
వజ్ఞయా ? - - -

రాజు : ఏమి యీ యసత్కల్పనా ప్రశ్నము ?

శార్ఙ్గరవుఁడు : .... .... .... యిట్టి వికృతులైశ్వర్య మత్తులందుఁ దఱచుగఁ జనియించునవని నిజము.

రాజు : ఎక్కువగ నధిక్షేపింపఁబడితిని.

గౌతమి : వత్సా ! శకుంతలా ! ఒక్క క్షణము సిగ్గుపడకుము. నీ యవ కుంఠనమును దొలగించెదను. అప్పుడు పతి నిన్ను గుర్తించును, (అట్లు చేయును)

రాజు : (శకుంతలను జూచి తనలో)

19. చ. కడు మధురంబు, సన్నిధిని
గన్పడుచున్నదనూన కాంతి, నీ
పడుచి,టువంటి రూపమున,
భార్యయొ కాదొ యెఱుంగవేమి నీ
పరఁతి గ్రహింపఁజాల, మఱి
పాయఁగనోపను, మంచు బిందువే
ర్పడఁగని లోనఁగుందముఁ బ్రి
భాతమునన్ భ్రమరంబు చాడ్పునన్.

(ఆలోచించుచుండును.)

పరిజనము : (రహస్యముగ) ఆహా ! మన ప్రభువు ధర్మాపేక్ష యెంతగొప్పది ! ఇట్టిసుఖోపన తమగు రూపమునుజూచి యెవ్వఁ డాలోచించును !

శార్ఙ్గరవుఁడు : ఏమి ? మౌనమును వహించితివి ?

రాజు : ఓయీ ! తపోధనా ! ఎంత యాలోచించినను ఈమెను పరిగ్రహించినట్లు కావరాదు. గర్భిణియగు నీమెను నా భార్యయని యెట్లు పరిగ్రహింతును.

శకుంతల : (దుఃఖముతో - తనలో) వివాహమే సంశయాస్పదమా ! ఇఁక మిగిలిన ఆశ యెక్కడిది ?

శార్ఙ్గరవుఁడు : వలదు.

20. ఉ. విన్నవనేల ! కన్యకమ
నెమ్మి గ్రహించి పరిత్యజించు నిన్
మన్నన జేయునట్టి ముని
మాన్యునిఁ గణ్వుని నరఁ గావలెన్
పన్నగ విల్లు సొచ్చి తన
సంపద దోచినవానిఁ గాంచి తా
మిన్నక పాత్రుఁడంచు నెల
మిన్నవ మిచ్చిన యట్లు చేయుటన్

శారద్వతుడు : శార్ఙ్గరవా ! నీవాగు మిప్పుడు. శకుంతలా ! మేము చెప్పవలసినది చెప్పితిమి. ఆ పూజ్యుఁడిట్లను చున్నాఁడు. నమ్మఁదగిన సమాధానమాతనికిమ్ము.

శకుంతల : (తనలో) అంతటి యనురాగమంతయు నీ తీరుగా మారిన ఇఁక విజ్ఞాపన చేయుట యెందులకు ? ఇప్పుడు నాగురించి నేను దుఃఖింపవలసినదే. (ప్రకాశముగ) ఆర్యపుత్రా ! (సగములో నాపి) పెండ్లియే యనుమానగ్రస్తమై యుండ నిట్టి యాచార మనర్హము. పౌరవ ! నీకిది తగదు. ఆశ్రమములో నొకప్పుడు నీ మాటను నమ్మి మనసిచ్చిన నన్ను వంచించి, యిప్పుడిట్టి మాటలతో తిరస్కరించుట భావ్యముగాదు.

రాజు : (చెవులు మూసుకొని) పాపము శమించుగాక, పాపము శమించు గాక.

21\. గీ॥ కులము నూహింతె నీవు నావిలముఁజేయఁ,
బతితుఁ గావింతె నన్ను నీ పలుకుతోడఁ,
బుణ్యజలమును దత్తటీ భూరుహమును
జెఱచు కూలంకషంబగు సింధువవలె.

శకుంతల : పోనిమ్ము. నిజముగఁ బరకాంతా పరిగ్రహణ భీరువవై యిట్లు పలికి యుందువు. అభిజ్ఞానము నొసంగి నీ సందియము నివారింతును.

రాజు : మిక్కిలి చక్కనిదా పద్ధతి.

శకుంతల : (వేలునుచూచుకొని) అయ్యో ! అయ్యో ! నా వ్రేలికుంగరము లేదే ? (విచారముతో గౌతమి వైపుచూచుచుండును)

గౌతమి : శక్రావతారాంతరమున శచీ తీర్థమును నమస్కరించు సమయమున నీ వ్రేలినుండి యా యుంగరము తప్పక జారియుండును.

రాజు : (నవ్వుచు) స్త్రీసంఘ మప్పటికప్పుడేదో యొకటి కల్పించు ననుటకు నిదర్శన మిదియే.

శకుంతల : ఈ విషయమున దైవము తన ప్రభుత్వమును జూపినది. మఱి యొక యభిజ్ఞానము నొసంగెదను.

**రాజు :** వినెదము.

**శకుంతల :** **ఒక** దినమున నీవు నవమాలికా మంటపమందు తామరాకు దొప్పలో నీరు పట్టుకొనియుంటివి.

**రాజు :** వినుచున్నారము.

**శకుంతల :** అచ్చటికి వెంటనే నా పెంపుడుకొడుకు దీర్ఘాపాంగమను లేడిపిల్ల రాగా కనికరముతో నీవు దానికి ముందుగా నీరిడితివి. నీ పరిచయము దానికి లేకుండుటంజేసి యది నీ కడకు రాలేదు. పిమ్మట నే నా పాత్రను అందుకొనగానే యది త్రాగనారంభించెను. అప్పుడు నీవు నవ్వుచు నీ విధముగ హాస్యమాడితివి. "ప్రతి వాఁడును తనవారినే నమ్మను. మీరిరువురును ఆటవికులేకదా" **అని.**

**రాజు :** ఆత్మకార్యసాధికలగు కాంతలు, ఇట్టి వాఙ్మాధుర్యముచే విషయాసక్తులను ఆకర్షించుచుందురు, గదా !

**గౌతమి :** మహాభాగ ! అట్లాలోచింపకుము, తపోవనమునఁ బెఱిగినవారు ఇట్టి మోసముల నెరుంగరు.

**రాజు :** ఓసి ! వృద్ధతాపసి !

22\. చం॥ కనఁబడు చాల నేర్పుఖగ
కాంతలకున్ తగు శిక్షలేక పో
యినను, మనుష్యజాతి గుఱి
యించి వచింపఁగనేల, గుట్టుగాఁ
దనఁదగు నండమున్గొని, ని
దానముగా నిడి కాకిగూటిలోఁ
బెనుచుట లేదె, కోయిల, య
పేక్షను రెక్కలు వచ్చునంతకున్

**శకుంతల :** (కోపముతో) నిన్నునుకొనినట్లే యందరి ననుకొనుచుంటివి. నీవు ధర్మకంచుక ప్రచ్ఛన్నుఁడవు, తృణచ్ఛన్నకూపమవు. నిన్నే జనుఁడనుసరించును ?

రాజు : (తనలో) నాకు సందేహమును గల్గించుచు ఈమె కోపము నిజమైనదివలె కన్పడుచున్నదే ! ఏమన - ఈమెచే,

23. చం॥ మరపున దారుణంబయిన
మానసముంగొని, తద్రహస్యమౌ
చరితము నిచ్చగింపక వి
చారము నొందిన నన్నుఁజూచి, యీ
గళిత కషాయితాక్షియయి
కాముని చాపము రెండు ముక్కలై
విరిచినయట్లు కోపమునఁ
బెట్టెను వంకరగా బొమల్వడిన్.

(ప్రకాశముగ) భద్రా ! దుష్యంతుని చరిత్రము సర్వలోకప్రసిద్ధము. ఇట్టి దెచ్చటను గానరాదు.

శకుంతల : ఇప్పుడు నేను పూర్తిగ స్వేచ్ఛాసంచారిణిగ గావింపఁబడితిని. హృదయమున విషము, ముఖమున తేనెయుఁగల యీతనిని నమ్మి వీని చేతిలోఁబడితిని.

(వస్త్రాంచలముతో ముఖమును కప్పుకొని యేడ్చుచుండును)

శార్ఙ్గరవుఁడు : తాను గావించుకొనిన చాపలమే యడ్డులేక తన్నుఁగాల్చి వేయుచుండును.

24 గీ. ఆచరింపగవలయు రహస్యకృత్య
మన్నిభంగుల నిర్ణయమరసి యెపుడు,
మనసు తెలియని మనజుల మదిని నమ్మి
చేయు సౌహృద మీరీతి చెడును తుదకు.

రాజు : మీ కాంతయందలి నమ్మికచే మమ్మిట్లు కఠినముగ నాక్షేపించుట మీకుఁదగదు.

శార్ఙ్గరవుఁడు : (అనసూయతో) పూజ్యులగు మీరలు ఈ నీచుని సమాధానమును విందురా?

25. ఉ॥ పుట్టినదాది మోసముల
పోకడెఱుంగనియట్టి వారల
న్నట్టి పదంబులన్ని యిపు
డయ్యెను నీకుఁ బ్రమాణహీనముల్,
గుట్టుగ వంచనన్ బరుల
కొంపలు కూల్చుటె విద్యయంచుఁ జూ
పట్టెడు వారి పల్కులు నృ
పా! హితముల్ ప్రియముల్ యథార్థముల్.

రాజు : ఓయీ! సత్యవాది! మీ మాటనే యంగీకరింతము. ఈమెను మోసగించిన మాకేమి లభించునో యాలోచింపుఁడు.

శార్ఙ్గరవుఁడు : వినిపాతము.

రాజు : పౌరవులు వినిపాతమును గోరరు. అట్టిమాట నమ్మరానిది.

శార్ఙ్గరవుఁడు : ఓరాజా! మాటపై మాటయేల? మాగురువుల ఆజ్ఞను నెరవేర్చితిమి. మేమిఁక నేగెదము.

26 గీ॥ ఈమె నీకాంత నీ కప్పగించి యుంటి.
మిపుడ విడిచెదవో లేక యేలుకొనెదొ,
దారలందునఁ బతి కధికార బలము
సర్వతో ముఖమయి యిల సాగునుగద.

గౌతమీ ! ముందు నడువుము. (బయలుదేరును)

శకుంతల : ఈకితవునిచే నేనిట్లు వంచింపఁబడితిని. మీరుకూడ దుఃఖించు చున్న నన్ను విడిచి చనియెదరా? (వారిననుసరించును)

గౌతమి : (నిలఁబడి) వత్సా! శార్ఙ్గరవా! మిక్కిలి దీనముగ నేడ్చుచు శకుంతల మన వెంటనే వచ్చుచున్నది. పతి తిరస్కరించిన నా కూతురేమి చేయఁగలదు.

శార్ఙ్గరవుఁడు : (కోపముతోమరలి) ఓ పురోభాగిని! ఎందుఁకట్లు స్వాతంత్ర్యము నవలంబించుచుంటివి? (శకుంతల భయముతో వణకును)

శార్ఙ్గరవుఁడు : శకుంతలా!

22. చం॥ క్షితిపతి యెట్లువల్కెనది
చెల్లును, నీ వటువంటి దానవో
పతిత!, పథంబుఁ దప్పిచను
పాతకితోఁ బితకేమిలాభమీ,
పతిళుచి వృత్తివైన యెడ
నాగుము, రాకుము, నిల్వుమిచ్చటన్,
పతి గృహమందె దాసివయి
పాల్పడు, మన్నిటికద్ది యుక్తమౌ

రాజు : ఓయీ! తాపస! ఆ పూజ్యురాలిని ఏల నిందించెదవు?

23. కం॥ విరియించును కలువలెనే
సిరితోడ, రుక్కుండునాకుశే శయములనే,
ధర విజితేంద్రియు లందఱు
పరకాంతశ్లేష విముఖ భావులుగారే.

శార్ఙ్గరవుఁడు : అన్యాసంగమున పూర్వవృత్తము విస్మరించిన పూజ్యుఁడవు.
నీవు అధర్మభీరుడవు ఎట్లగుదువు?

రాజు : ఈ కార్యమున విన్నే గురులాఘవముల నడిగెదము.

24. గీ. ఏను మూఢుఁడనో, లేక, యీమె మిథ్య
నాడు చున్నదొ, యను సందియమునందు,
దార సంత్యాగి నగుదు, లేదా, పరాంగ
నా సమాగమ పాంసులుండను నగుదునొ.

పురోహితుఁడు : (ఆలోచించి) అట్లయినచో నిట్లు చేయుఁడు.

రాజు : మీరు మాకుపదేశించి శాసింపుఁడు.

పురోహితుఁడు . ఈ పూజ్యురాలు ప్రసవించువఱకు నా యింటికడనుండును. ఎందు కనఁగా, నీకు ప్రథమ పుత్రుడు చక్రవర్తి జనించునని సాధు పుంగవు లాదేశించిరి. ఆమునిదౌహిత్రుఁడు ఆ చక్రవర్తి లక్షణము లతో నున్నయెడల గౌరవించి యీామె నంతఃపురమున నుంచు కొనుము. కానిచో నామెను పితృగృహమున కంపుట యెట్లును సిద్ధమే కదా!

రాజు : తమకుఁ దోచినట్లాచరింపుఁడు.

పురోహితుఁడు : అమ్మా! నా వెంట రమ్ము.

శకుంతల : భగవతి! వసుంధరా! నాకొక వివరమును ప్రసాదింపుము (పురోహితునితో మునులతోఁగూడి యేడ్చుచు పోవును. రాజు శాపముచే విస్మృద వృత్తాంతుఁడై యా శకుంతలను గూర్చియే యాలోచించుచుండును. (నేపథ్యమున)

ఆశ్చర్యము - ఆశ్చర్యము.

రాజు ; (విని) ఏమయి యుండును?

పురోహితుఁడు ; (వచ్చి - ఆశ్చర్యముతో) దేవ! అద్భుతము జరిగినది.

రాజు ; ఏమిటది?

పురోహితుఁడు : రాజా! కణ్వ శిష్యులు వెడలఁగనే -

25. మ. తన భాగ్యంబుల నింద చేయుచును నా
తన్వంగి తానేడ్చుచున్,
తన చేతుల్పయికెత్తి దుర్భర దురం
తంబైన దుఃఖంబునన్
జనుచున్నన్గని, తేజమొండు యువతి
స్థానంబు నయ్యప్సరో
జనతీర్థంబున జేర్చె దూరముగా నా
సాధ్విన్ జనుల్చూడఁగన్.

రాజు : ఆ వస్తువును ఇంతకుముందే విడిచితిమి. లేనిపోని యూహలెందు లకు? మీరుపోయి విశ్రమింపుఁడు.

పురోహితుఁడు : (చూచి) విజయమునందుము. (పోవును)

రాజు : వేత్రవతి ! ఈ సన్నివేశముచేఁ బర్యాకులచిత్తుఁడనైతిని. శయన గృహ మార్గమును జూపుము.

ప్రతిహారి : ఇటు దయచేయుఁడు. (రాజు నడచుచుండును.)

రాజు : (తనలో)

26. ఉ॥ పొమ్మని పంపినట్టి ముని
పుత్త్రిఁ గళత్రముగా గ్రహించిన
ట్లెమ్మెయి చూచినన్ స్మరణ
యించుకరాదు, మనంబు మాత్రమా
కొమ్మను బొమ్మనంటినని
క్రుంగుచు, గాంతను బెండ్లియాడినే
నమ్మిక చూపి యుంటినని
నమ్ముచు నున్న దదేమి చిత్రమో ? (వెడలును)

## షష్ఠాంకము

(నాగరిక శ్యాలకుఁడును, పెడచేతులతో బంధింపఁబడియున్న పురుషునితో నిద్దఱు రక్షకభటులును ప్రవేశింతురు)

రక్షకభటుఁడు : ఓరీ కుంభీలకా ! మణిబంధనోత్కీర్ణ రాజనామధేయమగు ఈ యంగుళీయకము నీకు ఎట్లు లభించెనో? చెప్పుము. చెప్పుము.

పురుషుఁడు : (భయపడుచు) పెద్దలు క్షమింపుఁడు. నేనిట్టి పనిని చేయువాఁడను గాను.

ప్రథమ రక్షకభటుఁడు : శ్రోత్రియ బ్రాహ్మణుఁడవని ప్రభువులు నీకు దాన మిచ్చిరా ?

పురుషుఁడు : అయ్యా ! వినుఁడిప్పుడు. నేను శక్రావతార తీర్థమున నివసించు జాలరిని.

ద్వితీయరక్షకభటుఁడు : దొంగకానా ! నీ జాతినడిగితిమా?

శ్యాలకుఁడు : సూచకా ! క్రమముగా వానిని అంతయును చెప్పనిండు. మధ్య మధ్య వాని నడ్డుపెట్టకుఁడు.

ఉభయులు : తమరు సెలవిచ్చినట్లే చేయుదుము.

శ్యాలకుఁడు : చెప్పుము – చెప్పుము.

పురుషుఁడు : నేను, వల – చిక్కము – మున్నగు మత్స్యబంధన సాధనములతో కుటుంబమును పోషించుకొనుచున్నవాఁడను.

శ్యాలకుఁడు : (నవ్వి) చాలపరిశుద్ధమైనది నీ వృత్తి.

పురుషుఁడు : ప్రభువులు వినుఁడు.

1. గీ. నిజకులోచితకర్మంబు నింద్యమైన
విడువఁజనదను శాస్త్రంబు వినుటలేద !
జన్నమందువఁ బశువులఁజంపు కఠిన
హృదయుఁడయ్యునుగాదె శ్రోత్రియుండు మృదువు.

స్యాలకుఁడు : తరువాత - తరువాత

పురుషుఁడు : నేనొకనాఁడు రోహితమత్స్యమును ముక్కముక్కలుగ ఖండించుచుండ దానికడుపులో ఈ రత్నభాసురమైన యంగుళీయకము కంటఁబడినది. దాని నమ్ముటకు నేఁ బ్రయత్నించుచుండ తమరు నన్ను బంధించితిరి. చంపఁదలచినచంపుఁడు. విడువఁదలంచిన విడువుఁడు. ఇదియే ఈ యంగుళీయాగమన మార్గము.

స్యాలకుఁడు : జానుక ! వీఁడు పచ్చివాసన వేయుచు ఘోరాకృతితో నున్నవాఁడు. జాలరి యగుటలో సందియములేదు. ఉంగరము దొరికిన పద్ధతిని గూర్చి కొంత ఆలోచింపవలసియున్నది. కావున రాజగృహము నకే పోవుదము.

ఉభయులు : అట్లే చేయుదము. దొంగకానా ! నడువుము. (అందఱు వెళ్లుదురు)

స్యాలకుఁడు : సూచక ! గోపుర ద్వారముకడ వీనిని జాగ్రత్తతో కనిపెట్టుకొని యుండుడు. ఈ యంగుళీయాగమన పద్ధతిని ప్రభువులకు నివేదించి వారి యాజ్ఞను గ్రహించి వచ్చెదను.

ఉభయులు : ప్రభువుల యనుగ్రహమునకై తమరు వెళ్ళుడు.

(సాల్యకుఁడు వెళ్ళును)

ప్రథముఁడు : జానుక ! సాల్యకుఁడు వెళ్ళి చాలసేపయినదే ?

ద్వితీయుఁడు : ప్రభువులు ! అవసరోపసర్పణీయులుగదా !

ప్రథముఁడు : జానుక ! ఈ వధ్యుని మెడలో పూలదండ కట్టుటకు నా చేతులు తొందరగా కదులుచున్నవి సుమా ! (పురుషుని చూపించును)

పురుషుఁడు : నిష్కారణముగ హత్యగావించుట తమకు ధర్మము కాదు.

ద్వితీయుఁడు : (చూచి) మన ప్రభువు రాజశాసనమును గ్రహించి వీరే యిటు వైపే చూచుచున్నారు, నీవు గ్రద్దలకు బలియగుదువులే.

స్యాలకుఁడు : (ప్రవేశించి) సూచకా ! ఈ జాలరిని విడిచిపెట్టుము. ఈ యంగుళీయకాగమనము సరియయినదే.

ప్రథముఁడు : అట్లే చేయుదును.

ద్వితీయుఁడు : వీఁడు యమలోకమునకేగి మరల వచ్చినాఁడు.

((పురుషుని కట్లు విప్పును)

పురుషుఁడు : (స్యాలకునకు నమస్కరించి) నా బ్రతుకు తమచేతులలో నున్నది.

స్యాలకుఁడు : ప్రభువులు ఆయుంగరమునకు సమానమగు మూల్యమును వీనికి కానుకగా ననుగ్రహించిరి. (వాని కాధనమునిచ్చును.)

పురుషుఁడు : (దండముపెట్టి - అందుకొని) ప్రభువులు అనుగ్రహించినారు.

సూచకుఁడు : ప్రభువులనుగ్రహించి వీనిని శూలము నుండి దింపి నగు వీపుపై నెక్కించినారు.

జానుకుఁడు : స్యాలకా ! ఆయుంగరము ప్రభువులకు ఎంతయో ప్రియమయి నదని ఈ కానుకయే చెప్పుచున్నది.

స్యాలకుఁడు : ఆ యుంగరమందలి యమూల్యములైన రత్నములనుబట్టికాదు. దానిని చూడగనే ప్రభువులకు అభిమతులగు వారెవ్వరో జ్ఞాపకమునకు వచ్చిరి. అంత ప్రకృతిగంభీరుఁడు కూడా ఒక్కక్షణము కంటఁదడి పెట్టికొనినాఁడు.

సూచకుఁడు : తమరు ప్రభువులను సేవించి చాల శ్రమపడినారు.

జానుకుఁడు : ఓయీ ! ఈ చేపలను చంపు వాని కొఱకని చెప్పుము. (ఈర్ష్యగా వానిని జూచును)

పురుషుఁడు : స్వాములారా ! తమరు ఈ ధనములో సగమును తమ సుమనో మూల్యమునకై గైకొనుఁడు.

జానుకుఁడు : అది చాల బాగున్నది.

స్యాలకుఁడు : ధీవర ! నీ విప్పుడు మాకు మిక్కిలి గొప్ప మిత్రుఁడవైతివి. కాదంబరి సాక్షిగా మనము ఈ ప్రథమమైత్రిననుభవింతము. పదము. శౌండికాపణమునకు పోవుదము.

పురుషుఁడు : అట్లే. (అందరును పోవుదురు)

ప్రవేశకము.

(ఆకాశయానమున సానుమతియను అచ్చర ప్రవేశించును)

సానుమతి : సాధుజనస్నానములు ముగియునంతవఱకునుంత పర్యాయనిర్వర్తనీయమగు సప్సరస్తీర్థసాన్నిధ్యమును నెరవేర్చితిని. ఇప్పుడీ రాజర్షి వృత్తాంతమును కనుగొనెదను. మేనకనుబట్టి శకుంతల నాకు కూతురు వంటిది. ఆమె కూతురు నిమిత్తమై నాతోఁ జెప్పినది. (అంతటను బరికించి) ఉత్సవసమయములందుఁగూడ ఎందులకో ఈ రాజకులము ఉత్సవ ప్రయత్నములను మానుకొనినది. దివ్యదృష్టిచే సర్వమును గ్రహించు శక్తి నాకున్నది అయినను నా సఖి యగు మేనకను నే నాదరింపక తప్పదు. కావిమ్మొ తిరస్కరిణీ ప్రతిచ్ఛన్ననై యీ యుద్యాన పాలికల ప్రక్కనే యుండి యంతయును గ్రహింతును. (దిగి యట్లుచేయును)

(అంత చూతాంకురమును జూచుచు చేటి వచ్చును. ఆమె వెనుక మఱియొకతె యుండును.)

ప్రథమ ; పరభృతంబుల కతిహర్ష భాగ్యదంబు
2. గీ॥ మధుర జీవితమా మధుమాసమునకు
భ్రమర పన్న్యాసవిదళన భ్రాజితంబు
చూతు ఋతుమంగళంబిట్లు చూతసుమము.

ద్వితీయ ; సఖి ! పరభృతికా ! ఒంటరిగా ఏదియో ఆలోచించుచుంటివి ?

ప్రథమ ; మధుకరికా ! చూతకళికను జూచి పరభృతిక యున్మత్త యగును గదా !

ద్వితీయ : (ఆనందముతో - వేగముగ వచ్చి) అప్పుడే వసంతమాసము వచ్చినదా?

ప్రథమ ; మధుకరికా; మదవిభ్రమ గీతములకు నీకిదేకదా కాలము?

ద్వితీయ ; సఖీ ! నన్ను పట్టుకొనుము. పాదాగ్రముపై నిలబడి కామదేవార్చనకై చూతాంకురమును గోయుదును.

ప్రథమ : ఆపూజా ఫలములో సగము కూడ నిచ్చెదవా?

ద్వితీయ : (ఆ మాట అనకపోయినను అది జరుగును. మన శరీరములు వేరయినను జీవిత మొక్కటియే కదా ! (సఖి నాధారముగఁగొని ఈ మామిడి మొగ్గనుగోయును) ఓహో ! వికసింపకున్నను ఈ మామిడి మొగ్గ విరువగనే వాసనవేయుచున్నదే ? (దోసిలిపట్టి)

3. గీ॥ కార్ముకముఁ జేతఁ దాల్చిన కామునకును
తప్పకిడుచుంటి నిన్ను చూతాంకురంబ !,
మానవతులగు యువతుల మానముడుపఁ
బరగు పంచాధికంబగు బాణమవయి.

(చూతాంకురమును జిమ్మును)

(తెరను లాగికొని కోపముతో కంచుకి ప్రవేశించు)

కంచుకి : వద్దు - వద్దు - అనాత్మజ్ఞురాల ! ప్రభువులు వసంతోత్సవమును నిషేధింప నీ వేల యీ చూతకలికను గోయుచుంటివి.

ఉభయులు : (భయపడి) ఆర్యా ! అనుగ్రహింపుము. మాకా విషయము తెలియదు.

కంచుకి : వాసంతవృక్షములును, తదాశ్రిత విహంగమములుగూడ ప్రభు శాసనము నంగికరించి పాటించుచుండ మీరు విననే లేదా ! చూడుఁడు.

4. ఉ॥ పుప్పొడి నావకుట్మలము
పూనదు తాఁజిర నిర్గతమ్మునై,
తొప్పటికిన్గురంటక మ
దే ముకుళ స్థితినుండు పీదకే,
విప్పదు గొంతు కోకిలము
వే శిశిరమ్ము గతించినన్, భయం
బొప్పగ నర్ధ కృష్ణ శర
ముంచును దూణమునందె మారుఁడున్.

సానుమతి : ఇందు సందేహములేదు. ఈ రాజర్షి మహాప్రభావసంపన్నుఁడు.

ప్రథమ : మిత్రావసువనురాజశ్యాలుఁడు ప్రభువుల పాదసన్నిధినుండి యిచ్చ టకు మమ్ముఁ బంపించి చాల దినములయినది, ఈ ప్రమదవనము నకుఁ జేయఁదగు నలంకారములను జేయుచుంటిమి. అందుచే నీ వృత్తాంతము మా చెవిని బడలేదు.

కంచుకి : సరే కానిండు. మరలనిట్లు చేయకుఁడు.

ఉభయులు : ఆర్య ! మాకుఁదెలిసికొనవలెనని కోరిక కలుగుచున్నది. మేము వినఁదగినదయినచో, ప్రభువులు ఏకారణమున వసంతోత్సవమును నిషేధించిరో తెలుపుదురా?

సానుమతి : మానవులు ఉత్సవ ప్రియులుగదా ! దీనికేదో ప్రబల కారణముండి యుండును.

కంచుకి : అందరికిని దెలిసిన విషయమిది. మీకెందులకుఁజెప్పగూడదు ? ప్రభువులు శకుంతలను తిరస్కరించిరను వింతను మీరు విన లేదా ?

ఉభయులు : అంగుళీయక దర్శనమువరకు జరిగిన విషయమును రాజస్యాలుని నోటినుండి వింటిమి.

కంచుకి : అట్లయినచో నధికముగాఁజెప్పనక్కరలేదు. ప్రభువులు ఉంగర మును ఎప్పుడు చూచిరో అప్పుడే వారికి, శకుంతలను రహస్య ముగ వివాహమాడినట్లును, అజ్ఞానముచేఁబరిత్యజించినట్లును జ్ఞప్తి కి వచ్చినది. నాఁటినుండి ప్రభువులు పశ్చాత్తాపతప్తులై యున్నారు, ఎట్లన—

5. ఉ॥ అందము సేవగించుఁ, గలి
యందు జనంబులఁ బూర్వరీతి, రే
లందున నిద్రలేక శయ
నాంత వివర్తన లాచరించు, విం
పొందగ మాటలాడు సతు
లొద్దను దక్షిణుఁడౌట, పేర్లలో
నందడబాటు కల్గునెడ
నాన విలక్షత నుందు, ఖిన్నుఁడై.

సోమవతి : ఇది నాకు మిక్కిలి ప్రియము. మిక్కిలి ప్రియము.

కంచుకి అట్టి విమనస్కతచే నుత్సవము ప్రతిషేధింపఁబడినది.

ఉభయులు : బాగున్నది. బాగున్నది.

(నేపథ్యమున)

దయచేయుఁడు – దయచేయుఁడు

కంచుకి : (విని) ఓహో! ప్రభువులిటే వచ్చుచున్నారు. మీ పనిని మీరు చేసికొనుఁడు.

ఉభయులు : అట్లే. (వెడలుదురు)
(పిమ్మటఁ బశ్చాత్తాపమునకుఁ దగినవేషముతో రాజును, విదూషకుడును ప్రతీహారియును ప్రవేశింతురు)

విదూషకుఁడు : ఇటురండు – ఇటురండు.

కంచుకి : (రాజును జూచి) ఆహా! అన్నిదశలయందును రమణీయాకృతులు రమ్యముగనే యుందురుకదా! ఏమన– ఇట్టి విరహవేదనచేఁ బీడితుఁడయ్యుఁ ప్రభువు ప్రియదర్శనుఁడై కనఁబడుచున్నాడు.

6. సీ॥ రాజలాంఛనముల రమ్యమండనములఁ
దాల్చుటకెద సుంతఁ దల్పకుండె,
కాంచన వలయమొక్కటి మాత్రమే తన
వామ ప్రకోష్ఠంబుపై నెసంగె,
వేఁడి నిట్టూర్పులు వెలువడ సతతంబు
నపగతలాగమై యధరమొప్పె,
నిద్రపట్టక యహర్నిశలందుఁ జెడుచింతఁ
గడునుబ్బి నేత్రముల్మిడుకరించె,

గీ॥ నాత్మ తేజోగుణంబున నతను శాణ
గాఢ సంస్కారవశత నుల్లీఢమైన
గొప్పమణివోలె సీతఁడు గ్రుంగి మిగులఁ
గాన రాకుండెఁ గార్శ్యంబుఁగనిన యట్లు

సానుమతి : (రాజును జూచి) తిరస్కారముచే నవమానింపఁబడియు శకుంతల యింకను వీని కొఱకు దుఃఖపీడిత యగుచుండుట యుక్తముగనే యున్నది.

రాజు : (ఆలోచనతో మెల్లగ నడచుచు)

7. గీ॥ ముందుగా నాదు ప్రేయసి ముదముమీర
బోధచేసినఁదా నిద్రవోయె మిగుల
నేఁడు మెలకువనందె నీపాడుమనసు
పొంద ననుశయదుఃఖమీ చందమునను.

సానుమతి : ఆ దీనురాలి భాగధేయము లిట్లున్నవి.

విదూషకుఁడు : (పెదమొగముపెట్టి) ఈతఁడు శకుంతలా వ్యాధిచే మరల నాక్రమింపఁబడినాడు. ఆ వ్యాధిని నివారణచేయుట యెట్లో తెలియకున్నది.

కంచుకి : (వచ్చి) ప్రభువులు జయింతురుగాక ! మహారాజ ! ప్రమదవన ప్రదేశముల నన్నింటిని బరిశీలించితిమి. తమరు స్వేచ్ఛగా వినోద స్థానముల నలంకరింప వచ్చును.

రాజు : వేత్రవతి ! నా మాటగా అమాత్యుడు ఆర్యపిశునునితోఁ జెప్పుము. చాలకాలమునకు నా ప్రియురాలు జ్ఞాపకమువకు వచ్చుటచే మేము ధర్మాసనమును అలంకరింప లేకుంటిమి. పౌర కార్యము లేమి యున్నను మీరు పరిశీలించి పత్రముపై వ్రాసి పంపుడు - అని.

ప్రతీహారి : చిత్తము. (వెడలును)

రాజు : వాతాయన ! నీ పనిని నీవు చూచుకొనుము.

కంచుకి : చిత్తము. (వెడలును)

విదూషకుడు : ఇప్పుడు ఈఁగనుగూడ లేకుండఁ జేసితివి. ఇంక, శిశిరమై తాపవిచ్ఛేదన రమణీయమైన యీ ప్రమదవన ప్రదేశమున సుఖముగ వినోదింపుము,

రాజు : వయస్య ! ఆపద లాపదలందే వచ్చునను మాట నిజము సుమా !

8\. కం	మునికన్యా ప్రణయంబును
మును మరచిన మది, తమో విముక్తంబయ్యెన్,
మనసిజుఁడుగూడ నిపుడేఁ
చమ ధనువున నిశిత చూతశరమున్ గూర్చెన్.

విదూషకుఁడు : ఉండుము. ఇప్పుడీ దండకాష్ఠముతో ఆ మన్మథుని వ్యాధిని నాశనముఁ జేయుదును. (కఱ్ఱనెత్తి చూతాంకురములఁ గొట్టుటకు యత్నించును)

రాజు : (నవ్వుచు) చాలును. బ్రహ్మతేజమునంతను జూపించితివి. మిత్రమా! ఎచ్చటఁ గూర్చొని నా ప్రేయసిని కొంచెముగా ననుసరించు లతలను జూచుచు కూర్చుందెదము?

విదూషకుడు : నీ పార్శ్వవర్తినియు పరిచారికయు నగు చతురికతోఁ జెప్పితివి గదా! మాధవీ లతామండపమందు ఈ సమయమున నుందునని, అచ్చటకు ఆ చిత్రఫలకమున నా చేతులార లిఖించిన శకుంతలా చిత్రమును గొనిరమ్మని.

రాజు : హృదయవినోద స్థానమిటువంటిదే ఆ మార్గమునే చూపుము.

విదూషకుఁడు : ఇటురమ్ము - ఇటురమ్ము. (రాజు వెళ్ళును. సానుమతి యనుసరించును.)

విదూషకుఁడు : మణి శిలాఫలకముతోఁ గూడి యీ మాధవీ లతామండపము అనుభవ యోగ్యమై మనకు స్వాగతమిచ్చి విస్పందేహముగ నిరీక్షించుచున్నది. కావున అందు ప్రవేశించి కూర్చుందుము.
(ఇద్దరును ప్రవేశించి కూర్చుందురు)

సానుమతి : లతకు సమీపముననే యుండి సఖీ ప్రతికృతిని నిరీక్షింతును. అప్పుడాతని కన్నివిధములఁ గలిగిన యనురాగమును శకుంతలకు నివేదింతును. (అట్లు చేయును)

రాజు : మిత్రమా! శకుంతలా ప్రథమ వృత్తాంతమంతయు ఇప్పుడు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. నీకుఁ గూడ ఆ చరిత్రమును ఆనాఁడు చెప్పితిని. నే నామెను తిరస్కరించువేళకు నీవు కూడ

నాకథ లేకుంటివి. ఇంతకుముందు ఒకప్పుడైనను మనసరససల్లాపము లందు ఆమె పేరునైన చెప్పితివికావు. నావలె నీవు కూడ దానిని మరచితివా ?

విదూషకుఁడు ; మరువలేదు. కాని, అంతకథనుచెప్పి చివరకు నీవు "మిత్రమా ? యిదియంతయు పరిహాస జల్పితముగాని పరమార్థముకాదు సుమా" అని పలుకలేదా ? మట్టిబుద్ధిని. నేను దాని నట్లే యనుకొంటిని. ఇంతకు భవితవ్యత బలవత్తరమైనది గదా !

సానుమతి : అవును అదియట్లే.

రాజు ; (విచారించుచు) నన్నుఁ గాపాడుము.

విదూషకుఁడు ; ఓయీ ! ఏమిటిది ? నీ వంటివానికీమాటతగదు. సత్పురుషు లేనాఁడును శోకాకుల చిత్తులు కారు. ఎంత పెద్దగాలి వీచినను గొండలు కదలునా ?

రాజు వయస్య ! నిష్కారణముగ నిందించి నిరాకరించిన ఆ దీనురాల యిన ప్రియురాలి యవస్థను స్మరించి అశరణుండనయితిని.

9, ఉ॥ నేను తిరస్కరించి తను
నెట్టగ, బంధులఁ గూడనేగె, నా
మౌనిస ముండు శిష్యుఁడురు
మానముతో నిలుమంచు నున్నత
ధ్వానముఁ జేయ, బాష్పములు
పైకొను చూపులఁ గ్రూరునన్నైతా
దీనతఁ జూచె, నద్ది విష
దిగ్ధశరంబటు నన్నుఁ గాల్చెడిన్.

సానుమతి : ఆహా ! స్వకార్య పరత్వమన నిట్టిదే కదా ! ఈతని సంతాపము నాకు వినోదముగనేయున్నది.

విదూషకుఁడు ; ఆఁ. నాకొక యూహ యున్నది. ఎవ్వరో యొక ఆకాశచారిణి ఆమె నపహరించి యుండును.

రాజు : ఇంకొకరెవ్వరు ఆ పతిదేవతను బరామరిసింపఁగలరు ? ఆమె తల్లి మేనక యని వింటివికదా ! ఆమె సఖులెవ్వరో శకుంతల నపహరించి యుందురని నే ననుకొనుచుంటిని.

**సానుమతి :** అజ్ఞానమే యాశ్చర్యమును గలిగించుచున్నది. ఈ జ్ఞానము కాదు.

**విదూషకుఁడు :** అట్లయినచోఁ గొంతకాలమునకు ఆమెను నీవు పొందఁగలవు,

**రాజు :** ఎట్లు ?

**విదూషకుఁడు :** భర్తృ వియోగదుఃఖితయగు పుత్త్రికను జూచుచుఁ దల్లిదండ్రులు చిరకాలము సహింపఁ జాలరు.

**రాజు :** వయస్య !

10. గీ. కలయొ, మాయయొ. బుద్ధి వైక్లబ్యమేమొ ?
పుణ్యఫల మింత మాత్రమై పోయెనేమొ ?,
మరల రాకుండ నంతయు మాయమయ్యె,
అతటపాతములై కోర్కు-లమరునుగద.

**విదూషకుఁడు :** అట్లనకుము. తప్పక లభింపఁదగు వస్తువు లభించుననుటకు మనకీ యంగుళీయకమే నిదర్శనము.

**రాజు :** (ఉంగరమును జూచి) ఓయీ ! అసులభ స్థానమును విడిచిన దీనిని గుఱించి దుఃఖింపవలసియున్నది.

11 కం. నా వలె నీ సుచరిత్రయు
భావించెదఁ బ్రతనువనుచు ఫలమును గని, నీ
వా వనిత యరుణ నఖకర
సేవన్విడి యుంగరంబ ! చెడితివి సుమ్మా !

**సానుమతి :** అది మఱియొకని చేతిలోఁబడిన విచారింపఁదగినదే !

**విదూషకుఁడు :** ఓయీ ! మిత్రమా ! ఎట్టి సన్నివేశమున నీ నామాక్షర ముద్రికను ఆమె కొసంగితివి ?

**సానుమతి :** ఈ కుతూహలము నన్నును ప్రేరేపించుచున్నది.

**రాజు :** వినుము. నేను నగరమునకుఁబోవ యత్నించుచుండఁ గంటఁ దడిపెట్టి యామె మరల యెన్నాళ్ళకు తమ యనుగ్రహము వచ్చునోయని యడిగినది,

విదూషకుఁడు : తరువాత – తరువాత.

రాజు : అప్పుడు నే నీ యుంగరమును ఆమె చేతికుంచుచు, ఇట్లు పలికితిని.

12. కం. లెక్కింపుము దిన దిన మిం
దొక్కొక యక్షరము, నెప్పుడు విదా ! వినుమా,
యక్కరము లంతమగునో,
తక్కక యిలు సేర్పుజనుఁడు తరుణీ ! వచ్చున్.

సానుమతి : అందమైన అవధిని దైవము చెడఁగొట్టినది.

విదూషకుఁడు : ఆ యుంగరము జాలరి ఖండించిన లోహిత మత్స్యపుఁ గడుపు లోని కెట్లు వచ్చెను ?

రాజు : ఆమె శచీతీర్థమును నమస్కరించుచుండ చేతినుండి జారి గంగా జలమునఁ బడినది.

విదూషకుఁడు : అట్లయి యుండును – తగియున్నది.

సానుమతి : అందుచేతనే అధర్మభీరువయిన యీ రాజర్షికి శకుంతలా వివాహ మందే సందేహము కలిగినది. కాని, యింతటి యనురాగము యభిజ్ఞానము నపేక్షించునా ? ఇది యెట్లుమ అదుకకున్నదే ?

రాజు : ఇప్పుడీ యుంగరమును నిందింపవలెను.

విదూషకుఁడు : (తనలో) ఈతఁడు పిచ్చివాని త్రోవబట్టినాడు.

రాజు : బంధురాంగుళి కోమలపాణి విడిచి,

13. గీ॥ యేల మునిగితి నీటిలో నిపుడు చెపుమ ?
లేదా,
అనుకొన నచేతనంబగు గుణ మటంచు,
చేతనుఁడనయ్యునే విడిచితిని ప్రియను.

విదూషకుఁడు : (తనలో) ఆఁ. నన్నాకలి తినివేయుచున్నది.

రాజు : అకారణముగ శకుంతలను విడిచితినని యనుశయతప్త హృదయుఁ డనైన నన్ను మరల దర్శనమిచ్చి యనుగ్రహింపుము.

చతురిక : ( ప్రవేశించి-తెరనులాగి ) ఈమెయే చిత్రగీతయగు భట్టిని.
(చిత్ర ఫలకమును ఇచ్చును)

విదూషకుఁడు : చక్కఁగనున్నది. వయస్య ! చక్కఁగనున్నది. భావాను ప్రవేశము మధురా వస్థానదర్శనీయమై యొప్పుచున్నది. నా దృష్టి నిమ్నో న్నత స్థలము అందు తొట్రుపడుచున్నట్లున్నది.

సానుమతి : ఆహా ! ఈ రాజర్షి చిత్రకర్మ నైపుణము ఎంతమనోహరము ! నా సఖి నా యెదుట నున్నట్లున్నదే !

రాజు : సృష్టిలో సాధువై యెద్ది చేయఁబడదొ,
14. గీ॥ చిత్రమందది సాధువై చేయఁబడును,
కాని యీకాంత లావణ్యగరిమలోన
కొంచెమే లిఖితమ్మయ్యెఁ గుంచెతోడ.

సానుమతి : ఈ మాట పశ్చాత్తాప దుర్భరమగు ప్రేమకు అవలేపరాహిత్య మునకును తగియున్నది.

విదూషకుఁడు : ఓయీ ! ఈ చిత్రఫలకమున ముప్వురు పూజ్యూరాండ్రు కనఁబడు చున్నారు. అందఱును చక్కని చుక్కలే. అందు ఆ పూజ్యురాలైన శకుంతల యెవ్వరు ?

సానుమతి : వీఁడు నా సఖి రూపము నెఱుఁగడు చూపుచాలని వాఁడు వీఁడు.

రాజు : నీ వెవ్వతె యని యూహించుచుంటివి ?

విదూషకుఁడు : చ్యుత బంధనంబగుటచే జారిన పూవులుగల కేశపాశముతో, చెమట బిందువులతో నిండిన ముఖ మండలముతో, మిక్కిలి క్రుంగిన బాహువులతో, జలాభిషిక్తతరుణ పల్లవమగు బాలసహకార పాదప సమీపమున కొంచెము అలసి నిలఁబడినట్లు లిఖింపఁబడిన యీమె శకుంతల యనియు, మిగిలిన యిర్వురు నామె సఖులనియు నే నను కొనుచుంటిని.

రాజు : నీవు నేర్పరివే. అచ్చటనే నా భావచిహ్నము కూడఁ గలదు.

15. గీ॥ కనఁబడును మలినాంక లేఖాంతములను
చెమట వ్రేళుల నంటుటచేతఁ జెదరి,
కనఁబడుఁ గపోల పతితమై కనుల నీరు
చారుతరమగు వర్తికోచ్ఛ్వాసమునను.

చతురికా ? ఈ వినోద స్థానము సగమే **లిఖింపఁబడి**నది అందు చేత నీవు వెళ్లి వర్తికాపేటికను గొనిరమ్ము.

**చతురిక :** ఆర్య ! మాధవ్య : ఈ చిత్ర పటము నందుకొనుము. ఇంతలో వర్తికా పేటికను పట్టుకొని వచ్చెదను.

**రాజు :** నేనే పట్టుకొనియెదను. (తీసికొనును) (చతురిక వెళ్లును)

రాజు : ఎదుటికి వచ్చినట్టి ప్రియ
16. చం॥ నేమి యెఱుంగని యట్లు పంపి, యా
సుదతిని చిత్రమందుఁగని
చొక్కుచునుంటి కరమ్ము నిప్పుడే
వధిక జలంబు నిర్ఝరిణి
నంటక దాటి పథమ్మునందుఁ జూ
పుదు మృగతృష్ణి కన్ప్రణయ
ముద్వితథంబుగ నక్కటా ! సఖా !

విదూషకుఁడు : (తనలో) ఈ పూజ్యుఁడు నిజముగా నదినిదాటి మృగతృష్ణికలోనే పడినాడు (ప్రకాశముగ) ఓయీ ! వయస్య ! ఇంకను లిఖింపఁదగిన దేమికలదు ?

**రాజు :** వినుము.

17. సీ॥ సైకతాలీన హంస మిధునమ్ముల నొప్పు
నిర్మలోదక మాలినీ స్రవంతి,
పర్వతస్సంచరచ్చపల మృగవ్రాత
పావన హిమగిరి పాదములను,

శాఖావలంబిత చారువల్కల పటా
చ్ఛాదిత పాద పసంచయముల,
పాదపచ్ఛాయానివాసి భాసురకురం
గాభ్యాశవర్తి మృగాంగనలను,

గీ॥ జక్కఁగాఁ గృష్ణసార విషాణమందు
వామనయనమ్ముకొననుంచి పాముచున్న
యాడులేడినిగూడ నేనచట వ్రాయఁ
దలఁచియుంటిని మిత్రుడా! తనివిదీర.

విదూషకుఁడు : (తనలో) అట్లయిన లంబికూర్చులగు తాపసుల సంఘముచే ఈ చిత్రము పూర్తిగావింపఁబడును. తప్పదు.

రాజు : వయస్య! మాకు మిక్కిలి అభీష్టమగు మఱియొక అలంకార మును ఈమెకు రచింప మరచితిని.

విదూషకుఁడు : ఏమది?

సానుమతి : వనవాసమునకు, సౌకుమార్యమునకు నేది తగియుండునో అదియే యయి యుండును.

రాజు :

18. ఉ॥ చెక్కిలియందుఁ గేసరపు
శ్రీలు వెలుంగ శిరీష పుష్పమున్
జక్కగ వ్రాయలేదు, చెవి
సందున వృంతము నుంచునట్లు, నే
నక్కట! వ్రాయనైతి, శర
దబ్జ మరీచిసుకోమలంబు నా
చక్కి మృణాళ సూత్రముఁ గు
చాంతరమందున మిత్ర రత్నమా!

విదూషకుఁడు : వయస్య! ఆ పూజ్యురాలు ఎందులకో రక్తకువలయ దళము వంటి హస్తాగ్రముతో ముఖమును గప్పుకొని మిక్కిలి భయపడుచు

విలఁబడినది ? ( పరిశీలనగఁజూచి ) ఆ ! దాస్యాఃపుత్రుడు కుసుమాసవ పాటచ్చరుఁడు అగు ఈ దుష్ట మధుకరము ఆ పూజ్యురాలి ముఖముపైఁ బడుచున్నదే !

**రాజు :** ఓయీ ? వానిని వారింపుము.

**విదూషకుఁడు :** నీవే యవినీతులను శాసించువాఁడవు. వానిని వారించుటకు నీవే సమర్థుండవు.

**రాజు :** అవును. ఓయీ ! కుసుమలతా ప్రియాతిథీ ! ఎందులకు ఇచ్చటి నుండి పడిపోవు దుఃఖమును అనుభవింతువు ?

19. గీ॥ కుత్తుకెండుచునున్నను గోర్కెలొదవ
కుసుమ మందుండి నీరాకఁ గోరుచుండె,
నీవు లేకున్న మధుపాన మెట్లుచేయు
పొమ్ము మధుకర ! నీ సతిఁ బొందుమిపుడ.

**సామమతి :** జాతికర్తృమగురీతిని ఈతఁడు వారింపఁబడినాఁడు.

**విదూషకుఁడు :** నిషేధించినను వచ్చుచున్నది. ఈజాతి వక్రమైనదే.

**రాజు :** అట్లే. ఓయీ ! నా శాసనము నాచరింపవా ! అట్లయినచో వినుము

20. ఉ॥ బాలరసాల పల్లవని
భంబతికోమల మక్షతంబు కాం
తాలలితా ధరంబు సుర
తాభిముఖోత్సవ వేళలందు నేఁ
గ్రోలితిఁగోర్కెఁదీర దయఁ,
గ్రూరత దానిని ముట్టితేని, నిన్
లోలుఁడ ! యిప్పుడేను కమ
లోదర బద్ధునిఁగా నొనర్చెదన్.

**విదూషకుఁడు :** ఇంతటి కఠిన శిక్షకు ఆతఁడేల భయపడఁడు? (నవ్వుకొని - తనలో) ఈతఁడిప్పుడు పిచ్చివాఁడైనాఁడు నేనుగూడ వీని సహవాసమున అట్లే అయితిని. (ప్రకాశముగ) ఓయీ ! ఇది చిత్రపటమయ్యా !

రాజా : ఏమి?

సానుమతి : ఇప్పుడు నేను గూడ నిజమును గ్రహింపలేకుంటిని. ఈతఁడు వ్రాసిన దానిని యథార్థముగ అనుభవించుచున్నాఁడా?

రాజు : వయస్య ! ఇట్లు పురోభాగిత్వముమ ఏమిటి కాచరించితివి?

21 గీ. తన్మయంబగు నెడఁదఁ బ్రత్యక్షముగను
దర్శన సుఖంబునంది యేఁదనియుచుంటిఁ,
బూర్వచరితంబు నీవిప్డబోధచేయ
మరల చిత్రీకృతంబయ్యె మగువ హితుఁడ

సానుమతి : ఈ విధానమార్గము పూర్వాపరవిరుద్ధమై మిక్కిలి యపూర్వముగ నున్నదే !

రాజు : వయస్య ! విశ్రాంతి నెరుగని దుఃఖమును ఇట్లనుభవించుచుంటివి గదా !

22. గీ. రాత్రులన్ దినముల నిద్రరానికతనఁ
గలలలోనైన నామెను గలియనైతిఁ.
జిత్రమునఁజూచి సంతసించెదనటన్నఁ
జూడనీయదు బాష్పంబు సుదతిరూపు.

సానుమతి : వయస్యా ! అన్ని విధముల శకుంతలా పరిత్యాగ రూప దుఃఖమును కడిగివేసితివయ్యా !

చతురిక : (ప్రవేశించి) ప్రభువులు జయింతురుగాక. వర్తికా కరండమును గైకొని యిచ్చుటకి బయలుదేరితిని.

రాజు : మఱియు,

చతురిక : తరళికతోఁగలసి వచ్చుచున్న వసుమతీదేవిగారు నేనే యార్యపుత్త్రున కందిచెదనని పలికి నా చేతినుండి దానిని బలత్కారముగ లాగుకొనినారు.

విదూషకుఁడు : నీ అదృష్టము బాగున్నది. నీవు విడువబడితివి.

చతురిక : కొమ్మకుఁదగులుకొనిన దేవిగారి వస్త్రాంచలమును తరళిక తప్పించుచుండ, నేను మెల్లగ తప్పుకొంటిని.

రాజు : వయస్య ! రాణి వచ్చుచున్నది. ఆమె మిక్కిలి బహుమాన గర్వీత, నీవీచిత్రఫలకమును గాపాడుచుండుము.

విదూషకుఁడు : (చిత్రఫలకమును గ్రహించి లేచి) నన్ను కాపాడుమనియనుము. ఈ యంతఃపురకలహము నుండి విడువడిన పిదప మేఘచ్ఛంద ప్రాసాదమందున్న నన్ను బిలువుము. (వడిగె త్తి పోవును)

సానుమతి : అన్యసంక్రాంత హృదయుఁడైనను, ప్రథమ కళత్ర గౌరవ మును అపేక్షించుచున్నాడు. అందుచే నీతఁడిప్పుడు శిథిల సౌహృదుఁడు కాఁడు. (ప్రతీహారి పాత్రహ స్తయై ప్రవేశించును)

ప్రతీహారి : ప్రభువులు జయింతురుగాక !

రాజు : వేత్రవతి ! మార్గమధ్యమున వసుమతీదేవి నీకంటఁబడినదా?

ప్రతీహారి : పత్రహ స్తయగు నన్నుఁగాంచి రాణిగారు మరలిపోయినారు.

రాజు : కార్యజ్ఞ కావున నా కార్యమును నిరోధింపలేదు.

ప్రతీహారి : ప్రభూ ! కార్యములు లెక్కలేనన్ని యుండుటచే ఈనాఁడు పౌర కార్యములలో నొక్కటియే పరిశీలింపఁబడినదనియు,దానిని పత్ర మందుంచితిననియు, తమరు దానిని పరిశీలింపవలయుననియు, అమాత్యులు మనవిచేయుచున్నారు.

రాజు : ఆ పత్రికనిటు చూపుము (చూపును)

రాజు : (చదివి) ఏమి? సముద్రవ్యవహారి ధనమిత్రుఁడను వ ర్తకుఁడు పడవమునిగి మరణించెనా ? ఆ దీనుఁడు సంతానహీనుఁడట ! అతని ధనసంచయమంతయు రాజునకు చెందునని మంత్రి వ్రాసి యున్నాఁడు. అయ్యో ! అనపత్యత దుఃఖదాయకముగదా ! వేత్రవతి ! సంపన్నుఁడగుటచే ఆ వ ర్తకుఁడు బహుపత్నీకుఁడు కావచ్చును. అతని భార్యలలో నెవతె యయినను గర్భవతిగా నున్నదేమో విచారణ చేయుమని చెప్పుము.

ప్రతీహారి : దేవ ! అతని భార్యలలో సాకేత శ్రేష్ఠికూతురు పుంసవనోత్సవ మును జరుపుకొనినదని తెలియుచున్నది.

రాజు : ఓయి – గర్భము పితృధనము నందుట కర్హము. వెళ్ళుము – ఇట్ల మాత్యునితోఁజెప్పుము.

ప్రతీహారి : చిత్తము - (వెళ్ళుచుండును)

రాజు : వేత్రవతి ! ఇటురమ్ము

ప్రతీహారి ; చిత్తము.

రాజు : సంతతికలదా? లేదా? అనుచింతయేల?

23. గీ॥ ఆప్తులగు వారలెవరైన నంతరింప,
నతివ చింతింప వలవదా, పతియదక్క-
నగును దుష్యంతుఁడామెకు నాప్త బంధు
వనుచుఁజాటింపుఁడిప్పుడే యవనియందు.

ప్రతీహారి : అట్లే చేసెదము, (వెళ్ళి - మరలవచ్చి) సకాలమున వర్షము పడినట్లు తమశాసనమును అమాత్యులు అభి నందించిరి.

రాజు ; (పెద్దగా నిట్టూర్చి) ఈ విధముగనే సంతతి విచ్ఛేదమున నిరవ లంబులయినవారి సంపదలు మూలపురుషుఁడంతరింపఁగనే యిత రులను జేరునుగదా ! నాయంతమున పురువంశలక్ష్మికిని ఇట్టి యవస్థయే పట్టును.

ప్రతీహారి ; అమంగళము ప్రతిహతమగుగాక.

రాజు ; ఛీ-ఛీ- సమీపించిన శ్రేయస్సునవమానించితిని.

సానుమతి ; సందేహములేదు. శకుంతలనే మనస్సులోనుంచుకొని తన్నుఁదాను నిందించుకొనుచున్నాఁడు

రాజు : మామకమైన తేజమును

24 ఉ। మాన్విని గర్భమునందు నిల్పియున్
నామకుల ప్రతిష్ఠయగు
నా సహధర్మిణి నామె వీడితిన్
ఏ మహనీయమౌ ఫలమొ
యీయఁగజాలిన సారవంతమౌ
భూమిని విత్తునాటి పెడ
బుద్ధిని వేత్యజియించు కైవడిన్

సానుమతి : నీ సంతతి యిప్పుడపరిచ్ఛిన్నము కాఁగలదు.

చతురిక : (జనాంతికముగ) ఓసీ! వేత్రవతి! ఈ సార్థవాహ వృత్తాంతముచేఁ బ్రభువులు విమనస్కులయినారు వీరి నోదార్చుటకు మేఘచ్ఛంద ప్రాసాదమునందున్న మాఢవ్యుని పిలుచుకొనిరమ్ము.

ప్రతీహారి : చక్కఁగఁ జెప్పితివి. (వెళ్ళును)

రాజు : అయ్యో! దుష్యన్తుని పిండభాక్కులు సందేహగ్రస్తులయిపోయిరి.

25. ఉ॥ ఈతఁడు పుత్త్రహీనుఁడిఁక
నీతని యంతమునందు నెవ్వరీ
ఖ్యాతకులమ్మునన్ నివప
నాదికమున్ విధిపూర్వకమ్ము సం
ప్రీతి నొసంగు వారని ని
రీక్షణ సేయుచు నే నొసంగు నీ
పూతజలమ్ముఁ ద్రావుదురు
పూజ్యులు మత్పితల క్షుధార్తులై.
(మూర్ఛపోవును.)

చతురిక : (తొందరగా పట్టుకొని) ధైర్యము నవలంబింపుడు ధైర్యము నవలంబింపుడు.

సానుమతి : అయ్యో! అయ్యో! దీపమున్నను వ్యవధాన దోషముచే నీతఁడు అంధకారములోనే యున్నాఁడు. నేను ఇప్పుడే యీతని సుఖవంతుని గావింతును. కాదు. కాదు. శకుంతల నోదార్చు దేవేంద్ర మాత నోటినుండి, "నీ భర్త త్వరలో నిన్ననుగ్రహింపఁగలడు యజ్ఞభాగ పర్యుత్సుకులగు దేవతలే యీతని సుఖవంతుని జేయుదురు" అని వింటిని. అంతవఱకు నిరీక్షించుటయే శ్రేయస్కరము. ఈతని చరిత్రము నెఱింగించి శకుంతల నోదార్చెదను.

(ఎగిరి సానుమతి వెడలును)

( నేపథ్యమున )

చంపకుము – చంపకుము.

రాజు : (విని) ఏమీ ! మాధవ్యుని స్వరమువలె నున్నదే ? ఎవరక్కడ?

ప్రతిహారి : (త్వరగావచ్చి) రక్షింపుఁడు-రక్షింపుఁడు ప్రభువులు. ఎవ్వఁడో మీ వయస్యుని కంఠమును నులుముచున్నాఁడు.

రాజు : ఎవరాతని మెడఁబట్టినవారు ?

ప్రతిహారి : ఎవ్వఁడో అదృశ్యరూపముతో మాధవ్యు నాక్రమించి, మేఘచ్ఛంద ప్రాసాద శిఖరమునకుఁ గొనిపోయినాఁడు.

రాజు : (లేచి) ఇది జరుగరానిది. మా గృహములుగూడ సత్వాక్రాంతము లైనవా ? అవును.

26. గీ॥ ప్రత్యహముఁ దాను గావించు పనులయందె
పొసగు దొసగుల నిసుమంతఁ బోల్పలేదు,
ప్రజలలో నెవ్వఁడేరీతిఁ బరగుచుండె
వాని నెఱుఁగంగఁగలఁడె భూపాలుఁడైన.

( నేపథ్యమున )

ఓయీ ! మిత్రమా ! రక్షింపుము - రక్షింపుము.

రాజు : (గబగబనడచుచు) మిత్రుడా ! భయపడకుము. భయపడకుము.

( నేపథ్యమున )

మిత్రుఁడా ! రక్షింపుము - రక్షింపుము. ఓ పూజ్యుడా ! భయపడకుండుట యెట్లు ? ఎవ్వఁడో పీడు మెడ వెనుకకువంచి నన్ను చెఱకుగడనువలె విరచుచున్నాఁడు.

రాజు : (చూపు మరల్చి) ధనువునిమ్ము. (చాపమును చేతధరించి యవన కాంత ప్రవేశించి) ప్రభూ ! ఇదియే హస్తావాపముతోఁ గూడిన ధనువు. (రాజు ధనుర్బాణములను గ్రహించును) (నేపథ్యమున)

27. ఉ॥ సుంత నవీనకంఠగత
శోణితమున్గొన నాసఁజేసి, దు
ర్దాంతము వ్యాఘ్రమొండు పశు
దారణమున్బొనరించునట్లు, ని

న్నంతము చేయుచుంటి, మహి
నార్తులఁ గావఁగ నాత్తధన్వుఁ డు
ష్యంతుని బిల్వ, మీసమయ
మందున నాతఁడె రక్షకుండగున్.

రాజు : (కోపముతో) ఏమీ ! నన్నే పేర్కొనుచున్నాఁడే. ? నిలుము - నిలుము-నీచరాక్షస ! నిన్నిప్పుడే హతమార్చెదను. (విల్లెక్కిడి) వేత్రవతి ! సోపానమార్గమును జూపుము.

వేత్రవతి : ఇటు - ఇటు - దయచేయుఁడు.

(అందఱును వేగముగ వెళ్ళుదురు)

రాజు : (అంతటను జూచి) ఏమియును లేదే ? (నేపథ్యమున) రక్షింపుము-రక్షింపుము. నేను మిమ్ములను జూచుచుంటిని. నీవు నన్నుఁ జూడలేకుంటివి. పిల్లి పట్టిన యెలుకవలె నేను ప్రాణము లందు నిరాశుఁడనైతిని.

రాజు : ఓయీ ! తిరస్కరిణీగర్విత ! నా యస్త్రమే నిన్నుఁ జూచును. ఇప్పుడు పారిపోవక నిలఁబడుము. ఆ బాణమును సంధానించు చుంటిని.

28. ఆ. వె. చంపఁదగినవానిఁ జంపును, రక్షింపఁ
దగిన వీని విప్రునొగినిఁ గాచు
నంచపాల నారగించును, దన్మిశ్ర
జలము విడుచుచుంట సత్యముగద.
(అస్త్రమును సంధించును)

(విదూషకుని విడిచి మాతలియు, విదూషకుఁడును వత్తురు)

మాతలి : రణమున నీకు నుంచె ఘన

29. చం॥ రాక్షసులన్ హరి లక్ష్యవకానటుల్,
ధనువు నధిజ్యమౌనటుల
దాల్చి వధింపుము వారినందఱిన్,

ఘనులగు సజ్జనుల్ భువిని
    గాంతురు మిత్రుల నాదరంబుతో,
నినివినచూపులన్, విడువ
    నేర్తురె వాఁడిశరాల వారిపై.

రాజు ; (అస్త్రముసుపసంహరించి) ఓహో ! మాతలి ! ఓ దేవేంద్ర సారథీ ! స్వాగతమా !

విదూషకుఁడు : యజ్ఞపశువునువలె నన్నెవ్వఁడు చంపెనో వానికీతఁడు స్వాగత మిచ్చి గౌరవించుచున్నాఁడే ?

మాతలి : (నవ్వుచు) ఆయుష్మంతుఁడా ! నేను ఎందులకు నీకడ కంపఁబడితినో వినుము.

రాజు : సిద్ధముగా నుంటిని.

మాతలి : కాలనేమి సంతానమును దుర్జయమును అగు రాక్షసగణ మొండు గలదు.

రాజు ; నారదునివలన నింతకుముందు వినియుంటిని.

మాతలి : నీ కల మిత్రుఁడైన సుర
30. ఉ॥ నేత కజయ్యము రాక్షసాధమా
నీకముఁ జంప యుద్ధమున
    నిన్ను స్మరించె మహేంద్రుఁడిప్పుడు,
స్తోకతమంబు నైశమును
    సూర్యుఁడడంప నశక్తుఁడైన నా
చీకటిమాన్పఁ జంద్రుఁడును
    సిద్ధపడండె, జగంబులోపలన్.
నీవు ఆత్తశస్త్రుఁడవై యిప్పుడే యీ యింద్ర రథము నధిష్ఠించి విజయమునకు ప్రయాణ మగుము.

రాజు ; ఈ గౌరవముచే ననుగ్రహింపఁబడితిని. సరే కాని, నీవు మాధవ్యుని అట్లేల గావించితివి ?

మాతలి ; దానినిగూడఁ జెప్పెదను. ఆయుష్మంతుఁడు ఏ కారణము చేతనో మానసిక తాపమున దీనుడై యున్నట్లు నాకుఁ దోచెను. అట్టి మీకుఁ గోపమును దెప్పించుటకే యిట్లు గావించితిని. ఏమన -

31. గీ॥ మండు చలితేంధనంబయి మహిని వహ్ని,
విప్రకృతమయి పాము తా విప్పుఁబడగ,
క్షోభ యొకయింత మనమును సోకినంత
మానవుఁడు చూపుఁగా తన మహిమఁ దఱచు.

రాజు : మీరాచరించినది చక్కగనే యున్నది. (జనాంతికముగ) వయస్యః ఇంద్రాజ్ఞ దాటరానిది. ఈ విషయ మంతయుఁ దెల్పి యమాత్య పిశునునితో నిట్లు చెప్పుము.

32. గీ॥ నీవు నీమతి నేర్పున నెమ్మిఁ బ్రజల
గావు చుండుము శ్రద్ధగఁ గరుణతోడ,
సజ్యమైయున్న యీనాదు చాపమిపుడు,
సిద్ధమయ్యెను మఱియొక సిద్ధికొఱకు.

విదూషకుఁడు : అట్లే చేయుదును. (వెడలును)

మాతలి : ఆయుష్మంతుఁడు ఇటు ఇటు వచ్చుగాక.

(రాజు రథము నధిష్ఠించును) (అందఱును వెళ్లుదురు)

# సప్తమాంకము

(ఆకాశయానమున రథారూఢుఁడై దుష్యంతుఁడును, మాతలియును ప్రవేశింతురు).

రాజు : మాతలీ! వాసవనియోజ్యుఁడనగు నేను ఆ మహేంద్రుఁడు గావించిన సత్కార విశేషములకు అర్హుఁడనుకానని యనుకొనుచుంటిని సుమా!

మాతలి : (నవ్వుచు) ఆయుష్మంతుఁడా! మీరు ఇరువురు అసంతుష్టులయేయున్నారు.

1. చం॥ తొలుతొలుత న్మహేంద్రునకుఁ
దుష్టి నొనర్చు మహోపకార మీ
వలుపముగా గణింతువుఁ సు
రాధిపునందలి భక్తి, నాతఁడున్
విలసిత తావకీన ఘన
వీర్యముఁ గాంచి సువిస్మితాత్ముఁడై,
తలఁచును బూజ నీ యెడలఁ
దా నొనరించిన దల్పమంచెదన్.

రాజు : మాతలీ! అట్లనకుము. నన్ను పంపించునప్పుడు ఆతఁడు గావించిన సత్కారము కోర్కెలకుఁగూడ అందనిది గదా! నన్ను దేవతా సమక్షమున తన యాసనార్ధమందుంచుకొని, –

2. ఉ॥ అంతికమందు నిల్చి హృద
యంబునఁ బ్రార్థన జేయఁగోరు న
త్యంత హితున్ గుమారుని జ
యంతుని జూచియు నవ్వుచున్ మరు
ద్వంతుఁ డొసంగె నాకు నిజ
వత్సత లారుణ చందనాంకమున్

కాంతముఁ బారిజాత సుమ

కల్పిత నిర్మల దివ్యదామమున్.

మాతలి : ఆయుష్మంతుఁడవగు నీవు ఆ యమరాధిపు నుండి యేది గ్రహించుటకుఁ దగవు ?

3. చం॥ పరమ సుఖాభిలాషి సుర

పాలకు లోకము నిస్సపత్నమై

పరగుట కుండె, రెండు ఘన

భారవహంబులు సాధనంబు, లం

దురతర నారసింహ నఖ

రోగ్రముఖంబులు పూర్వమందు, నీ

వర నతపర్వ తీవ్రఘన

బాణ పరంపర లిప్పుడున్ సుమా ।

రాజు : ఈ విషయమున ఆ యింద్రుని మహిమయే కొనియాడఁ దగినది కదా ।

4. చం॥ తెలియుము భృత్యులెల్లడల

దెప్పరమౌ పనులన్ని చేయఁగాఁ

గలుగుట, తన్నియామకుల

కల్మినిగాదె, సహస్రరశ్మి ని

చ్చలు తనతేరిపై నిడక

సాగినచో, వరుణుండు రాత్రులం

దలమిన చీకటి న్విరియ

నర్పఁగదె, చూడఁ బ్రభాతవేళలన్.

మాతలి : ఇది తగియేయున్నది. (కొంచెము దూరము క్రిందకుదిగి) ఆయుష్మంతుఁడా ! ఇచ్చటనుండి నాకప్రష్ఠ ప్రతిష్ఠితమైన నీ కీర్తి సౌభాగ్యమును జూడుము.

5. ఉ॥ హత్తి శరీరమందు ముద

మార సురాంగన లొల్లనట్టి వి

చ్ఛిత్తి విశేషముల్, సుర
విశిష్టులు గైకొని, కల్పపాదపా
యత్తములైన వస్త్రముల
యందు రచింతురు, గీతబంధమున్,
గ్రొత్తగ నూహచేసి సరి
క్రొత్తగ నీదగు సచ్చరిత్రమున్.

రాజు : మాతలీ! నిన్న స్వర్గమునధిరోహించు సమయమున నేను రాక్షస సంప్రహారోత్సుకుఁడనై యీస్వర్గమార్గమును చక్కఁగఁజూడనయితిని ఇప్పుడు మనము ఏ వాయుమండల మార్గముననుంటిమో చెప్పుము.

మాతలి : సురవరవాహినిన్ గగన

చం. శోభిని నెయ్యది దాల్చు సుస్థిరం,
బురుతర రశ్మిలెల్లదల
నొప్పగఁ జేయునదెద్ది జ్యోతులన్,
బరగు నెటన్ ద్వితీయ హరి
పాదనిరస్తమునై తమంబు, నా
పరివహవాయు మార్గమని
వల్కఁదురందఱు దీని నిచ్చలున్.

రాజు : అందుచేతనే సబాహ్యాంతః కరణమై నా యంతరాత్మ ప్రసన్నమైనది. (రథచక్రమును గాంచి) మేఘ మార్గమునకు వచ్చితిమే?

మాతలి : ఎట్లు తెలిసినది?

రాజు : అరవివరాంతరాళముల

7. చం॥ నంటక దాటెడు చాతకంబులున్,
హరుల శరీరముల్ వెలుగు
నట్టుల చేయు తటిద్విలాసముల్,
కర ముదబిందు పిత్తదృఢ
కద్రమరథాంగపు నేమిభాగముల్,
సరగను దెల్పెనీ రథము
సాగెనటుంచునువారి దోపరిన్.

మాతలి : క్షణములో ఆయుష్మంతుఁడు అత్మాధికార భూమియందుండఁ గలఁడు.

రాజు (క్రిందకుఁజూచి) మాతలీ! రథము అతివేగముగ క్రిందకు దిగుటచే నాశ్చర్యకరముగఁ గన్పట్టుచున్నది సుమా!

సీ॥ పైకిలేచుచు నున్న పర్వతాగ్రంబుల
నుండి క్రిందకు భూమిమండలంబు
దిగినట్లు గనఁబడె, తెల్లమై స్కంధముల్
బయలుపడుటనెల్ల పాదపములు
పర్ణమధ్యంబునఁ బరిలీనతన్వీడె,
తనుతరవారులై తనరు నదులు
వైపుల్యమును బొంది వ్యక్తతఁదాల్చెను,
వారి పూరంబులు చేగునటుల.

8. గీ॥ మర్త్యభువనంబు నెవడోఁ యమర్త్యుఁడొకడు
చేతులందియి కెత్తుచుఁ బ్రీతితోడ
నాదు పార్శ్వంబునకు తెచ్చు నాయనంగఁ
దోచె నిప్పుడు మాతలీ చూచుచుండ.

మాతలి : చక్కఁగాఁ జూచితివి (సగౌరవముగఁ గాంచి) ఓయీ! ఈ భూమండల మెంత రమణీయముగ నున్నదో కదా!

రాజు : మాతలీ! పూర్వ పశ్చిమ సముద్రములకు అంటుచు కనకరస నిష్యందియై సంధ్యాభ్రమువలె నీసానుమంతము కనబడుచున్నది. ఇది యే పర్వతము?

మాతలి : ఆయుష్మంతుఁడా! ఇదియే హేమకూటమను పేరుగల కింపురుష పర్వతము. మీదు మిక్కిలి యిది తాపసులకు సిద్ధిక్షేత్రము. చూడుము.

9. గీ॥ బ్రహ్మ మానస పుత్త్రుఁడై పరగె నెవ్వఁ
డా మరీచికి సుతుఁడు కాశ్యపుఁడనంగఁ
గలఁడతడె దేవదానవ కులజనకుఁడు,
ఆతఁడిటఁ బత్నితోఁ దపమాచరించు.

రాజు : అట్లయిన శ్రేయస్సుల నతిక్రమణీయములు, భగవంతుని ప్రదక్షిణించి యేగఁదలంచితిని.

మాతలి : మిక్కిలియుత్తమమైన సంకల్పము. మన మిరువురమును దిగితిమి.

రాజు : (నవ్వుచు) మాతలీ !

10. గీ॥ శబ్దములురావు రథనేమిచయమునుండి,
కదలుచున్నను ధూళియుఁగానరాదు,
భూతల స్పర్శ నెఱుఁగమి భువికి దిగియు
దిగని యట్లయ్యె నిప్పుడీ దివ్యరథము.

మాతలి ; ఈ మాత్రమే ఆయుష్మంతునకును, శతక్రతువునకునుగల భేదము.

రాజు : మాతలీ ! మారీచాశ్రమము ఎచ్చటఁగలదు ?

మాతలి ! (చేతితోఁ జూపుచు)

11. సీ॥ రూపమంతయుఁ బుట్టలోపల నణగారెఁ,
పాఁపకు బుసముండెపై నెదంద,
మెడచుట్టు బిగియించి మెండుగా నెండిన
తీగలు విరివిగ సాగియుండె,
బుజములపైఁబడి పొర్లాడు జడలందు
గూండ్లు కట్టుకొనియెఁ గొన్నిపక్షులు,
ఊరధ్వ ముఖంబుగ నుష్ణరశ్మినిగాంచు
చుండె బండ పగిది వెండలోనఁ,

ఆ. వె. జూడు మీ తపస్విజాడను మాతలీ !
వేడుకయ్యె నితని వింత తపము,
ఏమిగోరి యీతఁ డీరీతి నుండెనో
తెలియవశమె దేవదేవునకును.

రాజు : ఈ కష్టతపస్వికి నా నమస్కారము.

మాతలి ; అతిశ్రద్ధచే అదితి సంవర్ధిత మందార వృక్షకమగు ప్రజాపతి యాశ్రమమును ప్రవేశించితిమి.

రాజు : ఇది స్వర్గముకంటెను అధికమగు విర్వృతిస్థానము అమృత హ్రద ములో మునిగినట్లయితిని.

మాతలి : (రథమునాపి) దిగివచ్చును.

రాజు : (దిగి) నీ వెక్కడ నుందువో.

మాతలి : రథమునాపితిని, మేమును దిగియెదము. (దిగి) ఆయుష్మంతుఁడా! ఇటు రమ్ము. పూజ్యులయిన మునిపుంగవుల యాశ్రమభూములను నిరీక్షింపుము.

రాజు : ఆశ్చర్యముగ జూచుచుంటిని.

12. సీ॥ పారిజాతందిక పాదపాలంకృత
వనములన్ గాలిచే బ్రతుకువారు,
కాంచనాంబుజరాజి కమనీయతరసరో
వరములన్ దాస్నానముల్ జరుపువారు
బహురత్నరమణీయ పాషాణతలముల
ధ్యానంబులంజేయఁ బూనువారు
చతురసురాంగనాసన్నిధి నింద్రియ
సంయమనమ్మును జరుపువారు.

గీ॥ వేనిఁ గాంక్షించి తపమున్ దివానిశమ్ము
నన్యమును లాచరింతురో యట్టిచోటఁ
దపము గావించుచుండిరి తపసులెల్ల
ముక్తపురుషులుగాతె యీ మునులుచూడ.

మాతలి : మహాత్ముల ప్రార్థనలువిప్పింగి ప్రవహించుమగదా ! (నోటుచి) (ఆకాశమున) ఓయీ ! వృద్ధశాకల్య ! ఈతాలమఁదగు మారీచుఁ డేమి చేయుచున్నాడు ? ఏమంటివి ? పతివ్రతా ధర్మములవెతిం గింపుమని కోరగా మహర్షి కాంతాసహితయగు దాక్షాయణికి ఆధర్మ ములను బోధించు చున్నాఁడవియా !

రాజు : అయినచో సమయమును నిరీక్షింపవలపి యుండును.

మాతలి : (రాజును జూచి) ఆయుష్మంతుఁడా! నీవు ఈ యశోక పాదప మూలమున నుండుము. మన రాకను గురువులకు నివేదించు నవ కాశమును నేను నిరీక్షింతును.

రాజు : నీ వనినట్లే చేయుము. (ఉండును)

(మాతలి వెడలును)

రాజు : (సునిమిత్తమును గాంచి)

13. గీ॥ కోరలే దిష్టవస్తువుఁ గొంచెమైన,
నేల కదలెదు బాహువా! యివుడు వృథగ,
శ్రేయమ వధీరితంబయ్యెఁ జిరము, నేఁడు
దుఃఖమే పరివర్తనన్ దొర్లుచుండె.

(నేపథ్యమున)

వద్దు-తొందరపడవద్దు-ఏమి? ఎంతచెప్పినను మరల చేయుచున్నాడే!

రాజు : (విని) ఇది అవినయములకుఁ చోటుకాదే! ఈ శిక్షింపఁబడు వారెవ్వరో? (శబ్దాను సారముగఁ జూచి) (ఆశ్చర్యపడి) ఇరువురు తాపసకాంతలచే నిరోధింపఁబడుచున్న ఆబాల సత్త్వుఁడగు ఈ బాలుఁడెవ్వడో!

14. ఆ. వె. తల్లిపాలుసగము త్రావుచున్నట్టి యీ
సింహశిశువు నితఁడు చేతఁబట్టి
కేసరంబులూడఁ గ్రిడించునాశచే
లాగుచుండె నిట బలాత్కరించి,

(పై విధమున బాలమృగేంద్రమును లాగుచు బాలకుడును ఇరువురు తాపస కాంతలును ప్రవేశింతురు.)

బాలుడు : సింహడింభమా! నోరు తెరవుము; నీ దంతములను లెక్కపెట్టెదను.

ప్రథమ : అవినీతుఁడా! పుత్త్రినిర్విశేషముగఁ బెంచుకొనుచున్న యీసత్యములనేల బాధించెదవు? నీకు ఋషులు సర్వదమనుఁడని సరియగు పేరే పెట్టిరి.

రాజు : ఈ బాలుని చూడఁగనే కన్నకొడుకును గాంచినట్లు నా మనస్సు ఎందులకో స్నేహయుక్తమగుచున్నది.

ద్వితీయ : సర్వదమన ! ఈ ఆడు సింహము విన్నెగురవేయుమలే. దాని పిల్లను నీవు విడువకుంటివి.

బాలుడు : (నవ్వుచు) అమ్మో ! నాకు చాల భయము కలుగుచున్నది.
(పెదవులు చూపును)

రాజు : నాకుఁ దోచుచునుండె నీ నందనుండు

15. గీ॥ జాతుఁడగు నొక విపులతేజస్వికముచు,
ఇంధనాపేక్షి యౌవహ్ని యిట్టులుండెఁ
దాల్చి యల్పస్ఫులింగతా దశను మిగుల.

ప్రథమ : వత్సా ! ఈ బాల మృగేంద్రమును విడువుము. నీకొక యాట వస్తువు నిచ్చెదను.

బాలుడు : ఏది ? ఎక్కడున్నది ? దాని నిమ్ము. (చేయిజాచును)

రాజు : (చేతినిజూచి-ఆశ్చర్యపడి ఏమి ? ఈతనికి చక్రవర్తి లక్షణము లున్నవే ? ఏమనఁగా, వీనియొక్క -

ఉ॥ సన్నిహితాంగుళీకమయి
చారుతరంబగు పాణి పద్మ మా
సన్న ప్రలోభ్య వస్తు ప్రతి
సంగ్రహణాశఁ బ్రసారితంబునై,
భిన్న మలక్ష్య పత్రచయ
భేదమున నయ్యరుణారుణచ్ఛవి
చ్ఛన్నము నేకపంకజము
చాడ్పున నొప్పెసలారె నందమై.

ద్వితీయ : సువ్రతా ! మాటలతో వీఁడీ పనిని మానఁడు. వెళ్ళుము. నా పర్ణశాలలో మార్కండేయముని కుమారుని రంగులు వేయఁబడిన మట్టి నెమలి యున్నది. దానిని తెచ్చి వీని కిమ్ము.

ప్రథమ : అట్లే. (వెళ్లును)

బాలుఁడు : నేను దీనితోడనే యాడుకొనెదను. (తాపసినిజూచి నవ్వుచుండును)

రాజు : ఈ పిల్లవానిని జూచుచున్న కొలఁది నాకు అభిమానము గలుగుచున్నది.

17, ఉ॥ కారణ శూన్య హాసములఁ
గన్పడ నించుక దంతకుట్మలముల్,
వేరుగరాని వర్ణముల
వేడుకనీయ వచః ప్రవృత్తియున్,
జేరఁగ నంకపాళిఁదన
చేతులుచాచు సుతాళిఁదాల్చి, య
వ్వారి శరీర ధూళి చయ
భాసితులెంతటి పుణ్యవంతులో!

తాపసి : కానిమ్ము - వీఁడు నన్ను లక్ష్య పెట్టలేదు. (ప్రక్కకు దిరిగి) ఋషికుమారులలో ఎవరిక్కడ? (రాజునుజూచి) భద్రముఖా? ఇటురమ్ము. మొండిపట్టుపట్టి యీ బాలమృగేంద్రమును బాధించుచున్న యీ పిల్లవానిని విడిపింపుము.

రాజు : (నవ్వుచు - దగ్గరకేగి) ఓయీ! మహర్షి బాలక!

ఉ॥ పుట్టుకనుండి సత్వగుణ
పూర్ణము సంయమమంది నీవు చూ
పట్టితి, వాశ్రమానఁ గను
పట్టని దుష్టతర ప్రవృత్తి నీ
యట్టిఁడు చేయునే యిటుల,
సక్రమ చర్యల, మంచిగంధపుం
జెట్టును పాడుచేయుటకుఁ
జేరు భుజంగమ బాలుకై వడిన్.

తాపసి : భద్రముఖ! ఈతఁడు మునికుమారుఁడు గాఁడు.

రాజు : ఆకారమునకుఁ దగిన చేష్టయే చెప్పుచున్నది. అయినను, స్థాన విశ్వాసమున మేమిట్లు తలంచితిమి. (బాలుని విడిపించి స్పర్శ సుఖము ననుభవించి - తనలో)

19. చం॥ ఎవని కులాంకురంబొ యితఁ,
డీతని యంగముఁ దాకినంతనే,
మివుల జనించె సౌఖ్యమతి
మేదురమై యిట నాకుఁగూడ, నీ
భువిఁగనె వీనివే సుకృతి,
పుణ్యవశంబున నాతఁడీ తనూ
భవుని ధరించి, యెంత సుఖ
భావము నందునొ నెమ్మనమ్మునన్.

తాపసి : (ఇరువురిని బరిశీలనతోఁ జూచి) ఆశ్చర్యము - ఆశ్చర్యము.

రాజు : ఎందులకు ?

తాపసి : ఈ బాలకునకును మీకును సంబధమున్నట్లు మీ యాకృతి సరిపోయినది. ఈ బాలకుడు గూడ మీకు వశప్రియైనాఁడు.

రాజు : (బాలుని లాలించుచు) ఆర్యా ! వీఁడు మునిబాలకుఁడు కానిచో మఱి వీని వంశమేది ?

తాపసి : పురువంశము

రాజు : (తనలో) ఏమి ? నా కులముననే జన్మించెనా ? అందుచేతనే నన్ను పోలియున్నాఁడని యీమె తలంచినది. పౌరవులకు వార్ధకమున నిట్టి వ్రతమే కలదు.

0. చం॥ క్షితితల రక్షణార్థమయి
శ్వేతసుధా కలితంబులైన సౌ
ధతలములన్ వసింప మును
దాల్చిరొ కోరిక లేమహాత్ములా,
క్షితిపతి సత్తముల్ పిదపఁ
జేరి వనంబుల వృక్షమూలముల్
వితత గృహంబులై వెలుఁగ,
వేడుక నుందర నన్యవాసులై.

(ప్రకాశముగా) మనుష్యులు తమంతతాము వచ్చుటకు అలవికాని దేశములు గదా!

తాపసి : అవును. మీరన్నట్లే, ఈ బాలకుని తల్లి యప్సరసంబంధము గలది కావున ఈ దేవగురు నాశ్రమమున వీనినిఁ బ్రసవించినది.

రాజు : (తనలో) ఇది రెండవ ఆశాకారణము. (ప్రకాశముగా) ఆ పూజ్యురాలు ఏ రాజర్షి పత్నియో ?

తాపసి : ధర్మదార పరిత్యాగియగు ఆతని పేరు ఎవ్వరు స్మరింతురు ?

రాజు : (తనలో) ఈ కథకు నేనే గురియగు చున్నానే ? ఈ బాలకుని తల్లి పేరు అడుగుదునా ? వలదు. అన్యదారలనుగూర్చి యడుగుట యన్యాయ్యము.

తాపసి : (ప్రవేశించి) (మట్టినెమలిని చేతఁబట్టుకొని) సర్వదమనా ! ఈ శకుంతలావణ్యమును జూడుము.

బాలుఁడు : (చూపుమరల్చి) ఏదీ మాయమ్మ !

ఇద్దఱు : (నవ్వుచు) నామసాదృశ్యముచే ఈ మాతృవత్సలుఁడు మోస పోయినాఁడు.

ద్వితీయ : వత్సా ! ఈ మట్టినెమలి చక్కఁదనమును జూడుమని చెప్పితిని.

రాజు : (తనలో) ఏమి ? ఈ బాలుని తల్లి పేరు శకుంతలా ? పేరును బోలిన పేర్లుండును. ప్రస్తుత మీ సందర్భము మృగతృష్ణికవలె నాకు విషాదహేతువగుచున్నది.

బాలుఁడు : అమ్మా ! ఇది నాకు బాగుగ నిష్టపడినది.

(ఆటవస్తువును తీసుకొనును)

ప్రథమ : (ఆవేశముతో) అమ్మో ! వీని మణి బంధమున రక్షాకరండము కనఁబడలేదే ?

రాజు : ఆందోళన చెందకుఁడు. సింహవిమర్దన సమయమున ఇది జారిపడినది. (దానిని తీయ యత్నించును)

ఉభయులు : వలదు – వలదు. దానిని తాకకుఁడు. ఏమీ? ఇతఁడు తీసి పట్టుకొనినాఁడే ?

రాజు : ఏల వద్దనుచున్నారు ?

ప్రథమ : ఓ మహారాజా ! వినుము. ఇది అపరాజిత అను ఓషధి. వీని జాతకర్మ సమయమున భగవానుఁడగు మారీచమహర్షి వీని చేతికి గట్టెను. తల్లిదండ్రులును దానునుదక్క నన్యులెవ్వరును నేలపైఁ బడిన దీనినిఁ దీయఁజాలరు.

రాజు : ఒకవేళ తీసినచో. ?

ప్రథమ : పామయి వెంటనే వానిని గఱచును.

రాజు : అట్లు జరుగగా మీరు ఎప్పుడైన చూచితిరా ?

ఉభయులు : పలుసార్లు.

రాజు : (సంతోషముతో) నా మనోరథము సంపూర్ణమైనను ఇప్పుడింకను సంతోషింపలేకుంటిని.

ద్వితీయ : సువ్రతా ! రమ్ము, ఈ వృత్తాంతమును నియమ వ్యాపృతయగు శకుంతలకు నివేదింతము. (ఇరువురు నిష్క్రమింతురు)

బాలుడు : నన్ను విడిచి పెట్టుము. నా తల్లి దగ్గరకుఁ బోయెదను.

రాజు : కుమారా ! నాతోఁ గలిసి నీ తల్లిని సంతోషపరచెదవులే.

బాలుడు : నా తండ్రి దుష్యంతుఁడు. నీ వెవరు ?

రాజు : (నవ్వుచు) ఈ వివాదమే నాకు నమ్మకమును గలిగించుచున్నది. (పిమ్మట ఏకవేణీధరయై శకుంతల వచ్చును)

శకుంతల : వికృతిని జూపవలసిన సమయమందుకూడ వికారమును చూపని సర్వదమనుని వృత్తాంతమును వినినను నా భాగ్యములందింకను నాకు ఆశ జనింపకున్నది. లేదా, సానుమతి చెప్పినట్లు జరిగిన దేమో ?

రాజు : (శకుంతలనుజూచి) ఓహో ! ఈమెయే అపూర్వాంగియగు శకుంతల.

2 . ఉ॥ ధూళిచయంబు నిండఁ బరి
ధూసరమౌ వసనద్వయంబు నీ

బాల ధరించి, క్షామముఖి
పద్మయునై ఘటితైక వేణియై
పాలిత శుద్ధ శీలమయి,
వర్జితధర్మః గృపావిహీనునన్
జాలఁగ సంస్మరింపుచును,
జల్పె వ్రతంబు వియోగ దీర్ఘమున్.

శకుంతల : (పశ్చాత్తాప వివర్ణుడైన రాజును గాంచి) ఆర్యపుత్త్రుఁడు కాడా? కానిచో మరియెవ్వడు ఈ రక్షాబంధన శూన్య మద్బాలకుని దన గాత్ర స్పర్శచేఁబీడించును.

బాలుఁడు : (తల్లిని జేరి) అమ్మా! వీఁడెవ్వఁడు? పుత్త్రుఁడని పలుకుచు నన్నాలింగనముగావించుకొనుచున్నాఁడు?

రాజు : ప్రియా! నీ యందుఁజూపిన కాఠిన్యము కూడ నేఁడు అనుకూలముగనే పరిణమించినది. నీ విప్పుడు నన్ను గుర్తించి యుందువని తలంతును.

శకుంతల ; (తనలో) హృదయమా! ఊరడిల్లుము. ఊరడిల్లుము మాత్సర్యమును విడిచి నన్ను దేవుఁడనుగ్రహించినాడు. ఈతఁడు ఆర్యపుత్త్రుఁడే

రాజు : స్మరణమున మోహతమసమ్ము విరతి నందఁ,

22. గీ॥ గనఁబడితి వీవు నాదు భాగ్యంబు కతన,
అతివ! వేగమ యుపరాగ మంతరింప
విధుయోగంబుఁగనిన రోహిణియుఁబోలె.

శకుంతల : ఆర్యపుత్త్రి! – జ – (సగముపలికి అశ్రుచే నిరుద్ధకంఠయయి అగును)

రాజు : సుందరి!

23, గీ॥ రుద్ధకంఠానఁబదము నిరుద్ధమయ్యె,
జయమునేఁగొంటి నబల సందియము వలదు,
కారణము విను నీదు సంస్కారరహిత
పాటలోష్ఠము మోముఁనేఁటఁయఁగంటి.

బాలుఁడు : అమ్మా ! ఈతఁడెవఁడు?

శకుంతల : వత్సా ! నీ భాగ్యముల నడుగుము:

రాజు : (శకుంతల పాదములపైఁ బడి)

24. చం తలఁపకుమా తిరస్కృతిని,
దానిని వీడు మనమ్మునుండి, నాఁ
తలపుతమంబు నా హృదయ
మందున నిండె, నదేమి హేతువో !,
యిలఁగడు మోహితాత్మకులు
నిట్లుచరింత్రు, శుభాగమంబులన్,
దలనిడు పూలదండను వి
దల్చఁడె ? యంధుఁడ హింద్రశంకచే.

శకుంతల : (కంఁటదడిపెట్టి) లెమ్ము. ఆర్యపుత్రా, లెమ్ము. నా సుచరిత ప్రతిబంధకమగు పురాకృతము ఆదినములలోఁ బరిణామాభిముఖ మయ్యెను. ఇంతటి దయార్ద్రహృదయుఁడగు ఆర్యపుత్రుఁడు గూడ ఆనాఁడు అంత కఠినుఁడయ్యెను. (రాజు లేచును)

శకుంతల : దుఃఖితయగు నీమెను ఎట్లు స్మరింపఁ గలిగితిరి ?

రాజు : విషాదశల్యము నూడబెరికి పిదప చెప్పెదను.

25. చం విడిచితిఁ బూర్వమందధర
బింబమునొంచు త్వదీయ బాష్పమున్,
తొడిమిత మోహాంధకారమునఁ,
బుణ్యవిహీనుఁడనై సుగాత్రి !, నే
దుడిచి యరాళ పక్ష్మగత
తోయపు బిందువు వేగ నిప్పుడే,
విడువఁ గలాఁడ నామదిని
వేచు దృఢానుశయమ్ము నిమ్ముగన్.

(కన్నీటిని తుడుచును)

శకుంతల : (నామ ముద్రికను గాంచి) ఆర్యపుత్త్రా ! ఆ యుంగర మిదియే కదా !

రాజు : అవును. ఇది లభించుటచేతనే నీవు జ్ఞాపకమునకు వచ్చితివి.

శకుంతల : ఇది మిక్కిలి యపకారమాచరించినది. ఆనాఁడు ఆర్యపుత్త్రునకు జ్ఞాపకముచేయు సమయమున నాకు దుర్లభమైనది.

రాజు : అయినచో, లత ఋతు సమవాయ చిహ్నమగు కుసుమమును ధరించుగాక !

శకుంతల : దీనియందు నాకు విశ్వాసము పోయినది. మీరే దీనిని ధరియింపుఁడు.

మాతలి : (ప్రవేశించి) ఆయుష్మంతుఁడు భాగ్యవశమున ధర్మపత్నీ సహవాసమున, పుత్త్రముఖ దర్శనమున, ఆనందించుచున్నాఁడు.

రాజు : మిత్రులచే నిర్వర్తింపఁబడుటంజేసి నా మనోరథము స్వాదుతరమును సఫలమును అయినది. మాతలీ ! ఈ విషయము దేవేంద్రునకుఁ దెలియదా ?

మాతలి : (నవ్వుచు) ఈశ్వరులకుఁ దెలియనిదుండునా ? ఆయుష్మంతుఁడా ! రమ్ము. భగవంతుఁడగు మారీచ మహర్షి దర్శన మిచ్చుచున్నాఁడు.

రాజు : శకుంతలా ! పుత్త్రు నెత్తుకొనుము, నీతోఁగలిసి భగవద్దర్శన మాచరింతును.

శకుంతల : మీతోఁగలిసి గురుసమీపమున కేగుటకు సిగ్గుగా నున్నది.

రాజు : సిగ్గేల ? అభ్యుదయ కాలమందట్లుచేయవలెను. రమ్ము - రమ్ము.

(అందఱును వెళ్లుదురు)

(అదితితోఁగూడి ఆసనస్థుఁడై మారీచుఁడు ప్రవేశించును)

మారీచుఁడు : (రాజును జూచి) దాక్షాయణీ !

26. చం॥ అవిమొన నీ కుమారునకు

నగ్రసరుండయి యుండు నీతఁడా,

వననిధి పరీత భూవలయ
వల్లభుఁడూర్జిత నామధేయుఁడీ,
జనపతి చాప మంతపనిఁ
జక్కఁగఁ జల్పఁగఁ నుండు నెప్పుడే
పనియును లేక వజ్రముగ
భాసము నింద్రు కరాగ్ర భూషయై.

దాక్షాయణి : ఈయాకృతి యట్టియనుభావము గలదిగనే యున్నది.

మాతలి : ఆయుష్మంతుఁడా! ఈ దేవమాతాపితరులు పుత్రప్రీతి సూచకమగు చూపుతో నిన్నే చూచుచున్నారు. కావున పదము.

రాజు : మాతలీ!

27, సీ॥ పండ్రెండు విధములఁ బరగు తేజములకు
నెవ్వరు జనకులై నివ్వటిలిరొ,
భువనత్రయంబును బ్రోచెడి యజ్ఞభా
గేశ్వరు నింద్రుని నెవరుగనిరొ,
కమలయోనికి ముందు కలిగిన పురుషుండు
నెచట జననమంది యేపుఁగనెనొ,
ఏకాంతరతిఁబయి యెవరు బ్రహ్మకుఁగూడ
నొప్పుచునుందురో మెప్పుఁదనుచు

ఆ. వె. దక్షుఁడను మరీచి తమ తండ్రులై యొప్పఁ
బరగుచుందు రెవరు ధరణి యందు
అమర వర్య వీర లట్టి దంపతులౌదు
రదితి కశ్యపులన విదితులైరి.

మాతలి : అవును.

రాజు : (సమీపించి) వాసవనియోజ్యుఁడగు దుష్యంతుఁడు మీకిరువురకు నమస్కారములను గావించుచున్నాఁడు

మారీచుఁడు : వత్సా ! చిరకాలము మహీమండలముఁబాలింపుము

అదితి : అప్రతిరథుఁడవు కమ్ము

శకుంతల : దారక సహితనై మీ పాదవందనము గావించుచున్నాను.

మారీచుఁడు : వత్సా !

28 గీ॥ పతియునయ్యె నాఖండల ప్రతిముఁడల్ల
పుత్త్రుఁడో యాజయంతుని బోలియుండె.
ఒండు దీవన నీకేల యువిద ! యిపుడు
సాధ్వి ! నీ వాశచీదేవి సదృశవగుమ.

అదితి : వత్సా ! భర్తకు బహుమతవగుము. నీ పుత్త్రుఁడు తప్పక దీర్ఘాయువై యుభయకుల నందనుఁడగుగాక. కూర్చొనుడు,
[అందఱున ప్రజాపతి చుట్టు కూర్చుందురు]

మారీచుఁడు : [ఒక్కొక్కరిని జూపుచు]

29 గీ॥ ఈ శకుంతల యతిసాధ్వి యిష్టపత్ని
మతుఁడు యోగ్యుఁడు సుతుఁడు, పుణ్యుండ వీవు,
శ్రద్ధ విత్తంబు విధియును జక్కఁగలిసె
మూఁడునిచ్చోట విట్టుల మూల్యములయి.

దుష్యంతుఁడు , భగవంతుఁడా ! ముందుగా నభీష్ట సిద్ధి. పిదప భవద్దర్శనము. కావున మీయనుగ్రహమపూర్వము. చూడుఁడు.

30, గీ॥ పుట్టుఁ గుసుమము మును. వెన్కఁ బొడము ఫలము,
వారిదము ముందు, పిదప నా వర్షచయము,
కార్యకారణముల కిది క్రమము, గాని,
నీ ప్రసాదంబునకు మున్నె నెగడె ఫలము.

మాతలి : సృష్టికర్త లిట్లే యనుగ్రహింతురు,

రాజు : భగవానుఁడా ! ఈ మీయాజ్ఞాకారిణిని గాంధర్వవిధిని వివాహమాడి కొంతకాలమునకు బంధువు లీమెను దోడ్కొనిరాగా జ్ఞాపకములేక

తిరస్కరించి పూజ్యులును యుష్మత్సగోత్రులును అగు కణ్వులకు అపరాధమాచరించితిని, ఈ యంగుళీయక దర్శనమున ఆమెను వివాహమాడినట్లు గుర్తించితిని. ఇది యంతయు నాకు చిత్రముగ నున్నది.

31, గీ॥ ఎదురుగానున్న కాదిది యేనుఁగనుచుఁ
గదలిపోవంగ నేనుఁగు మెదలెననుచుఁ
బదములను జూచి యేనుఁగేకద యటంచు
నెదను దలఁచిన యట్లైతి మదిని వికృతి.

మారీచుఁడు : వత్సా! అపచారము గావించితినని యేల శంకించెదవు. నీ యందామె సమ్మోహము తగియేయున్నది. వినుము.

రాజు : అవహితుఁడను.

మారీచుఁడు : అప్సర స్తీర్థావతారమునుండి తిరస్కార దుఃఖితయగు నీ శకుంతలను గ్రహించి మేనక యెప్పుడు దాక్షాయణీ సన్నిధిని జేరెనో, యప్పుడే దివ్యదృష్టిచే నంతయును గ్రహించితి. దుర్వాస శ్శాపమున నీ సహధర్మచారిణి నీచే తిరస్కృతయైనది. మఱి యేమియునుగాదు. ఆ శాపము అంగుళీయక దర్శనావసానము.

రాజు : (నిట్టూర్చి) నిందనుండి యిప్పుడు విడువబడితిని.

శకుంతల : (తనలో) ఆర్యపుత్త్రుఁడు నిష్కారణముగ నన్ను తిరస్కరింలేదు. అదృష్టమే. నిజముగా అప్పుడు నన్ను వేరు తెలిసికొంటినో? లేదో! విరహశూన్య హృదయనగు నాకు ఆశాపము వచ్చియుండును. అందులకే నా సఖులు గూడ పతి కుంగరము చూపవలయునని పలికిరి.

మారీచుఁడు : [శకుంతలను జూచి] వత్సా! తెలిసినదానవు. నీ పతిపైఁ గోపము నుంచుకొనకుము.

32. ఉ॥ శాప వశమ్మునన్ విభుఁడు
సంస్మరణం బొనరింపలేక, వి
ప్రావను నిన్ త్యజించె. నిఁక

శాపము పోవ నిసున్ గ్రహించె, సం
శాపము చెందనేల ?, శుచి
దర్పణమందు ఫలించు ఛాయ, కా
నీ, పరిపూర్ణమై రజము
నిండిన, నెట్లు ఫలించు చెప్పుమా ?

రాజు : భగవంతుడా ! ఈమె యందే నా వంశము ప్రతిష్ఠితమైనది.

మారీచుఁడు : అట్లే. ఈతఁడు చక్రవర్తి కాఁగలడు. చూడుము.

33. చం॥ అరథము నెక్కి, యంబుధుల
నన్నిటి దాటి, యనర్గళంబుగా
ధరణి జయించు, నప్రతిర
థత్వమునన్ సరి యేడు దీవులం,
దరపెను నేఁడు సర్వదమ
నాఖ్యను, జంతుల నెల్ల నొంచుటన్
భరతుఁడటంచుఁ బేర్వడయు
భావిని భూభరమెల్లఁ దాల్చుటన్.

రాజు : భగవంతునిచే సంస్కారమందిన పిదప అన్నియును లభించు ననియే యనుకొందును.

అదితి : భగవానుఁడా ! తన పుత్రి మనోరథము నెరవేరినదని కణ్వునకుఁ బరివారముద్వారా తెలియఁజేయుఁడు.

శకుంతల : (తనలో) నా కోరికను భగవతియే తెల్పినది.

మారీచుఁడు : ఆ పూజ్యునకు తపఃప్రభావమువలన అంతయును అవగతమే.

రాజు : అందుచేతనే యామహాముని నన్నంత ఆగ్రహింపలేదు.

మారీచుఁడు : అయినన్ను ఈ ప్రియవార్త పంపఁదగినదే ! ఎవరక్కడ ?

శిష్యుఁడు : [ప్రవేశించి] అయ్యా ! నేను

మారీచుఁడు : గాలవ ! ఇప్పుడే ఆకాశమార్గమునఁబోయి పుత్త్రిపతియగు శకుంతల శాపావసానము కాగానే సంజాతస్మృతియగు దుష్యంతునిచే పరిగ్రహింపఁబడినదని నామాటగా ఈ ప్రియ వార్తను పూజ్యుఁడయిన కణ్వునకెరింగింపుము.

శిష్యుఁడు : అట్లే చేయుదును. [వెడలును]

మారీచుఁడు : వత్సా : నీవు గూడ భార్యాపుత్త్రులతోఁగూడి నీ మిత్రుఁడగు వింద్రుని రథము నధిష్ఠించి నీ నగరమున కేగుము.

రాజు : అట్లే చేయుదును.

మారీచుఁడు : [రాజును జూచి]

34 చం॥ అధికముగా సువృష్టులమ
రాధిపుఁడిచ్చుత నీకు నెప్పుడున్,
విధి విహితంబుగా సవన
భేదముల స్దవియింపు మాతనిన్,
ముదమున నిట్టులొండొరులు
ముఖ్యములౌ పనులాచరించి, మీ
రధిగత కీర్తులై మనుఁ
దనంత యుగంబులుదార భావులై ౹

రాజు : భగవంతుఁడా ! యథాశక్తి శ్రేయములకు యత్నింతును.

మాతలి : నీ కింకను మేము చేయవలసిన ప్రియమేమున్నది?

రాజు : ఇంతకంటె వింకను తమరనుగ్రహింపఁదలంచిన భరత వాక్యమిదియగుగాక !

35. గీ॥ పార్థివుఁడు ప్రకృతి హితుఁడై పరుగుగాత !
బహువిదుల భారతియుఁ బూజఁబడయుగాత :
నీలలో హితుఁడా శక్తికీలితుండు
మరల పుట్టువు లేక నన్మనుచుగాత !
(అందరును నిష్క్రమింతురు)

సమాప్తము

—ఓం తత్సత్—

# తప్పొప్పుల పట్టిక

| పేజి | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 1 | గ్రంధ | గ్రంథ |
| | పార్ధవతీ | పార్వతి |
| | తరదిత | తదితర |
| | కపయః | కవయః |
| | భూయిష్ద | భూయిష్ఠ |
| 2 | మజలా | మడలా |
| | గ్రంధ | గ్రంథ |
| | యని | అని |
| | మల్లినాధ | మల్లినాథ |
| 3 | మల్లినాధుని | మల్లినాథుని |
| 4 | విద్యాంసు | విద్వాంసు |
| 5 | విద్యాంసు సాధవు | విధ్వాంసు సాధువు |
| | పరీక్ష్యా | పరీక్షా |
| 6 | యధార్ధా | యథార్థా |
| | స్సిర్త భక్తి | స్థిర భక్తి |
| | మహేయతామ్ | మహీయతామ్ |
| 7 | ప్రధమ | ప్రథమ |
| 8 | యధార్ధము | యథార్థము |
| 9 | నాటకి | నాటక |
| 10 | మాధవ్యుడు | మాఢవ్యుడు |
| 4 | ఇతి | ఐతి |
| 15 | ప్రధమాంక | ప్రథమాంక |
| | దర్పాపలీధ | దర్పావలీఢ |
| 16 | రధ | రథ |
| | రధ | రథ |
| 17 | నేపధ్య | నేపథ్య |
| | రధ | రథ |
| 25 | గన్పటు | గన్పట్టు |
| 26 | ఉధార | ఉదార |
| 27 | తపస్యులు | తపస్వులు |
| 29 | సన్నధులరై | సన్నద్ధులరై |
| 34 | ముగ్ధక్షిత్రముల | ముగ్ధక్షితముల |

| పేజి | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 35 | కాయయంబు | కాయంబు |
| | మాధవ్యుడు | మాఢవ్యుడు |
| | దిమరే | దమరే |
| | గార్మ్శ్య | గార్శ్య |
| 36 | బెలఁగు | జెలంగు |
| 38 | సురయువతి | సురయువతి |
| 40 | వివ్రత | వివృత |
| | ఆశమము | ఆశ్రమము |
| | మునుపిడు | మునులిడు |
| 41 | రాజుతో | రాజులో |
| | నుత్యుకత | నుత్సుకత |
| 43 | మాధవ్య | మాఢవ్య |
| | రధము | రథము |
| | రెడును | రెండును |
| 44 | శకంతలి | శకుంతల |
| | శాజ | శాద |
| | దుది | మది |
| 45 | పరపతి | పరవతి |
| 46 | వజ్రసారములు | వజ్రసారముల |
| 47 | గ్రంధ | గ్రంథ |
| 48 | యధార్థ | యథార్థ |
| | అతిక్కృశ | అతికృశ |
| 50 | బుపాయ | ఉపాయ |
| | క్కృశించి | కృశించి |
| 53 | అధిష్టించు | అధిష్ఠించు |
| | మన్మధుని | మన్మథుని |
| 55 | మానసీయులయదచెలు | మానసీయులయెడ చెలుల |
| 56 | కొంచము | కొంచెము |
| | మనోరధము | మనోరథము |
| 57 | లతామండపమునే | లతామండపముననే |
| | సార | స్ఫార |
| 60 | ఎలా | |
| 61 | పరాఙ్ముఖుఁడైల | పరాఙ్ముఖుఁడైన |
| 62 | శకుంతలదనియు | శకుంతలదని |

| పేజీ | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 63 | చాలా | చాల |
| | నేపధ్యము | నేపథ్యము |
| | దేవి శబ్దము | దేవీశబ్దము |
| 64 | భర్తికు | భర్తకు |
| | దుఖించు | దుఃఖించు |
| | బాలికలు | బాలకులు |
| | నింబగు | నిభంబగు |
| 65 | కన్పడు | కన్పడు |
| 68 | భగినయగు | భగినియగు |
| 70 | దెవిలిసి | దెలిసి |
| 71 | సందేమును | సందేశమును |
| 72 | మపారన్దాల్చి | మింపారన్దాల్చి |
| 73 | రమ్యాశ్రఘూమమి | రమ్యాశ్రమ భూమి |
| | తపోకనుష్ఠానము | తపోఽనుష్ఠానము |
| 75 | నేమిరి | నేమరి |
| 77 | కౌశ్యప | కాశ్యప |
| | యధావిధి | యథావిధి |
| | వస్రాంచలము | వస్త్రాంచలము |
| 78 | స్వసుఖములయందు | స్వసుఖములయందు |
| 79 | అధిష్టించి | అధిష్ఠించి |
| 80 | విప్రలబ్ద | విప్రలబ్ధ |
| 81 | 7 పంక్తులు మరలపడినది. | |
| 82 | తుల్యాగుణులగు | తుల్యగుణులగు |
| 84 | యెఱుంగనేమి | యెఱుంగలేమి |
| | వాదగా | నాదగా |
| 85 | మూసుకొని | మూసికొని |
| 88 | యధార్థముల్ | యథార్థముల్ |
| 89 | పరకాంతశ్లేష | పరకాంతాశ్లేష |
| | సందియమునందు | సందియమ్మునందు |
| 90 | ప్రథమ | ప్రథమ |
| | విస్మృథ | విస్మృత |
| | దూరముగా | దూరముగ |
| 91 | ఎమ్మాయి | ఎమ్మెయి |
| 92 | శ్రోతియుండు | శ్రోత్రియుండు |
| 93 | స్యాల్యకుఁడు | స్యాలకుఁడు |

| పేజి | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 94 | ప్రధమ | ప్రథమ |
| | ఎనుగు | ఏనుగు |
| 95 | ప్రవేంశించును | ప్రవేశించును |
| | సగముకూడ | సగము నాకు కూడ |
| | పాదగ్రముపై | పాదాగ్రముపై |
| 96 | అర్థకృష్ఠ | అర్ధకృష్ఠ |
| 104 | చిత్రగీత | చిత్రలిఖిత |
| 105 | వితధంబు | వితథంబు |
| 108 | యధార్ధము | యథార్ధము |
| 113 | లక్ష్యవకానటుల్ | లక్ష్యమౌనటుల్ |
| 115 | ఇంద్రాజ్ఞి | ఇంద్రాజ్ఞ |
| | రధము | రథము |
| 116 | రధారూఢుడై | రథారూఢుడై |
| 117 | వరుణుండు | నరుణుండు |
| | నాకప్రష్ఠ | నాకపృష్ఠ |
| 120 | య త్తమ | యు త్తమ |
| | ఊరధ్వ | ఊర్ధ్వ |
| 121 | పారిజాతందిక | పారిజాతాదిక |
| | దాస్నానముల్ | స్నానముల్ |
| 122 | సత్యముల | సత్వముల |
| | భేదమున | భేదము |
| 126 | అప్సర సంబంధము | అప్సరస్సంబంధము |
| | ఆశౌ కారణము | ఆశాకారణము |
| 129 | సుగాతి | సుగాత్రి |
| 130 | యిండు | యుండు |
| 131 | దక్షుడను | దక్షుడును |
| | ఒదగు | బరగు |
| 132 | అందఱున | అందఱును |
| 133 | తెలిసికొటింనొ | తెలిసికొంటనొ |
| 135 | సంజాతస్మ్రితి | సంజాతస్మృతి |
| | రధము | రథము |
| | అధిష్ఠించి | ఆధిష్ఠించి |
| | అధిగతకి ర్తులై | అధిగతకీ ర్తులై |
| | యధాశ క్తి | యథాశక్తి |